అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

శుక్రవారం 08-3-2024 | సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 20 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

దురుద్దేశపూరితం

- పారదర్శకతకు విఘాతం
- ఎస్బీఐపై సుప్రీంలో కోర్టు ధిక్కరణ పిటిషన్
- దాఖలు చేసిన ఏడీఆర్, కామన్‌కాజ్ 11లో..





లడఖ్‌లో భారీ నిరసన ప్రదర్శన

కేంద్రం సహకరించకపోతే

కొట్లాడుతం..

ప్రజల కోసమే ఒక మెట్టు దిగా..


అల్వాల్ బహిరంగసభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రజావసరాలను మరిచిన గత ప్రభుత్వం
- నగరాభివృద్ధికి కేటీఆర్ ఆమరణ దీక్ష చేస్తే తాము సహకరిస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో గంజాయి, డ్రగ్స్ పెరిగాయని వ్యాఖ్య
- జాతీయ రహదారి ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన
- పలు కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

"హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేస్తాం.. నగరానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది కాంగ్రెస్సే.. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరించకపోతే కొట్లాడుతాం.. ప్రజల అవసరాల కోసమే ఒక మెట్టు దిగా తప్పితే.. రాజకీయాల కోసం కాదు.. ప్రజావసరాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మరిచింది.. రానున్న రోజుల్లో కంటోన్మెంట్‌ను అభివృద్ధి చేస్తాం.." అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గురువారం పర్యటించిన సీఎం, జవహర్‌నగర్ ఆర్మీ డెంటల్ కాలేజీ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సికింద్రాబాద్ అల్వాల్ టిమ్స్ సమీపంలోని జాతీయ రహదారి (ఎస్‌హెచ్01) ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజల అవసరాన్ని మరిచిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. రాజీవ్ రహదారి (ఎస్‌హెచ్01) ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును పక్కన పెట్టిందన్నారు. తాము అధికారంలోకి రాగానే ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి, ఈ ప్రాజెక్టు అవసరాన్ని వివరించి సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఈ కారిడార్ పూర్తయితే మేడ్చల్, కుత్బుల్లాపూర్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు ప్రయాణం సులభతరం అవుతుందన్నారు. అలాగే మేడ్చల్ ప్రాంతంతోపాటు ఉత్తర తెలంగాణ ...11లో

తాడిచెర్ల సింగరేణికే...

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

10లో..


కేంద్రమంత్రితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైకోర్టులో సర్కారుకు షాక్

- ఎమ్మెల్సీల నియామకం గెజిట్ కొట్టివేత
- క్యాబినెట్ నిర్ణయాన్ని గవర్నర్ తిరస్కరించిందంటూ వ్యాఖ్య
- ఎమ్మెల్సీల నియామకంపై సర్కార్ పున:సమీక్షించాలంటూ సూచన
- దాసోజు, కుర్రా కేసులో హైకోర్టు ఉత్తర్వులు

నవతెలంగాణ - హైదరాబాద్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ ఇద్దరినీ ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను కొట్టేసింది. దాసోజు శ్రవణ్, కూర సత్యనారాయణల ఎన్నికను గవర్నర్ పున:పరిశీలించాలని ఆదేశించింది. అప్పటి మంత్రి మండలి నిర్ణయానికి గవర్నర్ కట్టుబడి ఉండాల్సిందేనని సూచించింది. మళ్లీ కొత్తగా ఎమ్మెల్సీల నియామకాలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే... గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆ పార్టీ నేతలు దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణను ఎమ్మెల్సీగా నామినెట్ చేస్తూ మంత్రి మండలి తీర్మానం చేసింది. ఆ నిర్ణయాన్ని గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ గత ఏడాది సెప్టెంబర్ 19న తిరస్కరించారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వారిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. గవర్నర్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా తమ పరిధి దాటి వ్యవహరించారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీలను నియమించే హక్కు మంత్రి మండలికి ఉందనీ, దాని ప్రకారమే వారిని సిఫారసు చేశారని పిటిషనర్లు వాదించారు. ఈ కేసు హైకోర్టులో కొనసాగుతుండగానే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ స్థానంలో కాంగ్రెస్ అధికారాన్ని ...10లో

మోడీకి సెగ

ప్రధాని కాశ్మీర్ తొలి పర్యటనలో గళమెత్తిన జనం

- లఢక్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనంటూ భారీ నిరసన
- నిరాహార దీక్ష ప్రారంభించిన మెగసెసే అవార్డు గ్రహీత వాంగ్‌చుక్

లఢక్ : జమ్మూకాశ్మీర్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీకి నిరసన సెగ తగిలింది. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోడీ గురువారం జమ్మూకాశ్మీర్‌లో పర్యటించారు. అయితే లఢక్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. లఢక్ ప్రాంతంలోని లెహ్‌లో దుకాణాలు, వ్యాపార సంస్థలన్నింటినీ మూసివేశారు. ప్రజా జీవనం పూర్తిగా స్తంభించింది. మరోవైపు ఈ నెల 4న కేంద్ర హోం మంత్రిత్వ శాఖతో జరిపిన చర్చలు విఫలమవడంతో 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తానని పర్యావరణ కార్యకర్త, మెగసెసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్ ప్రకటించారు.

నేను సోనమ్ వాంగ్‌చుక్‌ని. హిమాలయాల నుండి ప్రపంచ ప్రజలకు ఓ సందేశాన్ని అందజేస్తున్నాను. ఈ రోజు నుండి ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటున్నాను. ఇది దశల వారీగా జరుగుతుంది. ఒక్కో దశలో 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తాను. అవసరమైతే పొడిగిస్తాను. మహాత్మా గాంధీ కూడా స్వాతంత్రోద్యమంలో 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేశారు. ఆయన చేసిన సుదీర్ఘ దీక్ష అదే. ఆయన నడిచిన ...2లో

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ : మోడీ



'వికసిత్ భారత్ వికసిత్ జమ్మూకాశ్మీర్' కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోడీ శ్రీనగర్‌లో పర్యటించారు. రూ.6,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, వాటిని జాతికి అంకితం చేశారు. ఆర్టికల్ 370 రద్దుపై కాంగ్రెస్, దాని భాగస్వామ్య పక్షాలు జమ్మూకాశ్మీర్ ...2లో

కాలం కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

సీఎం పక్కనే మానవ బాంబులు



- మేడిగడ్డ బ్యారేజీకి సత్వరమే మరమ్మతులు చేయాలి
- లోవోల్టేజీతో కాలుతున్న మోటార్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

నవతెలంగాణ - కరీంనగర్

తెలంగాణలో కరువు ప్రస్తుతం కాలంతో వచ్చింది కాదు.. అధికార కాంగ్రెస్ పార్టీ తెచ్చిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈనెల 12న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ మైదానంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ సన్నాహక సమావేశం నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో గురువారం నిర్వహించారు. అనంతరం ఆయన కరీంనగర్ రూరల్ మండలంలోని ఇరుకుల్లా గ్రామంలో ఎండిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రైతాంగ అభివృద్ధి కోసం పదేండ్లపాటు అవిశ్రాంతంగా పనిచేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కృషిని నీరుగార్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చెప్పేవన్నీ పచ్చి అబద్దాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఏడేండ్ల కాలంలో ఏనాడూ తెలంగాణలో కరువు రాలేదని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చిన మైలేజీని ...2లో

మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడి అక్రమ నిర్మాణాలు కూల్చివేత

కోర్టు పరిధిలో ఉండగా కూల్చివేతలా..? : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

- ఇది ముమ్మాటికీ కక్ష సాధింపే..:బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రభుత్వ స్థలంలో వేసిన రోడ్డును తొలగించిన అధికారులు.. తాజాగా ఆయన అల్లుని కాలేజీకి సంబంధించిన అక్రమ నిర్మాణాలనూ కూల్చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మర్రి లక్ష్మణ్‌రెడ్డికి సంబంధించిన ఎంఎల్ఆర్ఐటీ ఇంజినీరింగ్, ఏరోనాటికల్ కళాశాలల్లో అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. కొద్ది రోజుల కిందటే కలెక్టర్ కలెక్టర్ నేతృత్వంలో అధికారులతో కలిసి పర్యటించి 405, 482, 484, 488, 592 సర్వే నెంబర్‌లలో పూర్తిగా 8 ఎకరాలలో కబ్జా చేసి కాలేజీ నిర్మాణాలు జరిగినట్టు గుర్తించారు. దాంతో గురువారం ఉదయం జేసీబీతో అధికారులు కూల్చివేతలు చేపట్టారు. అయితే అధికారులు కూల్చి వేస్తుండగా విద్యార్థులు అడ్డుగా రాగా.. పోలీసులు వారిని అక్కడి నుంచి ...2లో



పీఎస్‌యూల్లో ఆగని డిజిన్వెస్ట్‌మెంట్

ఎన్నికల వేళ ఎన్ఎల్‌సీలో వాటాల విక్రయం

- రూ.2,100 కోట్ల సమీకరణ



ముంబయి : సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతోన్న సమయంలోనూ మోడీ సర్కార్ పీఎస్‌యూల్లో వాటాల విక్రయాన్ని దర్జాగా కొనసాగిస్తోంది. ఎన్ఎల్‌సీ ఇండియా (ఇంతక్రితం నైవేలీ లిగ్నైట్ కార్ప్)లో 7 శాతం వాటాలను ప్రయివేటు శక్తులకు కట్టబెట్టే ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకోసం గురువారం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)ను తెరిచింది. ఇందులో రూ.2,100 కోట్ల విలువ చేసే 6.9 కోట్ల షేర్లను విక్రయించనుంది. సోమవారం రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి బిడ్లకు అవకాశం ఇవ్వగా. అదే రోజు ఇష్యూను ముగించనుంది. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా మార్కెట్లకు సెలవు. ఎన్ఎల్‌సీ ఇండియాలో ప్రస్తుతం కేంద్రానికి 79.2 శాతం వాటా ఉంది. ఈ ఓఎఫ్ఎస్‌కు ఐసీఐసీఐ సెక్యూరిటీస్, డీఏఎం క్యాపిటల్ అడ్వైజర్స్ లిమిటెడ్ బ్రోకర్స్‌గా వ్యవహరిస్తున్నాయి. తాజా వాటాల విక్రయం తర్వాత ఎన్ఎల్‌సీలో ప్రభుత్వ వాటా 75 శాతం దిగువకు పడిపోనుంది. ఇటీవల ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో రూ.50వేల కోట్ల విలువ చేసే పీఎస్‌యూల ...11లో

ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా విడుదల

- సజీవంగా బయటకు రావడం ఆశ్చర్యమే : సాయిబాబా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మావోయిస్టులతో సంబంధమున్న కేసులో నిర్దోషిగా ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా గురువారం నాగ్‌పూర్ జైలు నుంచి విడుదలయ్యారు. ముంబాయి హైకోర్టు తీర్పు ఇచ్చిన రెండు రోజుల అనంతరం విడుదలైన ఆయన విలేకరులతో మాట్లాడారు. "నా ఆరోగ్యం ఎంతో క్షీణించింది. ప్రస్తుతం మీతో మాట్లాడలేను. నాకు చికిత్స అవసరం. ఆరోగ్యం కుదుటపడిన అనంతరం మీతో మాట్లాడతా" అని అన్నారు. తన ...11లో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు శాతం డీఏ పెంపు



- పెట్టుబడిదారుల ప్రోత్సాహకాల పథకానికి ఆమోదం
- లోక్‌సభ ఎన్నికల ముందు మోడీ సర్కార్ తాయిలాలు

ఉజ్వల పథకం కింద గ్యాస్ సిలిండర్ రాయితీ గడువు పొడిగింపు : కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరవు భత్యం (డీఏ) 4 శాతం పెరిగింది. దీంతో ఇప్పటివరకు ఉన్న 46 శాతం డీఏ 50శాతానికి ...11లో

సమాన పనికి సమాన వేతనం ఏది?

స్త్రీ,పురుషుల జీతాల్లో భారీ వ్యత్యాసాలు | యాజమాన్యాలతో చర్చించడంలోనూ సమస్యలే



- పని ప్రదేశాల్లో లింగ వివక్ష : మహిళా ఉద్యోగులపై క్రిసిల్, డీబీఎస్ బ్యాంక్ ఇండియా సర్వే

'సమాన పనికి సమాన వేతనం' అనే సిద్ధాంతం మహిళలకు వర్తించడం లేదు. పురుషులతో సమానంగా వారు విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ జీతాలు మాత్రం తక్కువగానే ఉంటున్నాయి. ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో 23 శాతం మంది ఇలా తక్కువ జీతాలతో సరిపెట్టుకుంటున్నారు. 16 శాతం మంది మహిళా ఉద్యోగులు వివక్షను ఎదుర్కొంటున్నారు. రేటింగ్ సంస్థ క్రిసిల్, డీబీఎస్ బ్యాంక్ ఇండియా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.

న్యూఢిల్లీ : సర్వే ప్రకారం మహిళా ఉద్యోగులు భిన్నమైన వాతావరణంలో జీవితాలను గడుపుతున్నారు. ఇందులో 69 శాతం మహిళా ఉద్యోగులు ప్రధానంగా మెరుగైన జీతాన్ని, కెరీర్‌లో ఉన్నతిని కోరుకుంటున్నారు. స్వయం ఉపాధి పొందుతున్న మహిళల్లో 42 శాతం మంది స్వతంత్రతకు, అనుకూలమైన పనిగంటలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఆసక్తికరమైన విషయమేమంటే కేంద్ర కార్యాలయాల్లో కాకుండా బ్రాంచీలలో పనిచేయడానికి మహిళా ఉద్యోగులు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కేవలం 3 శాతం మంది మాత్రమే బ్రాంచి కార్యాలయాల్లో పనిని కోరుకుంటున్నారు. ఇక స్వయం ఉపాధి పొందుతున్న మహిళల విషయానికి వస్తే సంపదను పెంచుకోవడం, వ్యాపారంలో పురోభివృద్ధి సాధించడంపై ఆసక్తిని కనబరుస్తున్నారు. దేశంలోని పది నగరాల్లో పనిచేస్తున్న 800 మంది మహిళా ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వారిని ఇంటర్వ్యూ చేసి ఈ సర్వేను ...2లో

మేడిగడ్డ పగుళ్ల పరిశీలన

సందర్శించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ బృందం

11లో..



కాలం కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

(మొదటిపేజీ తరువాయి)

చెరిపేసేందుకే మేడిగడ్డ బ్యారేజీని మరమ్మతు చేయడం లేదని ఆరోపించారు. తమ పార్టీ మీద ఉన్న కోపాన్ని రైతులపై రుద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీలో కాపర్ డ్యాం నిర్మించి.. ఒక పంపుతోని అయినా, నీళ్లు తోడి పొలాలకు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎండిపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని, ఈ సీజన్లో కొనుగోలు చేసే వడ్లకు 500 చొప్పున బోనస్ ఇచ్చేందుకు వెంటనే జీవో విడుదల చేయాలన్నారు. చాలామంది రైతులకు నేటి వరకు రైతుబంధు రాలేదని, పంట సాగు కోసం రైతులు తిరిగి వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని వాపోయారు. లోవోల్టేజి కరెంట్ ఇవ్వడం వల్ల మోటార్లు కాలిపోతుండటంతో చిన్న సన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఎస్సారెస్పీ నుంచి నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా.. కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఎక్కడా రావడం లేదని, రైతు సమస్యలు పట్టించుకోకుంటే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. అలాగే మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'గొంతుకోస్తా.. మానవబాంబై పేలుతా అంటున్నారు.. ఆయన పక్కనే మానవబాంబులు ఉన్నాయి.. అవే ఆయన్ని కూల్చుతాయి' అని అన్నారు. రేవంత్‌ను ఖమ్మం, నల్లగొండ బాంబులే ఏమైనా చేయొచ్చని, బీఆర్ఎస్ నుంచి ఆయనకు ఎలాంటి ప్రమాదం ఉండదని చెప్పారు. ఐదేండ్ల పాలన చూసాకే.. ఎవరు గొప్పవాళ్లో ప్రజలకు తెలుస్తుందన్నారు. కరీంనగర్ అభివృద్ధిపై మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ ఎవరు ఏం చేశారో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణరావు, మెండి చంద్రశేఖర్, నాయకులు చల్లా హరిశంకర్, ఏనుగు రవీందర్‌రెడ్డి, సంపత్‌రావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడి అక్రమ నిర్మాణాల కూల్చివేత



(మొదటిపేజీ తరువాయి)

పంపించారు. ఒకానొక సమయంలో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు కె.పి వివేకానంద, మాధవరం కృష్ణారావు, శంభీపూర్ రాజు, బండారి లక్ష్మారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పాలనను విస్మరించి ప్రతిపక్షాల ఆస్తులను కూల్చివేయడం పనిగా పెట్టుకోవడం అమానుషమన్నారు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపేనని.. కూల్చివేతలను ఖండిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రజలు గమనించాలని, హామీలను నెరవేర్చలేక ప్రజల దృష్టి మరల్చడానికే ఈ కూల్చివేతలు జరుపుతున్నారన్నారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము 25 సంవత్సరాలుగా కళాశాలలను నడుపుతున్నామని, మొత్తం 55 ఎకరాల స్థలంలో 40 ఎకరాలు పట్టా భూమి ఉందని తెలిపారు. 15 ఎకరాల భూమికి సంబంధించి ఆనాటి గ్రామపంచాయతీ హయాం నుంచి ఉందన్నారు. ఆ స్థలానికి ప్రతి సంవత్సరం లక్షల్లో పన్ను కడుతున్నామని, ఆ స్థలంపై ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసి ఉన్నాయని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న ఈ వివాదానికి సంబంధించి జడ్జి సైతం సోమవారం వరకు వేచి ఉండాలని అధికారులను ఆదేశించినప్పటికీ, కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కూల్చివేతలు చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్‌ను కలిసే లోపల మరింత సిబ్బంది, బలగాన్ని పెంచి భవనం కూల్చివేతలు చేపట్టారన్నారు. కూల్చివేతల్లో మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ, డీఈ శ్రీనివాస్, అధికారి సాయిబాబా, దుండిగల్ సీఐ శంకరయ్య ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోడీకి సెగ

(మొదటిపేజీ తరువాయి)

శాంతియుత మార్గంలో నేనూ నడవాలని అనుకుంటున్నాను. నాకు నేనే బాధ పడతాను. ఎవరినీ బాధ పెట్టను' అని బుధవారం లెహ్‌లో జరిగిన భారీ ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ వాంగ్‌చుక్ చెప్పారు. ఈ దీక్షలో మరి కొంతమంది భాగస్వాములవుతారని కాంగ్రెస్ నేత నామ్‌గియాల్ తెలిపారు. లఢక్‌లో రాజ్యాంగంలోని ఆరో షెడ్యులును అమలు చేసి, రాష్ట్ర హోదా కల్పించాలన్న తమ డిమాండ్‌ను కేంద్రం తిరస్కరించిందని ఆయన చెప్పారు. లఢక్‌లో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన ప్రారంభించాలని వారు నిర్ణయించారని అన్నారు.

తమ డిమాండ్‌ను రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని దృష్టికి తెచ్చేందుకు ప్రజలు భారీ ప్రదర్శన చేపట్టారు. మరోవైపు లెహ్ అపెక్స్ బాడీ (ల్యాబ్), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కేడీఏ)తో చర్చలు కొనసాగుతున్నాయని కేంద్రం తెలిపింది. అయితే చర్చల్లో ప్రతిష్టంభన కొనసాగుతోందని ల్యాబ్ కో-చైర్మెన్ లక్రుక్ చెప్పారు.

ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీకి మంచి రోజులు

- కర్మాగారం పునరుద్ధణకు అడుగులు వేసిన రాష్ట్ర సర్కారు
- ఇప్పటికే అధ్యయన కమిటీ నివేదిక అందజేత
- ఫ్యాక్టరీ యాజమాన్యంతో ముఖ్యమంత్రి సమీక్ష



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీకు మంచి రోజులు రానున్నాయా? పరిశ్రమను పునరుద్ధరించేందుకు కాంగ్రెస్ ముందడుగు వేస్తోంది. అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే ఫ్యాక్టరీ పునరుద్ధరణకు అధ్యయన కమిటీ వేసిన రాష్ట్ర సర్కారు ఆ నివేదికను పరిశీలిస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్యాక్టరీ యాజమాన్యంతో సమీక్షించారు. ఈ క్రమంలో బుధవారం ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం ఫ్యాక్టరీని సందర్శించింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఫ్యాక్టరీని మళ్లీ ప్రారంభించి విలువ ఆధారిత పరిశ్రమగా తీర్చిదిద్దుతామని హామీ ఇవ్వడం పట్ల జగిత్యాల జిల్లా చెరుకు రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

జగిత్యాల జిల్లా చెరుకు రైతులకు రాష్ట్ర సర్కారు నెల కిందటే తీపికబురు అందించింది. ముత్యంపేటలో మూతపడిన చక్కెర పరిశ్రమను తెరిపించాలని ఏడేండ్లుగా పోరాటం చేస్తున్న రైతులకు భరోసా కల్పించింది. 2014కు ముందు బీఆర్ఎస్ సర్కార్ హామీ ఇచ్చినా. పదేండ్ల పాలనలో పున్ణప్రారంభించకపోవడంతో కర్మాగారం తుక్కుగా మారిపోయింది. ఫలితంగా వేలాది మంది రైతులు తమ పంటను కామారెడ్డి జిల్లాకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చక్కెర ఫ్యాక్టరీ కోసం 9 నెలలగా రైతు నిరసన

» దీక్షవిరమింపజేయించిన మంత్రి

ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలని వేడుకుంటూ ఓ రైతు వినూత్నంగా తొమ్మిది నెలలుగా నిరసన చేపట్టారు. మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన రైతు మామిడి నారాయణరెడ్డి చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కర్మాగారాన్ని తెరిపించాలని ఎంతోమంది మంత్రులను, అధికారులను కలిసినా ఫలితం లేకపోవడంతో నారాయణరెడ్డి కొండగట్టు ఆంజనేయస్వామి వద్దకు వెళ్లి మొక్కుకున్నట్టు తెలిపారు. కర్మాగారం తెరిచే వరకు చెప్పులు వేసుకోకుండా, గడ్డం తీయకుండా దీక్ష చేపట్టారు. తొమ్మిది నెలల నుంచి కాళ్లకు చెప్పులు లేకుండానే వెళ్తున్నాడు. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు ఫ్యాక్టరీని సందర్శించిన సందర్భంగా నారాయణరెడ్డికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేయించారు.

బోధన్ పరిశ్రమకు అనుబంధంగా ముత్యంపేట ఫ్యాక్టరీ

నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని నిజాం చక్కెర పరిశ్రమకు అనుబంధంగా 1982లో ముత్యంపేటలో చక్కెర పరిశ్రమ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత.. ముత్యంపేట చక్కెర పరిశ్రమ మూతబడింది. ఫలితంగా స్థానిక చెరుకు రైతులకు పంట అమ్మేందుకు అనేక ఇబ్బందులు తలెత్తగా.. స్థానికంగా 40 వేల మందికిపైగా ఉపాధి కోల్పోయారు. అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లో ముత్యంపేట చక్కెర పరిశ్రమను తెరిపిస్తామన్న అప్పటి సీఎం కేసీఆర్.. 8ఏండ్లయినా దాని ఊసే ఎత్తలేదు. అయితే, రాష్ట్రం ఏర్పడిన తొలి నాళ్లలో మాజీ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేసింది. 2015 జులైలోపు విధివిధానాలు ఖరారు చేస్తూ నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

ఆ కమిటీ సకాలంలో నివేదిక ఇవ్వడంలో విఫలమైంది. ముత్యంపేట ఫ్యాక్టరీ కింద జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల రైతులు ప్రధాన పంటగా చెరుకు సాగు చేస్తున్నారు. వీరంతా ఏడేండ్లుగా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం పోరాటం చేస్తూనే ఉన్నా.. గత సర్కారు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. దీంతో ఆ రైతులంతా తమ పంటను కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌కు తరలిస్తున్నారు. ఇక్కడి పరిశ్రమ మూతపడటంతో అదనంగా రవాణా ఖర్చులు పెరిగి పెట్టుబడి భారం మోస్తూ వసున్నారని రైతులు వాపోయారు.

సమాన పనికి సమాన వేతనం ఏది?

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించారు.

వేతనాలలో తేడాలు

పురుష, మహిళా ఉద్యోగుల మధ్య వేతన వ్యత్యాసం ఎక్కువగానే ఉంది. రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ వార్షిక వేతనం తీసుకుంటున్న పురుష, మహిళా ఉద్యోగుల మధ్య వేతన వ్యత్యాసం 18 శాతం ఉంటోంది. అదే రూ.41 లక్షల నుండి రూ.55 లక్షల వరకూ వార్షిక వేతనం తీసుకుంటున్న వారి మధ్య వేతన వ్యత్యాసం 30 శాతంగా ఉంది. పని ప్రదేశంలో కూడా లింగ వివక్ష కన్పిస్తోంది. రూ.41-55 లక్షల మధ్య వార్షిక వేతనం తీసుకుంటున్న మహిళా ఉద్యోగుల్లో 30 శాతం మంది వరకూ తాము లింగ వివక్షను ఎదుర్కొన్నామని తెలిపారు. రూ.10-25 లక్షల వార్షిక వేతనం అందుకుంటున్న మహిళా ఉద్యోగుల్లో మాత్రం 12 శాతం మంది మాత్రమే ఈ రకమైన వివక్షకు గురవుతున్నారు.

'జీతాల' సమస్యలు

మెట్రో నగరాల్లో పనిచేస్తున్న 42 శాతం మహిళా ఉద్యోగులు తమ యాజమాన్యాలతో జీతాల గురించి చర్చించే సమయంలో సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. అయితే తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో వారి



అనుభవాలు భిన్నంగా ఉన్నాయి. కోల్‌కతాలో పనిచేస్తున్న 96 శాతం మహిళా ఉద్యోగులు జీతాలపై చర్చించే సమయంలో ఎలాంటి సమస్యలు ఎదుర్కోవడం లేదు. అహ్మదాబాద్‌లో మాత్రం 33 శాతం మందికి సమస్య ఎదురవుతోంది. చెన్నైలో 77 శాతం మందికి, హైదరాబాద్‌లో 41 శాతం మందికి సవాళ్లు తప్పడం లేదు.

ఆరోగ్యానికి ప్రాధాన్యత

ఇక మహిళలకు పని ప్రదేశంలో తగినంత విశ్రాంతిని కల్పించే విధానాలపై పూనేలో 35 శాతం మంది ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో జాతీయ సగటు 5 శాతంగా నమోదైంది. మెట్రో నగరాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు బిజీ షెడ్యూల్ మధ్య కూడా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

గత సంవత్సరం 66 శాతం మంది మహిళా ఉద్యోగులు సమగ్ర ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

ఖర్చు ఎక్కువే

మహిళా ఉద్యోగుల్లో కేవలం 32% మంది మాత్రమే వారానికి ఒకసారి బయటికి భోజనానికి వెళుతున్నారు. లేదా ఆహారాన్ని ఆర్డర్ చేస్తున్నారు. మహిళా ఉద్యోగుల్లో 24 శాతం మంది రోజుకు నాలుగు గంటలకు పైగా పాటు ఆఫీసు పనికి దూరంగా ఉంటున్నారు. వివాహిత ఉద్యోగుల్లో 32 శాతం మంది గత సంవత్సరం 3-5 సార్లు విశ్రాంతి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అవివాహిత మహిళలతో పోలిస్తే ఇది రెట్టింపుగా ఉంది. సర్వేలో పాల్గొన్న మహిళల్లో దాదాపు సగం మంది (47 శాతం) తమ ఆదాయంలో 70 శాతానికి పైగా ఖర్చు చేస్తున్నారు. వీరిలో 39 శాతం మంది విహార యాత్రలు, షాపింగ్ కోసం తమ వద్ద ఉన్న క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నారు. ఈ విషయంలో పాన్-ఇండియా సగటు 33 శాతంగా ఉంది.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ : మోడీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన విమర్శించారు. నగరంలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి మోడీ ప్రసంగిస్తూ జమ్మూకాశ్మీర్ విజయ గాథ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందని, ఇక్కడి సరస్సుల్లో ఎక్కడ చూసినా 'కమలం' కన్పిస్తోందని చెప్పుకొచ్చారు. 'యాభై సంవత్సరాల క్రితం ఏర్పడిన జమ్మూకాశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ లోగో కమలం. బీజేపీ గుర్తు కూడా అదే. కమలంతో రాష్ట్రానికి గాఢమైన అనుబంధం లేదా?' అని ప్రశ్నించారు. వివాహాలు చేసుకునేందుకు ప్రజలు జమ్మూకాశ్మీర్ వస్తున్నారని, ఇక్కడ జీ-20ని నిర్వహించడాన్ని ప్రపంచం చూసిందని అన్నారు. ఒకప్పుడు జమ్మూకాశ్మీర్‌కు ఎవరు వెళతారని జనం అనుకునే వారని, ఇప్పుడు రాష్ట్రంలో పర్యాటకం అన్ని రికార్డులను అధిగమించిందని చెప్పారు.

గత సంవత్సరం రెండు కోట్ల మందికి పైగా ప్రజలు రాష్ట్రాన్ని సందర్శించారని తెలిపారు. అభివృద్ధి చెందిన భారత్ ప్రాధాన్యత రాష్ట్ర అభివృద్ధేనని అన్నారు. కొత్తగా ఎంపికైన ప్రభుత్వోద్యోగులకు మోడీ ఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేశారు.

ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వర్తించాలి

- ఓటు వినియోగానికి ప్రశాంతమైన వాతావరణం సృష్టించాలి
- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేయాలని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా కోరారు. గురువారం వరంగల్ కమిషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన శిక్షణా తరగతుల్లో సీపీ మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి ఎన్నికలకు ముందు, ఎన్నికల రోజు, ఎన్నికల తర్వాత పోలీసు అధికారులు నిర్వహించాల్సిన విధులు, పాటించాల్సిన నియమ, నిబంధనలను వివరించారు. శాసనసభ ఎన్నికల నిర్వహణ తరహాలో పార్లమెంట్ ఎన్నికలను సైతం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఎవరైనా ఎన్నికల నిబంధనలకు, ఉల్లంఘనలకు పాల్పడితే సాక్ష్యాలు సేకరించాలని తెలిపారు. ఎన్నికల్లో నేరాలకు పాల్పడే వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని ప్రతి పోలీసు స్టేషన్ అధికారికి అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. శాంతి, భద్రతల సమస్యలు తలెత్తే ప్రాంతాలపై ముందస్తు నజర్ పెట్టాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో పోలీసులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు.

అనంతరం జనగామ జిల్లా రఘునాథపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కేంద్ర 58వ సీఆర్పీఎఫ్ కేంద్ర సాయుధ బలగాలతోనూ ఆయన సమావేశమై ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సమిష్టిగా కృషిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు రవీందర్, అబ్దుల్ బారి, ట్రైనీ ఐపీఎస్ శుభంనాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, రఘునాథ్‌పల్లి ఎస్ఐ నరేష్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు రోజుల్లో 76వేల ధరణి సమస్యలు పరిష్కారం

- మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధరణి స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలనిస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఒకటో తేది నుంచి ఏడో తేది వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పెండింగ్‌లో ఉన్న 2,46,536 లక్షల దరఖాస్తులకు గాను 76,382 పరిష్కరించామని తెలిపారు.

వర్షాభావంతో తాగునీటి కొరత

- శ్రీశైలం, సాగర్ నుంచి ఏపీ: అక్రమ తరలింపు
- నిర్వహణ సమస్యలతో ప్రతిరోజూ వందలాది గ్రామాల్లో ఎద్దడి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో తాగునీటి కొరత ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పుడే తీవ్రరూపం దాల్చిన ఎండలు, ప్రాజెక్టుల నుంచి పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుల నుంచి అక్రమంగా నీటిని తరలించుకుపోతున్న నేపథ్యంలో సమస్య తీవ్రత మరింత పెరిగే ప్రమాదముంది. ఈ సంగతిని రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే గుర్తించి అప్రమత్తత ప్రదర్శిస్తున్నా, ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి ఎద్దడి ఉత్పన్నం కానుందని అంచనాలు వెలువడుతున్నాయి. అలాగే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణ సమస్యలతో ప్రతిరోజూ వందలాది గ్రామాల్లో మంచినీటి సమస్య నెలకొన్నది. ఈనేథ్యంలో మిషన్ భగీరథ ప్రధాన నీటివనరుగా మారే పరిస్థితి ఉన్నట్టు అధికారులు అంటున్నారు. దాదాపు రూ. 38 వేల కోట్లతో పాత బీఆర్ఎస్ సర్కారు నిర్మించిన ప్రాజెక్టుకు చెందిన కీలకమైన ఇంట్రానెట్‌వర్క్ పనుల్లో జరిగిన నాణ్యతా లోపాల మూలంగా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు.

అక్రమంగా 50 టీఎంసీల తరలింపు

శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి తాగునీటి పేరుతో ఇతర అవసరాలకు ఏపీ వాడుకుంటున్నది. అలా అక్రమంగా దాదాపు 51 టీఎంసీల నీటిని తరలించినట్టు రాష్ట్ర సాగునీటి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి లేఖ రాయడమే ఇందుకు సాక్ష్యం. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ రెండు ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటిమట్టాన్ని అలాగే కొనసాగించాలనీ, అందులో 11.769 టీఎంసీలు నిల్వ ఉంచాలని ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యవసర



తాగునీటి పరిస్థితులు ఏర్పడ్డాయనీ, ఈనేపథ్యంలో తెలంగాణకు సహకరించాలని కోరారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న 15.231 టీఎంసీలను పూర్తిగా తెలంగాణకు కేటాయించాలని కేఆర్ఎంబీని కోరారు. సర్కారు, కేఆర్ఎంబీ చెర్మెన్‌కు రాసిన లేఖ ప్రకారం జురాలకు 0.4 టీఎంసీలు, రామనపాడు రిజర్వాయర్‌కు 0.208 టీఎంసీలు, శ్రీశైలం ప్రాజెక్టు(ఎల్లూరు రిజర్వాయర్)కు 1.765 టీఎంసీలు, పాలేరు రిజర్వాయర్‌కు 1.443 టీఎంసీలు, ఉదయ సముద్రం రిజర్వాయర్‌కు 0.35 టీఎంసీలు, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 7.584 టీఎంసీలు, పెండ్లిపాక రిజర్వాయర్‌కు 0.0191 టీఎంసీలు అవసరమని లేఖలో తెలియజేశారు. ఇదిలావుండగా రాష్ట్రంలో ఇప్పటికే ఆయా జిల్లాల్లో తాగునీటి సమస్య ముందుకొచ్చింది.

ప్రాజెక్టులు..జిల్లాలు

రాష్ట్రంలోని ఆయా ప్రాజెక్టుల పరిధిలోని జిల్లాల్లో నీటికొరతకు ఆస్కారముందని అధికారులు గుర్తించారు. జురాల ప్రాజెక్టు కింద గద్వాల, వనపర్తి, శ్రీశైలం కింద నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాల్లో ఏప్రిల్ తర్వాత తాగునీటి సమస్య రానుంది. నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్‌తోపాటు నల్లగొండకు ఇబ్బంది రావచ్చని ప్రభుత్వం అంచనా వేసినట్టు తెలిసింది. పాలేరు కింద మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు సమస్య రానుంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టు కిందా ఇబ్బందులు తప్పకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. కృష్ణాబేసిన్‌లో వర్షాలు పడకపోవడమే నీటిఎద్దడికి కారణం. వర్షాభావం నేపథ్యంలో భూగర్భజలాలు తగ్గాయి. ఇదిలావుండగా మిషన్ భగీరథ పథకం ద్వారా రాష్ట్రంలోని 23,900 ప్రదేశాలకు ప్రస్తుతం తాగునీటి సరఫరా జరుగుతున్నది. నిర్వహణ ఇబ్బందుల నేపథ్యంలో ప్రతిరోజూ 600 నుంచి 800 గ్రామాల్లో తాగునీటికి ఇక్కట్లు ఎదురవుతున్నాయని సమాచారం.

లీకేజీలతో

రాష్ట్రంలోని భగీరథ పథకానికి ప్రధాన బలహీనత లీకేజీలు. పైపులైన్ల నిర్మాణం నాణ్యంగా లేకపోవడం, నల్లాల ఏర్పాటు సైతం సరిగ్గా జరగకపోవడంతో తాగునీటికి కష్టాలు తప్పడం లేదు. వీటిని సరిచేస్తే ఆయా జిల్లాల్లో ఎద్దడిని తగ్గించడానికి వీలుందని తెలిసింది. మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు ఆకోవలో ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రెండుసార్లు సమీక్ష చేశారు. అలాగే ఆ శాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారులు సైతం సమీక్షలతోపాటు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. రిజర్వాయర్లల్లో నీళ్లు నిండుకుంటే పరిస్థితి ఏంటనే ఆలోచనలో సర్కారుంది. ఈనేపథ్యంలోనే కేఆర్ఎంబీ చైర్మెన్‌కు ప్రభుత్వం లేఖరాసింది.

ఆదిలాబాద్ , ములుగు, ఖమ్మం, కుమ్రంభీమ్, ఆదిలాబాద్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, ఖమ్మం తదితర జిల్లాల్లో తలెత్తిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం ఉన్నతాధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే.

ఆర్టీసీకి రథచక్రాలు, పునాదులు సిబ్బందే

బాండ్స్ పేమెంట్స్ క్లియర్ చేస్తాం

- ఎన్నికల కోడ్ రాకముందే ప్రక్రియ ప్రారంభిస్తాం
- పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి : రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం: ఎండీ వీసీ సజ్జనార్
- ఘనంగా గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్ అవార్డుల ప్రదానోత్సవం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీకి రథచక్రాలు, పునాదులు సిబ్బందేననీ, వారిని నిరంతరం ప్రోత్సహించడంలోనూ, సంక్షేమం విషయంలోనూ తమ ప్రభుత్వం ముందు వరుసలో ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసానిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని టీఎస్ఆర్టీసీ కళాభవన్‌లో గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్‌తో పాటు మేడారం జాతరలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఉద్యోగులకు, దసరా లక్కీ డ్రా విజేతలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్, టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్‌తో కలిసి 157 మంది ఉత్తమ ఉద్యోగులకు అవార్డులను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ..ప్రతి ఏటా అత్యుత్తమ విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు కూడా మహాలక్ష్మి స్కీమ్ పేరుతో అవార్డులు ఇవ్వాలని ఆర్టీసీ ఎమ్‌డీ సజ్జనార్‌కు సూచించారు. 2013 బాండ్స్ పూర్తిచేస్తామని సీఎం ప్రకటించారని తెలిపారు. రేపటి నుంచే బాండ్స్ పేమెంట్లను ఉద్యోగులకు ఇస్తామన్నారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపే పేమెంట్ చెల్లింపు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. పీఆర్సీపై సీఎంతో చర్చించి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. పెండింగ్ బకాయిల చెల్లింపు ప్రభుత్వం దృష్టిలో ఉందనీ, వాటన్నింటినీ పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. పీఎఫ్, సీసీఎస్ తదితరాలు కార్మికులకు అందేలా చూస్తామన్నారు. అవార్డులు పొందిన వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా ఉద్యోగులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఇస్తున్న జీరో టికెట్‌కు సంబంధించిన రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని 24 కోట్ల మహిళలు ఇప్పటివరకు వినియోగించుకున్నారన్నారు. ఆర్టీసీలో త్వరలోనే నియామకాలు చేపట్టబోతున్నామనీ, కొత్త బస్సులు కూడా రాబోతున్నాయని ప్రకటించారు. సంస్థ బాగుకోసం ఉద్యోగుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరిస్తామన్నారు. వీసీ సజ్జనార్ మాట్లాడుతూ..ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని కొనియాడారు. మేడారం మహాజాతరలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది అద్భుతంగా పనిచేశారని ప్రశంసించారు.

మహాలక్ష్మి స్కీం అమలు తర్వాత సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిందనీ, అయినా, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని చెప్పారు. సిబ్బంది నిజాయతీతో ఉత్తమ సేవలందించడం వల్లే జాతీయస్థాయిలో సంస్థకు గుర్తింపు లభిస్తోందన్నారు. ఇటీవల ఏఎస్ఆర్‌టీయూ ప్రతి ఏటా ప్రకటించే ప్రతిష్టాత్మక ఐదు నేషనల్ పబ్లిక్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్సలెన్స్ అవార్డులను టీఎస్ఆర్టీసీ గెలుచుకుందని గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఉద్యోగుల పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించేలా కృషిచేస్తానని హామీనిచ్చారు. రెండు వేల కొత్త బస్సుల కొనుగోలుకు ప్లాన్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ సీవోవో డాక్టర్ వి.రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, పురుషోత్తం, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ అడ్వయిజర్ విజయ పుష్ప, సీఎంఈ రఘునాథరావు, తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన రీజియన్లు ఇవే..

మహాలక్ష్మి పథకం అమలుకు ముందు : ఫస్ట్ బెస్ట్ రీజియన్ కరీంనగర్, సెకండ్ బెస్ట్ రీజియన్ మహబూబ్‌నగర్, థర్డ్ బెస్ట్ రీజియన్ నిజామాబాద్ నిలిచాయి.

మహాలక్ష్మి పథకం అమలు తర్వాత: ఫస్ట్ బెస్ట్ రీజియన్ హైదరాబాద్, సెకండ్ బెస్ట్ రీజియన్ సికింద్రాబాద్, థర్డ్ బెస్ట్ రీజియన్ వరంగల్ నిలిచాయి.



సాగునీరు విడుదల చేయాలని మంథని ప్రధాన రహదారిపై రైతుల రాస్తారోకో

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతన్నలు

కాలువలకు నీరు విడుదల చేయాలని డిమాండ్

నవతెలంగాణ-మంథని

సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు అధికారులు వేడుకున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండల కేంద్రంలోని పాత పెట్రోల్ బంకు ప్రధాన రహదారిపై గురువారం రాస్తారోకో చేశారు. ఎస్సారెస్పీ డి-83 కాలువ పరిధిలోని కాకర్లపల్లి, రామకృష్ణాపూర్, మైదుపల్లి, సూరయ్యపల్లి, గాజులపల్లి ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో యాసంగి వరి సాగు చేసామని, కీలక దశలో పంటలకు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా పొలాలు ఎండిపోయాయని, వెంటనే కాలువ నీరు విడుదల చేస్తే సగం మేరకైనా పంటలైనా చేతికందుతాయని అన్నారు. కాలువ నీళ్లు రావని ముందే చెప్తే యాసంగిలో వరి పంట వేసే వాళ్లం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని సీఐ, ఎస్ఐ సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడారు. కానీ, తమకు నీటి విడుదలపై సంబంధిత అధికారులు స్పష్టతిచ్చేవరకు కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు.

సాగునీరు అందించి పంటలు కాపాడకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. దాంతో మంథని ఆర్డీవో హనుమ నాయక్ వచ్చి రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కాలువ నీరు అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

హక్కుల కోసం పోరాడుతున్న

మహిళలకు శుభాకాంక్షలు

మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మరో ప్రాణికి జన్మనివ్వడం ద్వారా ఇంకో మనిషిని సృష్టించే శక్తి మహిళలకే ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో 'డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ వుమెన్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని (మార్చి8) నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ మహిళల హక్కుల సాధన కోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. 'సృష్టికి మూలం మహిళ. మహిళ లేనిదే సృష్టి లేదు. ప్రకృతికి మహిళ వరం లాంటిది. మహిళను భూదేవితో పోలుస్తారు. కూతురుగా, తల్లిగా, చెల్లిగా, భార్యగా ఈ సమాజాన్ని మంచి మార్గంలో నడిపించే శక్తి మహిళలకున్నది.

నాటి కాలంలో లాగా నేడు మహిళలపై అంతటి వివక్ష లేదు. ఇప్పటి పిల్లలకు ఇష్టానుసారంగా వారి జీవితాలను తీర్చిదిద్దుకునే స్వేచ్ఛను ఆ కుటుంబాలు కల్పిస్తున్నాయి' అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి హోదాలో ఈ కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

తెలంగాణ డైరీ -2024 ను

ఆవిష్కరించిన స్పీకర్ గడ్డం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఉద్యోగుల సంఘం రూపొందించిన 'తెలంగాణ డైరీ-2024'ను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజేఎస్ అధ్యక్షులు కోదండరాం, ఉద్యోగుల సంఘం చైర్మెన్ పద్మాచారి, అధ్యక్షులు మఠం రవీందర్ కుమార్‌తోపాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి

మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలి : టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

నవతెలంగాణ-సంగారెడ్డి

మహిళ రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎస్‌యూటీఎఫ) సంగారెడ్డి జిల్లా మహిళా సబ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం 'దేశాభివృద్ధిలో మహిళల పాత్ర' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చావ రవి మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టం చేసినా 2029 వరకు ఇంప్లిమెంటేషన్ కోసం ఆపడం ఎంతవరకు సమంజసమన్నారు. పని ప్రదేశంలో, ప్రయాణంలో మహిళా ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు రెండేండ్ల చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలని, క్లాస్ కో టీచర్, క్లాస్‌కు ఒక తరగతి గది ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన మండలానికి ఒక పబ్లిక్ స్కూల్ ఏర్పాటులో ప్రభుత్వ పాఠశాలలను ఎంచుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30శాతం పీఆర్సీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సంగారెడ్డి జిల్లా విద్యాధికారి ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిల్లాలోని మహిళా ఉపాధ్యాయులు విరామమెరగక కృషి చేస్తూ పిల్లలకి మంచి విద్యాబుద్ధులు నేర్పిస్తూ మంచి ఫలితాల కోసం ప్రయత్నిస్తున్నారని అభినందించారు.



మహిళలు తమ ఇంటిని చక్కబెట్టుకోవడమే కాకుండా ఈ సమాజాన్ని చక్కబెట్టే ప్రయత్నంలో ముందున్నారని కొనియాడారు. అనంతరం జిల్లా ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టర్ కవిత కుమారి, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టీ.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వై.జ్ఞానమంజరి మాట్లాడుతూ.. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డ్స్ జారీ చేసి ఉచిత వైద్యం అందించాలన్నారు. కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో పనిచేస్తున్న టీచర్లు, సిబ్బంది అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇస్తూ బేసిక్ పే వర్తింపజేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన మూడు డీఏలు వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సదస్సులో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. సువర్ణ, అమరేశ్వరి, ఎం.శామయ్య సంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.అశోక్, బి. సాయిలు, కార్యదర్శులు బి. అరుణశ్రీ, జీ.విశాలి, వి.అనురాధ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహిళా విభాగం కన్వీనర్ లీల కుమారి, నాయకులు జ్యోతి, జోత్స్న, నాగమణి, విజేత, కౌసల్య, స్వప్న, సుచరిత, సౌభాగ్య, సంగారెడ్డి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపల్స్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హ్యాండీక్రాఫ్ట్స్ (గోల్కొండ)

జీతాలు తగ్గించడం సరిగాదు

- తగ్గించిన జీతాలివ్వాలి... ఉద్యోగ భద్రత కల్పించాలి : మంత్రి శ్రీధర్‌బాబుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ స్టేట్ హ్యాండీక్రాఫ్ట్స్ కార్పొరేషన్(గోల్కొండ)లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలను తగ్గించడం సరిగాదనీ, వెంటనే పూర్తిస్థాయి వేతనాలను చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి జె.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పద్మశ్రీ, కార్యదర్శి జె.కుమారస్వామి మెమోరండాన్ని అందజేశారు. గోల్కొండలో 20 ఏండ్లుగా పనిచేస్తున్న 120 మంది సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హ్యాండీక్రాఫ్ట్స్ కార్పొరేషన్ కింద లేపాక్షి ప్రతిష్టాత్మక సంస్థగా అభివృద్ధి చెందిందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డాక గోల్కొండగా పేరు మార్చిన తర్వాత కూడా సంస్థ పురోభివృద్ధి చెందుతున్నదన్నారు. ఆ సంస్థలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సుదీర్ఘ సర్వీసు, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని జీతాలను ఉన్నతాధికారులు ఏటా నిర్ణయించి అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి జీవో పేరుతో ఒక్కో ఉద్యోగి జీతంలో గరిష్టంగా 50 శాతం తగ్గించారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ ఏర్పడినప్పటి నుంచి లేని కొత్త విధానం వల్ల ఈ సిబ్బంది జీతాలు భారీగా తగ్గాయని చెప్పారు. వేతనాలు పూర్తిస్థాయిలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భూ వివాదంలో.. బీఆర్ఎస్ మాదాపూర్ డివిజన్ అధ్యక్షునిపై కేసు నమోదు

నవతెలంగాణ-మియాపూర్

ఓ ప్రయివేటు స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసినందుకు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎర్రగుంట్ల శ్రీనివాస్‌యాదవ్‌పై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మాదాపూర్ సీఐ జి.మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ సర్వే నెంబర్ 4పీ, 6పీ, 6పీ, ప్లాట్ నెంబర్ 61, 61(ఏ) స్థలానికి సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. ఆ భూమిలో రాజు క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేశారు. దాంతో సదరు ప్లాట్ యజమాని మాదాపూర్ పోలీసులను ఆశ్రయించాడు. శ్రీనివాస్‌యాదవ్‌తో తనకు ప్రాణహాని ఉందని కేసు పెట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కాగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి శ్రీనివాస్‌యాదవ్ సన్నిహితుడు. ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితునిగా ఉంటూ ఈ దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

కాంట్రాక్ట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలి

ఇకపై కాంట్రాక్టు వ్యవస్థ వద్దు : ప్రొఫెసర్ హరగోపాల్

ఓయూలో తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అధ్యాపకుల మహా సదస్సు

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. గురువారం ఓయూలో డాక్టర్ ఏ.పరశురామ్ అధ్యక్షతన తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్(యూటీఏసీ-టీఎస్) ఆధ్వర్యంలో మహా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి హరగోపాల్ మాట్లాడుతూ.. అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక మీదట యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ వ్యవస్థనే ఉంచకూడదన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగ భద్రత ప్రభుత్వం తీసుకోవాల్సిన అవసరం ఉందని.. ఇది సామాజిక న్యాయంలో భాగం అన్నారు. విశ్వవిద్యాలయాలు సమాజానికి వెన్నెముక లాంటివని చెప్పారు.

ప్రొ.కోదండరామ్ మాట్లాడుతూ..



ప్రభుత్వానికి సమస్యను విన్నవించి న్యాయం జరిగేటట్టు చూస్తానని అధ్యాపకులకు హామీనిచ్చారు.

ప్రొ.పీఎల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలలో కాంట్రాక్ట్ అధ్యాపకుల వ్యవస్థ కొనసాగడం దురదృష్టకరమని.. వీళ్లని రెగ్యులరైజ్ చేయడం రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కు అన్నారు. ప్రొ.రమా మేల్కోటే మాట్లాడుతూ.. ప్రభుత్వం కాంట్రాక్ట్ అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఇది సామాజిక బాధ్యత అన్నారు. ఈ సదస్సులో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.జితేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డా.ప్రేమయ్య, పాలమూరు యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ భూమయ్య, చేగుంటి రవికుమార్, కేయూ నుంచి డాక్టర్ సాదు రాజేష్, డాక్టర్ చిర్రా రాజు, టీయూ నుంచి డాక్టర్ వినీత పాండే, డాక్టర్ రవికుమార్, ఎంజీఎం నుంచి డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ తిరుపతి, జేఎన్టీయూ నుంచి డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ సురేష్, జేఎన్ఎఫ్ఏయూ నుంచి డాక్టర్ రామకృష్ణయ్య, డాక్టర్ కాంతారెడ్డి, శాతవాహన యూనివర్సిటీ నుంచి డాక్టర్ యశ్వంత్, టీయూ నుంచి డాక్టర్ నారాయణ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ నాగరాజు, ట్రిబుల్ ఐటీ బాసర నుంచి డాక్టర్ శ్రీశైలం, ఉపేందర్, డాక్టర్ కృష్ణ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

ఈ సదస్సులో తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

యువకులు మత్తుకు బానిసలవొద్దు

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్

- మెడికల్ డిస్ట్రిబ్యూటర్లపై దాడులు
- దగ్గు సిరపు టాబ్లెట్స్ స్వాధీనం



నవతెలంగాణ- కోదాడరూరల్

గంజాయి, సిరప్ మత్తు పదార్థాలకు అలవాటు పడి యువకులు జీవితాలు నాశనం చేసుకోవద్దని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ అన్నారు. టాసెక్స్ సిరప్, నైట్రవేట్ 10 ఎంజి టాబ్లెట్ అనే డ్రగ్స్‌ను యువకులకు సరఫరాపై నమ్మదగిన సమాచారంతో గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ల సమక్షంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సూర్యాపేట జిల్లా మట్టంపల్లిలోని న్యూ దుర్గాభవాని మెడికల్ షాప్‌పై దాడులు నిర్వహించారు. షాప్ యజమాని రమావత్ రవీందర్ ఇంట్లో టాసెక్స్ సిరప్, నైట్రవేట్ 10ఎంజి టాబ్లెట్స్ 10 షీట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారికి సప్లై చేసిన కోదాడలోని శ్రీ వెంకట సాయి సర్జికల్ అండ్ మెడికల్ డిస్ట్రిబ్యూషన్ అండ్ సాయి దుర్గ ఫార్మా డిస్ట్రిబ్యూషన్‌పైనా దాడులు చేశారు. అమ్మకాల వివరాలు సేకరించి దానికి సంబంధించిన పూర్తి సమాచారం సమర్పించాల్సిందిగా నోటీసులు జారీ చేశారు.

అనంతరం కోదాడ పట్టణంలోని ఆప్కార్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ మాట్లాడారు. ఇలాంటి మత్తు పదార్థాలను అనుమతులు లేకుండా అమ్మినా, నిల్వ చేసినా, వినియోగానికి ప్రేరేపించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సోదాలలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎస్ఐలు రామకృష్ణ, గోవర్ధన్, యాదయ్య సిబ్బంది శ్రీనివాస్, అసగర్, లక్ష్మి నర్సింహారావు, దాస్, నాగయ్య, రాము సలీం, నరేష్ పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి..

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా నిలబడతా: ఎంపీ నామ

- కేసీఆర్‌తోనే కరెంట్, నీళ్ల సమృద్ధి: మాజీ మంత్రి పువ్వాడ
- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో 'బొమ్మెర' లొల్లి
- సమావేశానికి హాజరుకాని ఎమ్మెల్యే తెల్లం, మాజీ ఎమ్మెల్యే కందాల



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జిల్లా నాయకులతో మూడుసార్లు సమావేశమై ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా ఎవరిని ఉంచాలనే దానిపై అభిప్రాయం తీసుకున్నారని, తన పేరును ప్రతిపాదిస్తూ ఏకాభిప్రాయం తెలిపిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎంపీ నామ నాగేశ్వరరావు అన్నారు. మరోసారి మీ ముందుకు వస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా నిలబడాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక వీవీసీ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో నామ మాట్లాడారు. తెలంగాణ బిల్లుపైన మొదటి ఓటువేసే అవకాశం తనకు ఇచ్చిన ఖమ్మం జిల్లా ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. గత ఎన్నికల్లో 1.65 లక్షల మెజార్టీతో తనను గెలిపించారని, ఈసారి కూడా అలాగే తనను ఆశీర్వదించాలని ఆకాంక్షించారు.

హామీలకు అవసరమైన బడ్జెట్ లేదు : మాజీ మంత్రి పువ్వాడ

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్‌అకౌంట్ బడ్జెట్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు అవసరమైన కేటాయింపులు లేవని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఇప్పటి వరకు మూడెకరాలకు పైబడిన రైతులకు రైతుబంధు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. నాగార్జునసాగర్ నుంచి తాగునీటి అవసరాలకు కూడా నీరు ఇప్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మిషన్ భగీరథతో మారుమూల తండాలకు సైతం తాగునీరిచ్చిన ఘనత కేసీఆర్‌దని, తాగునీరు, కరెంట్ విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమృద్ధి సాధించిందని తెలిపారు. కేసీఆర్ స్కీంలు ఐక్యరాజ్యసమితి, నీతి ఆయోగ్, ఆర్‌బీఐ ప్రశంసలు అందుకున్నాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలు సరికాదన్నారు. విభిన్న తీర్పులకు ప్రఖ్యాతిగాంచిన ఖమ్మం ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. అనంతరం రాజ్యసభ ఎంపీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. రెండేండ్ల పదవీకాలం ఉన్నా రాజ్యసభ ఎంపీగా తనను ఎంపిక చేసినప్పుడు మరో ఆరేండ్లు ఎక్స్‌టెన్షన్ ఇస్తానన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆ మాటను నిలుపుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో నామ నాగేశ్వరరావును గెలిపించాల్సిందిగా కోరారు.

ఎన్నాళ్లీ అవమానం.. తెలంగాణ ఉద్యమకారుడు బొమ్మెర

తెలంగాణ ఉద్యమకారున్నైన తనను వేదిక మీదకు ఆహ్వానించకుండా అవమానించారని తెలంగాణ ఉద్యమకారుడు, మధిర నియోజకవర్గ నేత బొమ్మెర రామ్మూర్తి సమావేశం మధ్యలో వివాదం సృష్టించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వేదిక మీదున్న ఉప్పల వెంకటరమణను మాట్లాడాల్సిందిగా కోరడంతో బొమ్మెర ఒక్కసారిగా కోపోద్రిక్తుడయ్యాడు. ఉప్పల వెంకటరమణను తెలంగాణ ఉద్యమకారుడిగా సంబోధించడాన్ని సహించలేక.. తన అసహనాన్ని వెళ్లగక్కారు. ఇంతలో వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్.. రామ్మూర్తిని సముదాయించి వేదిక మీదకు తీసుకెళ్లారు. సభా అధ్యక్షుని చేత మైకు చేతికి ఇప్పించి మాట్లాడించారు.

పార్టీ కోసం ప్రాణం పణంగా పెట్టానని చెబుతూ. ఇక్కడున్న వాళ్లంతా పార్టీలు మారి వచ్చినవారేనని వ్యాఖ్యానించాడు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మధిర నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టిక్కెట్ ఆశించి భంగపడ్డ బొమ్మెర ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. కాగా, ఈ సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. తాతా మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో.. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, చంద్రావతి, బాణోత్ మదన్‌లాల్, డీసీసీబీ మాజీ చైర్మెన్ కూరాకుల నాగభూషయ్య, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మైనార్టీ నాయకులు ఖమర్ తదితరులు ప్రసంగించారు. అంతకుముందు భారీ ర్యాలీగా వేదికకు చేరుకున్నారు.

రూ.50 లక్షల హవాలా డబ్బు పట్టివేత

- రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-మియాపూర్

అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.50లక్షల హవాలా డబ్బును మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన రాయదుర్గం పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి ఇన్నోవా క్రిస్టా కారులో ఓ వ్యక్తి హవాలా డబ్బును తరలిస్తున్నట్టు మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టగా.. విక్రమ్ అనే వ్యక్తి డబ్బు తరలిస్తున్న కారును పట్టుకున్నారు. డబ్బుకు సంబంధించిన పత్రాలపై పోలీసులు ఆరా తీయగా ఎలాంటి పత్రాలు చూపించలేదు. పైగా.. పొంతనలేని సమాధానం చెప్పడంతో పోలీసులు అనుమానంతో అతన్ని అదుపులోకి తీసుకొని డబ్బును సీజ్ చేశారు. ఆ డబ్బును ఎస్‌ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకుని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. ఆ డబ్బును మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు సమాచారం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చరితను తిరగరాయాలి

సంపాదకీయం

ఈ రోజు నేనే కాఫీ పెట్టిస్తానని చెప్పి భర్తే కాఫీ పెట్టివ్వచ్చు. ఇదిగో మీ దినోత్సవ సంబరాన కొత్త చీర తెచ్చానని అపురూపంగా అందివ్వనూవచ్చు. మహిళకు ప్రత్యేక ఉత్సవాలను జరిపి, ఆటలాడించి, పోటీలు నిర్వహించి, బహుమతులు పంచి, స్త్రీ గొప్పతనాన్ని వేనోళ్ల పొగడనూవచ్చు. నింగికెత్తి నినందిచనూవచ్చు. కానీ ఒకరోజు గడిచి పోతుంది. మళ్లీ కథ మామూలే. చాకిరి యథావిధి, సాధింపులూ, హీనపు మాటలూ, సనాతన ధర్మాలూ, సంప్రదాయ తలపోతలు... ఆడది గీత దాటి చెడిందనే అపవాదులూ గట్రా అన్నీ కొనసాగుతూనే ఉంటాయి. వేధింపులూ, అత్యాచారాలు, హత్యలు, కుల దురహంకార హత్యలు షరామామూలే. కొన్నేండ్లుగా జరుగుతున్నదిదే. మహిళకు ఉత్సవం చేయాల్సిందే. శతాబ్దకాలంగా ఎదిగిన మహిళల అడుగులను కొనియాడుతూ ప్రేరణ పొందాల్సిందే. కానీ స్త్రీల పట్ల ఆధునిక పాలకుల ధోరణి మారలేదు. ఆలోచనలు, అభిప్రాయాలూ మారలేదు. మహిళలు పొందిన ప్రగతి ఏదైనా ఉందంటే, అది వారు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్నదే. అసలు మహిళా దినోత్సవ భావననే, శ్రామికులుగా వారి హక్కుల కోసం వాళ్లే చేసిన పోరాటంలోంచే ఉద్భవించింది.

మహిళలు చరిత్రను తిరగరాస్తారాని అపుడెపుడో గురజాడ చెప్పాడు. అందుకేనేమో వాళ్లను చట్టసభల్లోకి అడుగుపెట్టనిస్తలేము. అసలు కలాన్ని, కాగితాలనూ దక్కనివ్వటం లేదు. చూడండి దేశంలో మహిళల అక్షరాస్యత, పురుషులకంటే తక్కువ. మనదేశంలో పరిపాలన రాజ్యాంగం ప్రకారం, దాని ఆధారంగా జరుగుతుందనేది అందరికీ సామాన్యంగా తెలిసే విషయం. కానీ రాజ్యాంగేతర సనాతన ధర్మాలు, సంప్రదాయాలు అనధికారికంగానే అమలవుతుంటాయి. అవి ముఖ్యంగా మహిళలకు సంబంధించినవే ఎక్కువ. తత్ఫలితంగా స్త్రీ పురుషులు సమానమే నినాదం, ఇప్ప టికీ నినాదమే. నిజమయ్యేది ఎప్పుడో తెలుసుకోవటమే ఈ దినోత్సవం నాడు చేయాల్సిన పని. "ఎక్కడమ్మా నువ్వు లేనిది? ఏమిటి నువుచేయలేనిది! డాక్టరు వయ్యావు, యాక్టరువయ్యావు, కలెక్టరు వయ్యావు, మినిస్టరు వయ్యావు, సమాజ గమనం నువులేకుంటే గతితప్పి గంగ పాలవుతుంది" అన్నీ అయినా ఆమె పరిస్థితి మాత్రం గతి తప్పుతూనే వుంది. పాట మాత్రం కొనసాగుతూనే ఉంది. అందుకనే ఈ అసమా నతల కొనసాగింపునకు కారణాలను చర్చించుకోవాల్సిన సందర్భానికే ఈ దినోత్సవాన్ని ఉపయోగించాలి.



నేడు మహిళా సాధికారతకు, సమాజంలో సమానత సాధనకు రెండు శక్తులు ప్రధానంగా అవరోధంగా ఎదురౌతున్నాయి. ఒకటి కార్పొరేట్ పెట్టుబడి, రెండు హిందూ ఫాసిస్టు శక్తుల పెరుగుదల. మొదటిది మహిళను అసలు మనిషిగానే చూడదు. సరుకుగా మార్చేస్తుంది. వస్తు వినియోగదారుగా తయారు చేస్తుంది. శ్రమ చేసే వారందరినీ సరుకుగానే పరిగణిస్తుంది. ఏ సమానతైనా ఆ పరధి మేరకే. ఇక రెండోది నేడు మనదేశంలో ఎదుర్కొంటున్న సమస్య. రెండూ కలిసి చేస్తున్న దాడికి మహిళలు మరింత గురవుతున్నారు.అందుకే ఇరవైయేండ్ల పోరాటంలోనూ న్యాయం జరగక పడ్డ వేదన బిల్కిస్‌బానో అనుభవిస్తే, వీడు మా మాన ప్రాణాలను దోచుకున్నాడని ధైర్యంగా చెప్పినా కూడా మహిళా రెజ్లర్లకు న్యాయమే అందలేదు. నిర్లజ్జగా నేరస్తులైన పురుషుల వైపే ప్రభుత్వం నిలబడటం కన్నా వేరే రుజువులేమి కావాలి. ఇంట్లో వంట వండి, పిల్లల్ని కనిపెంచటం, భర్తకు సేవ చేయటం స్త్రీల విధులు అని ఢంకా బజాయించి చెబుతున్న నాయకమన్యుల ఏలుబడిలో సమానత గురించి ఉత్సవం చేస్తున్నామనటంలో అర్థమేమి? ఒక ఆడది కావటం, ఆదివాసీ కావటం వల్లనే కదా పార్లమెంటు నూతన భవనంలోకి, రామాలయ ప్రాణ ప్రతిష్టకూ అవకాశమే నిరాకరించింది. స్త్రీని బానిసగా చూసే ఆలోచనాపరుల పరిపాలనా దాడులను ఎలా ఎదుర్కోవాలో చర్చించటమే ఈ దినోత్సవ కర్తవ్యం కావాలి.

నేడు మహిళా సాధికారతకు, సమాజంలో సమానత సాధనకు రెండు శక్తులు ప్రధానంగా అవరోధంగా ఎదురౌతున్నాయి. ఒకటి కార్పొరేట్ పెట్టుబడి, రెండు హిందూ ఫాసిస్టు శక్తుల పెరుగుదల. మొదటిది మహిళను అసలు మనిషిగానే చూడదు. సరుకుగా మార్చేస్తుంది. వస్తు వినియోగదారుగా తయారు చేస్తుంది. శ్రమ చేసే వారందరినీ సరుకుగానే పరిగణిస్తుంది. ఏ సమానతైనా ఆ పరధి మేరకే. ఇక రెండోది నేడు మనదేశంలో ఎదుర్కొంటున్న సమస్య. రెండూ కలిసి చేస్తున్న దాడికి మహిళలు మరింత గురవుతున్నారు.

శ్రామికుల హక్కుల సాధన పోరాటం నుండే సమానత సాధనకు మార్గం పడుతుంది. వ్యక్తిగత స్వేచ్ఛతో పాటుగా ఉద్యమ స్వేచ్ఛ సాధించబడితేనే మహిళా సాధికారత సఫలమవుతుంది. ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే విప్లవ విజయాల నుండే మహిళల సమానతకూ అంకురార్పణ జరిగిందనేది తెలుస్తుంది. మన సమాజంలోనూ సాంస్కృతికమైన, సామాజికమైన ఉద్యమ ప్రస్థానంలో సగభాగంగా ఉన్న మహిళలు పాల్గొనడం ద్వారానే ఈ దినోత్సవం ఆశించిన లక్ష్యాలను సాధించగలుగుతాము. నేటి ఆధునిక మహిళలు సైతం, ఎంత ఆధునిక విద్యను, విజ్ఞానాన్ని ఆర్జించినప్పటికీ ఆచరణలో మాత్రం, సంప్రదాయాల పేరుతో మూఢ విశ్వాసాలకు లోనవడం చూస్తున్నాము. ఒక్క మహిళలే కాదు. యువత కూడా అదే ధోరణిలో ఆలోచిస్తున్నారు. అది మారాల్సిన అవసరం ఉంది.

ఒకవైపు మూఢత్వం, రెండోవైపు కార్పొరేటు కన్సూమరిజం, సాంస్కృతిక తిరోగమన భావాలను, వాస్తవిక విషయాలపై తెరలను కప్పుతున్న మహాశక్తిగా కీర్తిస్తూనే, దేవతను చేసి ప్రతిమలా కూర్చోపెడుతున్నారు తప్ప సమానతా ధర్మాన్ని పాటించడం లేదు. వీటన్నింటినీ గుర్తెరిగి సంఘటిత శక్తిగా చైతన్యయుతంగా కదలడమే మహిళా దినోత్సవానికి సార్థకత.

...అమ్మే!



నువ్వేమైనా చెప్పు
మనిషి అంటే అమ్మే! ఆ అమ్మే మహా మనీషి!

కాల్చిన మంటకు వెరవకుండా,
కరిగిన వెన్నై, కాలం వడిలోకి
కడుపు నింపి పంపేది ఆమెగా.

నిద్రపుచ్చేది కాదు,తను మేల్కొని,
సూర్యోదయాన్ని వీనులవిందు చేసే
గానామృతమేగా ఆమె.

వేసారని వంటా వార్పు తప్ప
ఎప్పుడైనా, ఎక్కడైనా దేనికైనా
వెదుకాడిందా, వెంపర్లాడిందా ఆమె...

ఒడిలోని పిల్లను వడివడిగా ఎదిగించి,
ఒడినింపే వరకు కడతేరనని,
కడవరకు భీష్మించుకునేది అమేగా.

నన్నింత తీర్చిదిద్దడానికి
నాకన్నీ కూర్చిపోయడానికి ఎన్ని వేటలను,
కనిపించని మరెన్ని ఈటెలను
ఎదుర్కొందో కదా ఆమె.
నువ్వేమైనా చెప్పు
మనిషి అంటే అమ్మే! ఆ అమ్మే మహా మనీషి!

ఎన్నిసార్లు ఒంటరవ్వలేదు!
ఊరు మార్చినా, పేరు మార్చినా,
నన్ను మోస్తూ, నాన్నను చూస్తూ,
సుడిగుండాలను దాటి
సముద్రాన్ని చేరే తరంగిణియేగా ఆమె!

అమ్మకు కష్టం వస్తుంది,
ఆ కష్టానికి కన్నీళ్లుంటాయి,
అవి ఇట్టే ఇంకిపోయే ఒకే ఒక మందు
మన చిరునవ్వు.

ఒంటరైనా, ఓర్పు లేకపోయినా,
కూర్పు చేయలేకపోయినా,
ఎన్ని వేళ్ల తన వైపు లేస్తాయోగా...
నివ్వెర పోకుండా నీరసపడకుండా
కర్తవ్యానికి కంకణబద్ధురాలైనమూర్తి కదా ఆమె..

వేర్పాటులలో, విడాకులలో,
ఎన్ని పాట్లున్నా, మనుషుల అలవాట్లనే తప్ప
వారిని దూరం కానివ్వని
మహాగుణం మరెవరిది.

భక్తికి, అనురక్తికి, ముక్తికీ మాతృత్వానికి,
మరెవరైనా పోటీ పడగలరా...

చీరకట్టినా, కొంగు నడుముకు జుట్టినా,
కొడవలి చేపట్టినా, పిడికిలి పైకెత్తినా,
సవాలు సైతం దాసోహం అనేది ఆమెకేగా.
శాస్త్రం చదివినా, శాంతం నేర్పినా,
సమస్యను చేదించినా, సంఘం నిర్మించినా,
ఆమెకు ఎవరు సాటిలే...

నువ్వేమైనా చెప్పు
మనిషి అంటే అమ్మే! ఆ అమ్మే మహా మనీషి!

- జి.సునితారాణి, 9951300016

దేవదాసి వ్యవస్థను రద్దు చేయించిన దేవదాసీ బిడ్డ



డాక్టర్ దేవరాజు మహారాజు

సనాతన ధర్మశాస్త్రాలలో ఉందని నిమ్న వర్గాల బాలికలకు దేవుడితో పెండ్లి జరిపించి, వాళ్లని వేశ్యలుగా మార్చి సమాజ మంతా వాడుకునేది. వారినే దేవదాసీలనేవారు. ఆ దేవదాసీల వయసు నలభై దాటగానే వారిని వేలం వేసేవారు. వారిని వేలం పాటలో గెలుచుకుని, తీసుకుపోయిన వారు వారిని ఇంటి పనులకు, వ్యవసాయ పనులకు ఇతరత్రా వాడుకునే వారు.ఇలాంటి నీచ నికృష్ట వ్యవస్థను సనాతన ధర్మం పేరుతో మనువాదులు ఈ దేశంలో వేల సంవత్సరాలు కొనసాగించారు. రాజరాజచోళుని కాలంలో ఒక్క తంజావూర్ దేవాలయంలోనే నాలుగు వందలకు పైగా దేవదాసీలు ఉండేవారని చరిత్ర చెపుతోంది.

8 అక్టోబర్ 1947 మద్రాస్ అసెంబ్లీ సభ్యులు ఒ.పి. రామసామి రెడ్డి యార్, ముత్తులక్ష్మి రెడ్డి దేవదాసీ నిర్మూలన చట్టం కోసం ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. అంతే-సభలో గందరగోళం ప్రారంభమైంది. సత్యమూర్తి అయ్యార్, శ్రీనివాస్ అయ్యార్, గోవింద రాఘవ అయ్యార్, శేషగిరి అయ్యార్‌ల బృందం దాన్ని వ్యతిరేకించింది. అలా చేయడం సనాతన హిందూ ధర్మానికి వ్యతిరేకమని మత శాస్త్రాలకు వ్యతిరేకమని ఆందోళన ప్రారంభించారు. సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే స్థాయి ఈ చట్టసభకు ఉందా? అని కూడా ప్రశ్నించారు. ఇరు పక్షాల ఆందోళనలను ఎలా అదుపు చేయాలో ఆలోచిస్తూ, సభను నిర్వహిస్తున్న రాజాజీ మౌనం వహించారు. గందర గోళాల మధ్య ఆనాటి సభ ముగిసింది. ఆ సాయంత్రం ముత్తులక్ష్మి రెడ్డి పెరియార్ ఇ.వి. రామసామి దగ్గరికి వెళ్లి సలహా అడిగారు. ఆయన ఆలోచించి కొన్ని సూచనలు చేశారు.

1914లో ముత్తులక్ష్మి తన ఇరవై ఎనిమిదవయేట 1872 నేటివ్ మ్యారేజ్ ఆక్ట్ ప్రకారం సుందరరెడ్డిని పెండ్లి చేసుకున్నారు. తనను జీవిత భాగస్వామిగా సమాన స్థాయిలో గౌరవిస్తానని, తన నిర్ణయాలు తను తీసుకునే స్వేచ్ఛ ఉండాలన్న హామీ కాబోయే భర్త నుండి తీసుకున్న తర్వాతనే ఆమె సుందరరెడ్డితో వివాహానికి ఒప్పుకున్నారు. అలా పెండ్లి తర్వాత ఆమె పేరుకు రెడ్డి అనే పదం జతకూడింది. వారికి ఇద్దరు కొడుకులు పుట్టారు. ఒకరు డాక్టర్ కృష్ణమూర్తి, మరోకరు రామ్మోహన్. తమిళ సినిమా నటుడు జెమిని గణేషన్ ముత్తులక్ష్మికి అల్లుడు. తోడబుట్టిన సోదరి క్యాన్సర్‌తో చనిపోవడంతో ఒక డాక్టరుగా ఆమె క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించగలిగారు. అంతేకాదు, మహిళలకు, పిల్లలకు ప్రత్యేకంగా ఆసుపత్రులుం డాలన్నది ఆమె ఆలోచన-అందువల్ల మెటర్నిటీ, చిల్డ్రన్ హాస్పిటల్ కాన్సెప్ట్ ఆమెదే అయ్యింది.

మరునాడు 9 అక్టోబర్ 1947న సభ ప్రారంభం కాగానే సత్యమూర్తి అయ్యార్ చర్చ మొదలుపెట్టారు - "దేవదాసీలంటే సనాతన ధర్మం ప్రకారం శాస్త్రయుక్తంగా దేవాలయాలలో ఏర్పాటు చేయబడ్డ పరిచారికలు. వారు నేరుగా దైవసేవకులన్న మాట! వారు చేసే పవిత్రకార్యాలను బట్టి వారు భగవంతుని కృపకు పాత్రులవుతారు. వారికి భోగభాగ్యాలు లభిస్తాయి."- అంటూ శాస్త్ర నియమాలన్నిటినీ ఊటంకిస్తూ సత్యమూర్తి సుదీర్ఘ ప్రసంగం చేశారు. మిగతా వారు కొందరు ఆయన బాణీలోనే మాట్లాడారు. అంతా అయ్యాక ముత్తు లక్ష్మి రెడ్డి లేచి ఇలా అన్నారు- "అయ్యర్ గారు చెప్పిన శాస్త్ర విషయాలన్నిటితోనూ నేను ఏకీభవిస్తున్నాను. ఇన్ని వందల సంవత్సరాల నుండి మేము చేస్తూ వచ్చిన సేవలకు మాకు అందిన దైవకృప మాకు చాలు. అందుకున్న భోగ భాగ్యాలు కూడా మాకు సరిపొయ్యాయి. ఇటువంటి పనులు- అంటే దేవదాసీలవృత్తి చేయడం వల్ల దేవుడి ఆశిస్సులు లభిస్తాయని నమ్మేవారూ, సనాతన ధర్మాన్ని గౌరవించాలని అనుకునేవారు నిరభ్యంతరంగా వారి ఇంటి ఆడవారిని స్వచ్ఛందంగా దేవదాసీలుగా మార్చుకోవచ్చు, మాకు అభ్యంతరం లేదు అయితే మా నిమ్న వర్గాల మహిళ లంతా ఈ వృత్తిని తిరస్కరిస్తున్నాం!" - అని ముగించారు.

సనాతన ధర్మం గురించి మహోపన్యాసాలిచ్చిన వారి నోళ్లు మూతప డ్డాయి. దొంగకు తేలు కుట్టినట్టు కిక్కురుమనకుండా కూర్చున్నారు. అప్పుడు అసెంబ్లీ "దేవదాసీ నిర్మూలన చట్టాన్ని ఆమోదించింది.- ఆ తర్వాత వివిధ రూపాల్లో ఉన్న 'దేవదాసీ వ్యవస్థ' రద్దయింది. అప్పటి మద్రాసు రాష్ట్రంలో రాయలసీయ కోస్తాంధ్ర ప్రాంతాలు కలిసి ఉండేవి. కోస్తాంధ్ర రాయలసీమ ప్రాంతాల్లో 'మాత మ్మ- జోగినీ' వ్యవస్థలు, మలబార్ ప్రాంతంలో ఉన్న 'నంగా'వ్యవస్థ: కన్నడ ప్రాంతంలోని 'బసివి' వ్యవస్థలు రద్దయ్యాయి. దేవదాసి వ్యవస్థ ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలవబడేది. అవన్నీ దేవ దాసీ నిర్మూలనా చట్టంతో రద్దయ్యాయి. ఆ ఘనత పూర్తిగా ముత్తు లక్ష్మి రెడ్డికి దక్కుతుంది. దేవదాసీ వ్యవస్థ నిర్మూలనా చట్టం కోసం అధికారికంగా అసెంబ్లీలో పోరాడిన డాక్టర్ ముత్తులక్ష్మీ, స్వయంగా ఒక దేవదాసి కూతురు! ఒక దేవదాసి బిడ్డ దేవదాసీ వ్యవస్థను రద్దు చేయించడం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకొవాల్సిన అంశం. ఆ జీవి తంలోని సాధక బాధకాలు ఆమె పిన్న వయసులోనే తెలుసుకున్నారు కాబట్టి, ఆ పరిధిలోంచి బయట పడాలని కష్ట పడి చదువుకుని డాక్టర్ అయ్యారు. పెరియార్ ఉద్యమాన్ని ఆసరాగా చేసుకుని అనేక ప్రతికూల పరిస్థితులను ఎదిరించి పోరాడి అసెంబ్లీకి వెళ్లారు.

సుందర రెడ్డిని వివాహం చేసుకుని సాధారణ జీవితం గడుపుతూనే, అసాధారణ ప్రతిభా పాటవాలతో వైద్య, సామాజిక, రాజకీయ రంగాలలో రాణించారు. ప్రపంచ ప్రఖ్యాత అడయార్ క్యాన్సర్ ఇనిస్టూట్‌కు ఈమే వ్యవస్థాపకురాలు. ఈ సంస్థకు - భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూను ఆహ్వానించి పునాదిరాయి వేయించారు. 18 జూన్ 1954న అది ప్రారంభ మైనప్పుడు దేశంలోనే అది రెండో క్యాన్సర్ ఆసుపత్రి అయ్యింది. ఇప్పుడది సంవత్సరానికి ఎనభైవేల మంది క్యాన్సర్ రోగులకు చికిత్స నందిస్తోంది. డాక్టర్ ముత్తులక్ష్మి 'స్త్రీ ధర్మ' పత్రికకు సంపాదకత్వం వహిస్తూ తమిళ భాషా సాహిత్యాలకు కూడా గణనీయమైన సేవలందించారు. మరోవైపు వుమెన్స్ ఇండియన్ అసోసియేషన్ (WIA) కు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పనిచేస్తూ ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ (AIWC) పత్రిక 'రోషిని'కి సంపాదకత్వం వహించారు.

30 జూలై 1886-22 జూలై 1968 మధ్య కాలంలో 82 ఏండ్లు జీవించిన ముత్తులక్ష్మి, బ్రిటీష్ ఇండియా మద్రాస్ రాష్ట్రంలోని పుదుక్కొటై జిల్లా తిరుకోకర్నం గ్రామంలో జన్మించారు. ఆడపిల్లల చదువుకు తీవ్రమైన ఆంక్షలున్న ఆ కాలంలో మద్రాస్ మెడికల్ కాలేజి నుండి 1912లో వైద్యశాస్త్ర పట్టా సాధించారు. ఉన్నత విద్యకోసం ఆమె ఇంగ్లాండు వెళ్లారు. కానీ, WIA వుమెన్స్ ఇండియన్ అసోసియేషన్ వారి ఒత్తిడి మేరకు తన బంగారు భవిష్యత్ ద్వారాలు మూసేసుకుని వచ్చి, మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో చేరారు. అక్కడ ఏకగ్రీవంగా డిప్యూటీ ప్రెసిడెంట్‌గా ఎన్నికై బాధ్యతలు నిర్వహించారు. దాంతో మహిళా హక్కుల కోసం పోరాడే ఒక ఉద్యమకారిణి అసెంబ్లీ వ్యవస్థలో ప్రవేశించినట్టైంది. ఆ రకంగా ఆమె పేరు అనేక విషయాలలో ప్రథమ స్థానంలో నమోదయ్యింది. ఇప్పటికీ అవన్నీ రికార్డులుగానే ఉండిపోయాయి.



ముత్తులక్ష్మీ రెడ్డి దేశంలో ప్రప్రథమంగా పురుషుల కళాశాలలో ప్రవేశం సాధించిన తొలి మహిళ. మామూలు ఎకడమిక్ డిగ్రీ కళాశాలలో కాకుండా వృత్తికి సంబంధించిన మెడికల్ కళాశాలలో ప్రవేశం సాధించడం ఆ రోజుల్లో (1907) చాలా గొప్ప విషయం. అందుకే ఆమె తొలి మహిళా హౌస్ సర్జన్. దేశంలో తొలి మహిళా డాక్టర్ కాగలిగారు. అలాగే నాటి బ్రిటీష్ ఇండియాలో ఆమె తొలి మహిళా లెజిస్లేటర్ సోషల్ వెల్ఫేర్ అడ్వయిజరీ బోర్డుకు తొలి మహిళా లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు తొలి డిప్యూటీ ప్రెసిడెంట్ మద్రాస్ కార్పోరేషన్‌లో తొలి మహిళ కాగలిగారు. వీటన్నిటితో పాటు 1953లో 'అవ్వయ్ హోమ్' (అవ్వయ్ ఇల్లమ్)కు రూప కల్పన చేసి ఆ విషయంలో కూడా తొలి మహిళగా నిలిచారు. ఆడపిల్లల్ని మోసపూరితంగా ఇతర ప్రాంతాలకు తరలించి వేశ్యావృత్తిలోకి దింపడాన్ని ఆపడంలో ఆమె నెలకొల్పిన హోమ్ ప్రముఖ పాత్ర పోషించింది.

ముత్తులక్ష్మీ రెడ్డి దేశంలో ప్రప్రథమంగా పురుషుల కళాశాలలో ప్రవేశం సాధించిన తొలి మహిళ. మామూలు ఎకడమిక్ డిగ్రీ కళాశాలలో కాకుండా వృత్తికి సంబంధించిన మెడికల్ కళాశాలలో ప్రవేశం సాధించడం ఆ రోజుల్లో (1907) చాలా గొప్ప విషయం. అందుకే ఆమె తొలి మహిళా హౌస్ సర్జన్. దేశంలో తొలి మహిళా డాక్టర్ కాగలిగారు. అలాగే నాటి బ్రిటీష్ ఇండియాలో ఆమె తొలి మహిళా లెజిస్లేటర్ సోషల్ వెల్ఫేర్ అడ్వయిజరీ బోర్డుకు తొలి మహిళా లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు తొలి డిప్యూటీ ప్రెసిడెంట్ మద్రాస్ కార్పోరేషన్‌లో తొలి మహిళ కాగలిగారు. వీటన్నిటితో పాటు 1953లో 'అవ్వయ్ హోమ్' (అవ్వయ్ ఇల్లమ్)కు రూప కల్పన చేసి ఆ విషయంలో కూడా తొలి మహిళగా నిలిచారు. ఆడపిల్లల్ని మోసపూరితంగా ఇతర ప్రాంతాలకు తరలించి వేశ్యావృత్తిలోకి దింపడాన్ని ఆపడంలో ఆమె నెలకొల్పిన హోమ్ ప్రముఖపాత్ర పోషించింది. అలాంటి బాలికలకు, యువతులకు, ఆశ్రయం కల్పించి, విద్య నందించి, స్వతంత్రంగా జీవనం గడిపే విధంగా తీర్చిదిద్దేవారు. ముఖ్యంగా ముస్లిం హరిజన బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందించి మరింతగా ప్రోత్సహించేవారు.

ముత్తులక్ష్మి తల్లి చంద్రమ్మాళ్ నిమ్న వర్గానికి చెందిన తమిళ స్త్రీ తండ్రి యస్. నారాయణ సామి ఉన్నత వర్గానికి చెందిన అయ్యర్. అభ్యుదయ భావాలు గల నారాయణసామి తన కుటుంబాన్ని, బంధు వర్గాన్ని ఎదిరించి దేవదాసి అయిన చంద్రమ్మాళ్‌ను పెండ్లి చేసుకున్నాడు. ఒక మహోన్నతమైన మానవీయ విలువను నిలిపినందుకు ఆయన బంధు వర్గం ఆయనను దూరం పెట్టింది. ఆయన అందుకు బాధపడలేదు. వీరిద్దరికీ కలిగిన కూతురే ముత్తులక్ష్మి. తండ్రి నుండి అభ్యుదయ భావాలు పుణిక పుచ్చుకుని పెరిగింది.కూతురు ఆలోచనలు పసిగట్టిన తండ్రి నారాయణసామి కూతురిని విద్యావంతురాలుగా, మానవతామూర్తిగా చూడాలనుకున్నాడు. అందుకే ఆమెను స్కూలుకు పంపడం ప్రారంభించాడు. ఆ రోజుల్లో అదొక సాహసోపేతమైన చర్య. ఆమె ఒక ఉపాధ్యాయురాలై బాలికలకు విద్యనందించాలని తండ్రి నారాయణసామి ఆశించాడు. కానీ, ఆమె అంతకన్నా ఉన్నతంగా ఎదిగి, అనేక సంస్కరణలకు కారణమైంది.

యుక్త వయసు రాగానే పెండ్లి చేసి పంపడం ఆనాటి ఆచారం. కానీ, ముతులక్ష్మి స్వంత నిర్ణయాలు తీసుకోగల స్థాయికి చేరుకుంది. అందుకే ఉన్నత విద్యకోసం ఆరాటపడింది. మెట్రిక్యులేషన్ పూర్తి కాగానే అక్కడి మహారాజా కళాశాలలో ప్రవేశం కోసం ఆర్జీ పెట్టుకుంది. అమ్మాయి కళాశాలలో ప్రవేశిస్తే అబ్బాయిలంతా ఆమె ఆకర్షణలో పడిపోతారని. వారి చదువు చెడిపోతుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున వ్యతిరేకించారు. ఆ ప్రాంతం పొడుకొట్టై మహారాజుకు అది అనవసరమైన రాద్ధాంతమని అనిపించింది. ఆయన వ్యతిరేకతల్ని పట్టించుకోకుండా ముత్తులక్ష్మికి ప్రవేశం కల్పించారు. పైగా ఆమె సాహసానికి మెచ్చి స్కాలర్‌షిప్ కూడా ప్రకటించాడు. ఆ రకంగా ఆమెకు ఎదురైన అడ్డంకులు తొలగిపోయాయి. ఉన్నత విద్యకు ద్వారాలు తెరుచుకున్నాయి.

1914లో ముత్తులక్ష్మి తన ఇరవై ఎనిమిదవయేట 1872 నేటివ్ మ్యారేజ్ ఆక్ట్ ప్రకారం సుందరరెడ్డిని పెండ్లి చేసుకున్నారు. తనను జీవిత భాగస్వామిగా సమాన స్థాయిలో గౌరవిస్తానని, తన నిర్ణయాలు తను తీసుకునే స్వేచ్ఛ ఉండాలన్న హామీ కాబోయే భర్త నుండి తీసుకున్న తర్వాతనే ఆమె సుందరరెడ్డితో వివాహానికి ఒప్పుకున్నారు. అలా పెండ్లి తర్వాత ఆమె పేరుకు రెడ్డి అనే పదం జతకూడింది. వారికి ఇద్దరు కొడుకులు పుట్టారు. ఒకరు డాక్టర్ కృష్ణమూర్తి, మరోకరు రామ్మోహన్. తమిళ సినిమా నటుడు జెమిని గణేషన్ ముత్తులక్ష్మికి అల్లుడు. తోడబుట్టిన సోదరి క్యాన్సర్‌తో చనిపోవడంతో ఒక డాక్టరుగా ఆమె క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించగలిగారు. అంతేకాదు, మహిళలకు, పిల్లలకు ప్రత్యేకంగా ఆసుపత్రులుండాలన్నది ఆమె ఆలోచన-అందువల్ల మెటర్నిటీ, చిల్డ్రన్ హాస్పిటల్ కాన్సెప్ట్ ఆమెదే అయ్యింది. 1926లో ప్యారిస్‌లో జరిగిన వుమెన్స్ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. లెజిస్లేటర్‌గా తన అనుభవాలు, ఆలోచనలు ఆమె "మై ఎక్స్‌పీరియన్స్ ఏజ్ ఎ లెజిస్లేటర్" పేరుతో 1930లో గ్రంథస్థం చేశారు. 1947లో ఎర్రకోట మీద ఆవిష్కరించిన తొలి భారతీయ పతాకంపై దేశంలో ముఖ్యమైన వారి పేర్లు రాశారు. అందులో ముత్తులక్ష్మి పేరు కూడా ఉంది. గాంధీజీ, అనిబిసెంట్, సరోజినీనాయుడు వంటి దేశనాయకులతో ఈమెకు సన్నిహిత సంబంధాలుండేవి. బహుముఖీనమైన ప్రతిభలో అనేక రంగాలలో కృషి చేస్తూ దేశసేవ చేసిన ముత్తులక్ష్మి కృషిని భారత ప్రభుత్వం గుర్తించి 1956లో పద్మ భూషణ్ ప్రకటించింది.

సుందర రెడ్డిని వివాహం చేసుకుని సాధారణ జీవితం గడుపుతూనే, అసాధారణ ప్రతిభా పాటవాలతో వైద్య, సామాజిక, రాజకీయ రంగాలలో రాణించారు. ప్రపంచ ప్రఖ్యాత అడయార్ క్యాన్సర్ ఇనిస్టూట్‌కు ఈమే వ్యవస్థాపకురాలు. ఈ సంస్థకు - భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూను ఆహ్వానించి పునాదిరాయి వేయించారు. 18 జూన్ 1954న అది ప్రారంభ మైనప్పుడు దేశంలోనే అది రెండో క్యాన్సర్ ఆసుపత్రి అయ్యింది. ఇప్పుడది సంవత్సరానికి ఎనభైవేల మంది క్యాన్సర్ రోగులకు చికిత్స నందిస్తోంది. డాక్టర్ ముత్తులక్ష్మి 'స్త్రీ ధర్మ' పత్రికకు సంపాదకత్వం వహిస్తూ తమిళ భాషా సాహిత్యాలకు కూడా గణనీయమైన సేవలందించారు. మరోవైపు వుమెన్స్ ఇండియన్ అసోసియేషన్ (WIA) కు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పనిచేస్తూ ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ (AIWC) పత్రిక 'రోషిని'కి సంపాదకత్వం వహించారు.

- కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్ర వేత్త
(మెల్బోర్న్ నుంచి)

'మార్చి-8 మహిళలకు స్ఫూర్తి కావాలి'

"76 ఏండ్ల అజాది అమృత్ మహోత్సవంలో ఆమె మరణించింది.
అయినా ఆమె మానం నుండి రక్తం స్రవిస్తూనే ఉంది.
కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా...అత్యాచారాలకు గురైన శవాలు ఎందుకో ఈ మట్టిలో ఇంకటం లేదు....
మనువాదం, ఫాసిజం, పితృస్వామ్యం దేశంలో నలుదిశలూ ఊరేగుతున్నాయి.
ఆమె మాన ప్రాణాలు ఉక్కు పాదాల కింద నలుగుతూనే ఉన్నాయి"-



అరుణ
9705450705

"ముండ్లపొదల్లో ఓ ఆడశిశువు... చెత్త కుండీల్లో మరో ఆడ శిశువు.. ఇద్దరు అప్పుడే భూమ్మీద పడిన పసికూనలు" ఇలాంటి వార్తలు నిత్యం వస్తుంటాయి. 1910 నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు వస్తున్నాయి... పోతున్నాయి... కానీ మహిళల సామాజిక స్థితిగతుల్లో మార్పు రావటం లేదు. ఈ పరిస్థితిలో ఈ అజాదీ ఎవరిది? ఈ ఉత్సవాలు ఎవరివి? అన్న ప్రశ్న వస్తుంది. రోజురోజుకూ స్త్రీలపై హింస రకరకాల రూపంలో పెరిగిపోతూ ఉంది. ఇలా ఎందుకు జరుగుతోంది..? ముందుతరాల వారికి హింసలేని సమాజాన్ని అందించలేమా? ఆకాశంలో సగమైన స్త్రీల శ్రమ ఉత్పత్తిలో సగానికి తక్కువేమి కాదు...కానీ కడుపులో బిడ్డను కనాలన్నా, తాను ఏమి చదవాలి, ఎంతవరకు చదువుకోవాలి, ఎలా జీవించాలనే విషయాలలో నిర్ణయించుకొనే స్వేచ్ఛ మాత్రం స్త్రీకి లేదు. స్త్రీ నడక, నడత చివరకు నవ్వుపై కూడా ఆంక్షలు విధించారు. ఇలా స్త్రీలంటే చిన్నచూపు, వివక్ష, స్త్రీ ఎప్పుడు మగవాడి కను సన్నల్లో జీవించాలి. చిన్నప్పుడు తండ్రి, పెళ్ళి తర్వాత భర్త, ముసలితనంలో కొడుకుల ఆధీనంలో జీవించాలి. ఇలా స్త్రీని బందీని చేయటం ఈ సమాజం మొదటి నేరం. ఇక ఘనమైన మన చరిత్ర, సంస్కృతిలో కూడ "కార్యేషుదాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాత, శయనేషు రంభా" అంటూ స్త్రీని పురు షునికి సొంత ఆస్తిగా మలిచారు. ఇలా భూస్వామ్య, పితృ స్వామిక సంస్కృతిని వ్యవస్థీకృతం చేశారు. ఈ పరిస్థితి మారాలి. స్త్రీని కనీసం మనిషిగా చూసి గౌరవించే ఒక మానవీయ సమాజాన్ని నిర్మించే కృషి అందరూ చేయాలి.

అమలుకు నోచుకోని చట్టాల కారణంగా స్త్రీలపై కుటుంబ, లైంగిక హింస, రాజ్యహింస రోజురోజుకూ పెరిగిపోతోంది. 1956, 1986 లలో చేయబడ్డ హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆడ, మగ తేడాలేకుండా ఆస్తిలో సమాన హక్కు ఇవ్వబడింది. కానీ భూస్వామిక పితృస్వామ్య వ్యవస్థలో ఏ కుటుంబం మహిళలకు ఆస్తిలో సమానవాటా ఇవ్వటంలేదు. 1961 వరకట్న నిషేధచట్టం చేసినప్పటికీ, వరకట్నం గౌరవంగా అమలు చేయబడుతూ ఉంది. పెండ్లి పేరుతో జరిగే తంతూ ఫక్తు వ్యాపారంగా మారి మహిళల పట్ల శాపమైంది. ఈ దురాచారానికి ఎంతోమంది స్త్రీలు బలైపోతున్నారు. ఈ దురాచారం కారణంగా ఆడశిశువుల భ్రూణ హత్యలు జరిగి, ఆడపిల్లలను గర్భంలోనే చంపుతున్నారు. ఫలితంగా దేశంలో స్త్రీల జనాభా తగ్గిపోయి, పెండ్లికాని ప్రసాద్‌లు పెరిగిపోతున్నారు. ప్రకృతికి విరుద్ధమైన ఈ చర్యను నిలువరించటానికి 1994 గర్భస్థ శిశువు పరీక్షల నియంత్రణ చట్టం చేయబడింది. అయిన భ్రూణ హత్యలు ఆగలేదు. ఏ డాక్టరు, తల్లిదండ్రులకు గాని శిక్షలు పడ్డ సందర్భమూ లేదు. కనీసం కేసులు కూడా రిజిస్టర్ కావటం లేదు. ఆడపిల్లలు లేకుండా కొత్త సహస్రాబ్దంలోకి మనం అడు గుపెట్టే సూచనలు కనిపిస్తున్నట్టు ఐక్యరాజ్య సమితి గణాం కాలు, విశ్లేషణలు చెబుతున్నాయి. ఇది ప్రమాదకరం. ప్రకృతి సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం. పరిస్థితి ఇలాగే కొన సాగితే రాబోయేతరం మూల్యం చెల్లించక తప్పదు. ప్రకృతిపరంగా మగపిల్లల కంటే ఆడపిల్లలు ఎక్కువ మంది బతుకుతారు, జన్యుపరంగా ఆడపిల్లలు బలంగా ఉండటమే దీనికి కారణం. భారతదేశంలో భ్రూణ హత్యల కారణంగా స్త్రీల జనాభా తగ్గిపోతూ ఉంది. అనేక దేశాలలో పురుషులకంటే స్త్రీల సంఖ్య అధికంగా ఉంది. చట్టాల అమలులో చిత్తశుద్ధి లేని కారణంగా ఆడపిండాలను గుర్తించి మొగ్గలోనే తుంచి వేస్తున్నారు. డయాగ్నస్టిక్ పరీక్షాకేంద్రాలు మృత పంజరాలుగా మారాయి. దీనికితోడు 1991 నుంచి దేశంలో ప్రపంచీకరణ దశ మొదలై పాశ్చాత్య విష సంస్కృతి పెచ్చరిల్లి, స్త్రీ శరీరం సరుకుగా, అంగడిబొమ్మగా, విలాస వస్తువుగా మార్చబడింది. ఫలితంగా స్త్రీలపై లైంగిక హింస పెరిగిపోయింది. ఈ విషసంస్కృతి కారణంగా మన దేశంలో



ప్రతి గంటకు ఐదు గురిపై అత్యాచారాలు జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.

బహుళజాతి కంపెనీలు తమ వస్తువులను ప్రచారం చేసుకొని, అమ్ముకొని, సొమ్ము చేసుకోవటం కోసం బుల్లితెరలో వస్తున్న ప్రోగ్రామ్స్, సీరియల్స్ ఆడవారినే విలన్లుగా చూపిస్తున్నారు. సినిమాల్లో హీరోయిన్ల పాత్ర అర్ధనగ్నంగా, ఆత్మగౌరవం లేనిదిగా చిత్రీకరిస్తున్నారు. హీరోలైతే జులాయిలుగా, అమ్మాయిలను వెంటబడి, వేధించటమే ప్రేమగా చూపిస్తున్నారు. చివరకు ఉపాధ్యాయులను కూడా వదలటం లేదు. దీని ప్రభావం నేటి యువతపై పడి మానవీయ సంబంధాలు దెబ్బతింటున్నాయి. పెరిగిన వస్తు వ్యామోహం, వినిమయం పాశ్చాత్య విష సంస్కృతి మూలంగా మొత్తం మానవ సంబంధాలు మార్కెట్ సంబంధాలుగా మారిపోయాయి. రకరకాల నేరాలు పెరిగి తుదకు విలువలు లేని సమాజం ఏర్పడింది. ఈ పరిస్థితిని నిలువరించాల్సిన పాలకులు బహుళజాతి సంస్థలకు, ధనికులకు అమ్ముడుపోయి బాధ్యతారహితంగా నడుచుకుంటున్నారు. మహిళల సమస్యలు చర్చించుకొని పరిష్కరించుకోటానికి చట్టసభలలో కనీసం స్త్రీలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఏనాడు పార్లమెంట్‌లో మహిళా ప్రతినిధులు 11 శాతానికి మించిలేరు. గత యూపీఏ ప్రభుత్వం చట్టసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఇస్తూమహిళా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టింది. కానీ ఆమోదం మాత్రం పొందలేదు. ఒకవేళ పొందిన స్త్రీలు చట్టసభలకు ఎన్నికైతే పంచాయతీరాజ్ అనుభవమే పునరావృతం అవుతుంది. స్త్రీలు డమ్మీలుగా మిగిలిపోగలరు. స్త్రీలను ఇంటికే పరిమితంచేసే భూస్వామ్య భావజాలం నేడు రాజ్యమేలుతోంది. ఈ రకంగా మొదటి నుండి రాజకీయ పరమైన వివక్ష కొనసాగుతూనే ఉంది. తీవ్ర ప్రజా ఉద్యమం ఫలితంగా యూపీఏ ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకొచ్చిన నిర్భయ చట్టం-2013 అమలులోకి వచ్చిన స్త్రీలమీద హింసారూపాలు అత్యాచారాలు పెరిగిపోతున్నాయే గాని తగ్గటం లేదు. పైపెచ్చు ఇప్పటి బీజేపీ ప్రభుత్వం చర్యలు ఇందుకు వత్తాసు పలుకుతున్నాయి. బిల్కిస్‌బానో కేసులో శిక్షలు పడిన పదకొండుమంది ముద్దాయిలను 'అమృతోత్సవం' పేరిట వదిలివేయటం, ముద్దాయిలు హారతులందు కొని మరీ స్వాగత సత్కారాలు పొందటం జరిగింది. అలాగే యూపీలోని 'హత్రాస్'లో దళిత యువతిని సామూహికంగా అత్యాచారం చేసి తగుల పెట్టారు. కాశ్మీరులో ఆసిఫా అనే ముస్లిం పసి కూనను పవిత్ర దేవాలయంలో రోజుల తరబడి అత్యాచారం చేసి చంపిన ముద్దాయిలను అరెస్టు చేస్తే, అక్కడి బీజేపీ వారు నిందితులను విడుదల చేయాలని ఊరేగింపులు చేయటం లాంటి సంఘటనలతో సభ్యసమాజం నివ్వెరపోయి సిగ్గుపడింది. ఈ సంఘటనలు 'బేటి బచావ్' ప్రభుత్వ(బీజేపీ) అసలు రంగు బయటపెట్టింది.

సామాజిక పరిణామంలో మొదట స్త్రీలకు మంచి గౌరవం ఉండేది. మాతృస్వామిక వ్యవస్థే ఇందుకు ఉదాహరణ. ఆ తరువాత వ్యక్తిగత ఆస్తి, వర్గ సమాజం ఏర్పడ్డాక స్త్రీలకు ఆస్తిహక్కు లేకుండా పోయింది. దీంతో స్త్రీలకు విలువ పోయి వంటింటి కుందేలు అయిపోయింది. ఇదే నేటివరకు కొనసాగుతూ ఉంది. సరిగ్గా వివక్ష ఇక్కడే మొదలైంది. స్త్రీలను రెండురకాల బానిసలుగా మార్చి వేసింది వర్గ సమాజం.

సామాజిక పరిణామంలో మొదట స్త్రీలకు మంచి గౌరవం ఉండేది. మాతృస్వామిక వ్యవస్థే ఇందుకు ఉదాహరణ. ఆ తరు వాత వ్యక్తిగత ఆస్తి, వర్గ సమాజం ఏర్పడ్డాక స్త్రీలకు ఆస్తి హక్కు లేకుండా పోయింది. దీంతో స్త్రీలకు విలువ పోయి వంటింటి కుందేలు అయిపోయింది. ఇదే నేటివరకు కొనసాగుతూ ఉంది. సరిగ్గా వివక్ష ఇక్కడే మొదలైంది. స్త్రీలను రెండు రకాల బానిసలుగా మార్చి వేసింది వర్గ సమాజం. ఇంటి బయట జీతమొచ్చే బానిసగా, ఇంట్లో జీతం లేని బానిసగా చేసింది. స్త్రీలు శ్రమ చేయటం తప్ప వారికి ఆస్తిని కలిగి ఉండే హక్కు లేదు. ఇది స్త్రీలను పూర్తిగా బలహీనపరిచింది. అప్పటి నుండి నేటి వరకు స్త్రీలు అనేక రకాలుగా దోపిడీకి గురవుతున్నారు, కాబట్టి స్త్రీల దోపిడీకి, వివక్షకు మూలం పెట్టుబడిదారీ మార్కెట్ ఉత్పత్తి విధానం.ఆర్థిక అసమానతలతో కూడిన ఈ విధానం నశించాలి. అందుకు మరో స్వాతంత్ర్య పోరాటం జరగాలి. సోషలిస్ట్ వ్యవస్థలు ఏర్పడాలి. సోషలిస్ట్ వ్యవస్థలో సామాజిక ఉత్పత్తిలో శ్రమ విముక్తి జరిగి స్త్రీల భాగస్వామ్యం పెరిగి వారి విముక్తికి దారి తీస్తుంది. ఇదే స్త్రీ విముక్తికి, అన్ని సామాజిక సమస్యల పరిష్కారానికి మార్గం.

(నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి

11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదనర్సన్న



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న మహిళలు

నవతెలంగాణ - కరీంనగర్ : నాయకత్వ లక్షణాలు పెంపొందిం చుకున్నప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కరీంనగర్ 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదనర్సన్న పిలుపునిచ్చారు. గురువారం స్థానిక భగత్ నగర్ బృందావన్ గార్డెన్‌లో కార్పొరేటర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగాయి. కార్యక్రమానికి కరీంనగర్ సఖి కేంద్రం ఇన్‌చార్జి లక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణి, రాష్ట్ర ఆర్పీల సంఘం అధ్యక్షురాలు సునీత, సీఓ తిరుపతి, ఆర్పీలు మంజుల, లత, అరుణ, విజయ లు ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను నిర్వహించారు. ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కరీంనగర్ నగరపాలక పరిధిలోని 25 స్వయం సహాయక సంఘాలకు కోటి 50 లక్షల రూపాయల విలువ చేసే చెక్కును పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు శాలువా కప్పి సన్మానించారు.

కంటే కూతుర్నే కనాలి..

- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- మగవారికి ధీటుగా ఫలితాలు
- అయినా పాతుకుపోయిన వివక్ష
- ఇంకా కొనసాగుతున్న దాడులు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ - కరీంనగర్

సృష్టికి మూలం మహిళ. ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేకత, హోదాను, గుర్తింపును కలిగి ఉండేలా అడుగులు వేస్తున్నారు. జిల్లాలో పలు కీలక పదవుల్లో మహిళలే మహారాణులుగా వెలుగొందుతున్నారు. అధికారికంగా.. రాజకీయంగా పురుషులకు ఏ మాత్రం తీసిపోమని తమ ప్రతిభతో నిరూపిస్తున్నారు. కలెక్టర్‌గా పమేలా సత్పతి జిల్లాను ప్రగతిబాటన పయనింపజేస్తుండగా, మినీ అసెంబ్లీగా పిలవబడే జిల్లా పరిషత్ కార్యకలాపాలను అధ్యక్షురాలి హోదాలో కనమల్ల విజయ సమర్థవంతంగా నడిపిస్తున్నారు. అంతేకాక జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ప్రతిమ న్యాయదేవతలా తీర్పులిస్తూ మహిళా లోకానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణ ప్రత్యేక కథనం..

ఆకాశంలో సగంగా అభివర్ధిస్తాం. చరిత్ర పుటలను ఒకసారి చూసినా కాకతీయుల రాణి రుద్రమాదేవి, వీరనారి ఝాన్సీలక్ష్మీభాయి వంటి మహనీయులు కనబడుతారు. మొన్నటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచిత ఉద్యమాన్ని నడిపించిన మల్లు స్వరాజ్యమూ ఇప్పటి తరానికి ఆదర్శప్రాయమే. అంతరిక్షం వరకు దూసుకుపోయి తన జీవితాన్ని జాతికి అంకితం చేసిన కల్పనాచావ్లా... ధైర్య సాహసాలకు పెట్టింది పేరు. ఒకింత అంధురాలైనప్పటికీ మహిళల అభ్యున్నతి కోస పోరాడిన హెలెన్‌కెల్లర్ కూడా ఒక ధీర వనితే. ఇలా ప్రపంచంలో ఏమూలన చూసినా ఏదో ఒకస్థాయిలో ఆడవారు తమ సత్తా చాటుతూనే ఉన్నారు. అభివృద్ధిలో సింహభాగం వారి కృషియే కనబడుతోంది.

జిల్లా స్థాయి అధికారుల్లో సగం మహిళామణులే..

జిల్లా స్థాయిలో పరిశీలిస్తే అటు అధికారగణంలోనూ, ఇటు ప్రజాప్రతినిధుల జాబితాలోనూ సగం మహిళామణులే ఉన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనమల్ల విజయ, జిల్లా కలెక్టర్ సత్పతి పమేలా, జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ మొదలుకుని జిల్లాస్థాయి అధికారుల్లో సగమూ స్త్రీలే ఉన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలను దిగ్విజయంగా నిర్వహిస్తూ ఔరా.. అనిపిస్తున్నారు. డీడబ్ల్యూఓ సరస్వతి, డీడీమార్కెటింగ్ వి.పద్మవతి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత, జిల్లా వ్యసాయశాఖ అధికారి ప్రియదర్శిని, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణీ, పలువురు కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు ఇలా చాల మంది అధికారులు, డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, రాజకీయనాయకులు ఎందరో మహిళామణులున్నారు.

ఇంకా కొనసాగుతున్న వివక్ష, దాడులు

మహిళల అభ్యున్నతి, వారి విజయగాథలు నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు చూస్తే వారు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, దాడులు, అత్యాచారాలు కోకొళ్లలు. దేశాన్ని ఏలే పాలకులున్న రాజధాని హస్తినాలోనే మహిళకు రక్షణ లేకుండా పోతోన్న రోజులివి. సగటున రోజుకు వందల సంఖ్యలో మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయి. కుళ్లిన చాందస సమాజంలో వరకట్న దాహానికి ఏడడుగుల బంధం మున్నాళ్ల ముచ్చటగానే మిగులుతోంది. ఇవన్నీ నిత్యం మీడియా స్రవంతిలో చూస్తేనే ఉన్నాం. ఇవి కూడా వెలుగులోకి వచ్చినవి మాత్రమే.

మరోవైపు పంచాయతీల్లో మహిళలకు సగం సీట్లు రిజర్వేషన్ కల్పించినా వారి సాధికారతను పెంచాల్సిందిపోయి... ప్రజలు ఓట్లేసి గెలిపించిన వారిని మళ్లీ వంటింటికే పరిమితం చేస్తూ వారి పతులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అంతా తామే అంటూ తెరవెనుక నుంచి పాలన సాగిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలించి, అవగాహన చేసుకుని, స్త్రీలు కూడా మనలో సమానమే అన్న భావనను సమాజంలో చొప్పించాలి. కలుషిత పురుషాహంకార రాజకీయాలను ప్రక్షాళన చేయడానికి, పతనమవుతున్న నైతిక విలువలను పునరుద్ధరించడానికి ప్రజాస్వామ్యవాదులు ముందుకురావాలి. పురుషాధిక్య సమాజ విలువల నుంచి స్త్రీని సమానంగా చూసే రోజులు రావాలి. అందుకు అందరమూ నడుంబిగించాలి.

మహిళలకు ఆరోగ్యానికి భరోసా

జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి దాక్టర్.సుజాత



మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. మహిళల ఆరోగ్యానికి ప్రతీ మంగళవారం ఉచితంగా చేస్తున్న పరీక్షలు భరోసాను నింపుతున్నాయి. ముందస్తు చర్యలతో పెద్ద అనారోగ్య ప్రమాదం నుంచి మహిళలను కాపాడుకునే అవకాశం దక్కుతుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 7న ఆరోగ్యమహిళా కార్యక్రమాన్ని నిర్వహించాం. మహిళలకు రొమ్ము, సర్వైకల్, ఓరల్ వంటి క్యాన్సర్ల నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. మహిళలకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు ఇక్కడ చికిత్స అందిస్తున్నాం. ఈ కేంద్రలలో పరీక్షలు చేసే వారు మహిళలే ఉంటారు. మహిళలు ఆరోగ్య మహిళ ద్వారా ఆరోగ్యంగా ఆనందమయంగా జీవించాలని ఆకాంక్షిస్తున్నాను.

లింగ వివక్ష విడనాడాలి.

దాక్టర్ శేషశైలజ ప్రముఖ ఫిజిషియన్



సమాజంలో ఏండ్లు గడుస్తున్నా లింగవివక్ష పోలేదు. నేటికి మహిళలు లింగవివక్షను ఎదుర్కొనడం బాధా కరం. సమాజంలో ఏండ్లుగా మహి ళదినోత్సవ వేడుకలు జరుపుకోవడమే జరుగుతుంది. తప్ప మహిళలకు సమాజంలో సమానత్వం సిద్ధించడంలేదు. సమానత్వం సాధించినప్పుడే మహిళ దినోత్సవానికి ఉపయోగం ఉంటుంది. మహిళలకు ఆరోగ్యానికి ప్రాధన్యత ఇవ్వాలి.

ఉన్నత చదువులతో సమాజంలో గౌరవం

సెయింట్ పాల్స్ ప్రిన్సిపాల్ లీనా ప్రియదర్శిని



ప్రతి ఆడపిల్ల ఉన్నత చదువులు చదివితేనే సమాజంలో మంచి గౌరవం ఉంటుంది. వివక్ష కు మూలమైన కుటుంబ వ్యవస్థలోనే మార్పు ఎంతో అవసరం. ప్రభుత్వం మహిళల అభ్యున్నతి, సాధికారతకు చిత్తశద్ధితో పనిచేస్తోంది. పుట్టిన ఇంటి నుండే మొదట మహిళా సాధికారిత ప్రారంభం కావాలి. తల్లిదండ్రులు మగ, ఆడపిల్లలను సమానంగా చూడాలి. సమాజంలోనూ మార్పు రావాలి.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి..

డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి



ఆకాశంలో సంగం, అవకాశాల్లో సగం ఈ మాటా మున్సిపల్ పాలకవర్గంలో సార్థకమైంది. అన్ని రంగాల్లో మహిళల అభివృద్ధి దిశగా పయనిస్తున్నారు. కుటుం బాల్లో, సమాజంలో లింగ వివక్ష అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలి. మంచి భవిష్యత్ కోసం మహిళలు ఆత్మవిశ్వాసంతో సాగాలి. చదువులో ర్యాంకులు సాధించడంతో పాటు బాలికలు ఆత్మస్థైర్యం పెంచుకోవాలి. తద్వారానే సమాజంలో ఎదురయ్యే పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవచ్చు.

మహిళల ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వాలి

దాక్టర్ నీలిమ కాసం, ఫీటల్ మెడిసిన్ స్పెషలిస్ట్, నీలిమా ఫెటో కేర్, పెటల్స్ నియో కేర్



తరాలు మారుతున్నాయి మహిళలు తమ సంకెళ్లను చేదించుకొని అన్ని రంగాల్లో రాణిస్తారు. కాని నేటికీ మనం లింగ వివక్ష లేని సమాజాన్ని సాధించామా అని అనుకుంటే సంశయించాల్సి వస్తుంది. 2024సంవత్సరానికి గాను అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్ 'ఇంక్లూడ్ ఇన్స్పిరేషన్' మహిళను అన్నింటిలోనూ చేర్చుకోవాలి. వారి చేరిక ప్రేరణ కావాలి మహిళలు ఆడపిల్లలు అన్ని రంగాల్లో పాల్గొనాలి. లేనిచో మనము ప్రశ్నించాలి. వారి ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వారి పదోన్నతిలో ఆటంకం కలుగకూడదు, వారి ఆరోగ్యానికి ప్రాముఖ్యతను ఇవ్వాలి. ఈ విధంగా ప్రతి మహిళ స్ఫూర్తితో ముందుకు అడుగు వేయాలి. అప్పుడే కుల జాతి లింగ వివక్ష లేని నవ సమాజం సాధ్యపడుతుంది.

ప్రశ్నించేతత్వం పెంచుకోవాలి

దాక్టర్ కలువ లీలా శర్వాణి, ప్రముఖ రేడియోలజిస్ట్



సమాజంలో మహిళ పురుషుడితో పాటు సమానంగా ఎదగడానికి చదువు ఒక్కటే మార్గం. చదువుతోనే మహిళా సాధికా రత సాధ్యమవుతుంది. మహిళ లు భరించేతత్వం వీడి ప్రశ్నించేతత్వం పెంచుకు న్నప్పుడే అన్ని రంగాల్లో రాణించగలరు. మహిళలకు మహిళా దినోత్సవ శు భాకాంక్షలు

మహిళలు రాజకీయాల్లోకి వచ్చి సేవచేయాలి.

కె.విజయ, కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్



చదువుతోనే అన్ని సమస్యలకు పరిష్కారం. ఆ దిశగా ముందుకుసాగాలి. అప్పుడే మహిళా సాధికారిత సాధ్యమవుతుంది. మహిళలు నేడు సాధిస్తున్న విజయాలను చూసి ఒకరినుంచి ఒకరు స్ఫూర్తి పొందాలి. మహిళలు నేడు రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ చేయాలి.

ఆత్మ స్థైర్యం పెంపోందించుకోవాలి

దాక్టర్ జ్యోతి, గైనాకాలజిస్టు, వాసర హస్పిటల్ కరీంనగర్



మంచి భవిష్యత్ కోసం మహిళలు ఆత్మవిశ్వాసంతో సాగాలి. చదువులో ర్యాంకులు సాధించడంతో పాటు బాలికలు ఆత్మస్థైర్యం పెంచుకోవాలి. తద్వారానే సమాజంలో ఎదురయ్యే పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొవచ్చు. సమాజంలో లింగ వివక్ష బలంగానే ఉందనేది వాస్తవం, మారుతున్న పరిస్థితుల్లో చదువుకున్న కుటుంబాల్లో ఇది క్రమేణా తగ్గుముఖం పడుతోంది. సమాజంలోనూ మార్పు రావాలి.

విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యం



మహిళలు వివిధ రూపాల్లో ఓ వైపు వివక్ష ఎదుర్కొంటున్నారు. మరో వైపు అద్భుతమైన, అపూర్వమైన విజయాలనూ సాధిస్తున్నారు. పురుషులకు తీసిపోని విధంగా రాణిస్తున్నారు. ఎందులో విజయం సాధించాలన్నా ఆత్మవిశ్వాసం చాలా అవసరమన్న విషయాన్ని గుర్తించాలి. విజేతలను స్ఫూర్తిగా తీసుకుని సమస్యలను అధిగమించాలి. అన్ని రంగాల్లో దూసుకుపోవాలి. అన్ని సమస్యలకు విద్య ఒక్కటే పరిష్కారం. జిల్లాలో బాలికలంతా చదువుకునలే ఆ చూడాల్సిన అవసరముంది. బాల్య వివాహాలను అరికట్టాలి. ఎప్పటికప్పుడు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని ముందుకెళ్లాలి. అప్పుడే ఆర్థిక సాధికారత, అభివృద్ధి సాధ్యమవుతుంది.

-దాక్టర్ బంగారి రజిని ప్రియదర్శిని, ప్రముఖ గైనకాలజిస్ట్, రజినీ ఫెర్టిలిటీ సెంటర్

సాధికారతతోనే నిజమైన గుర్తింపు



మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని మగవారితోపాటు మహిళలు సమానం అని రాజ్యాంగంలోనే పొందుపరిచారని దాన్ని చట్టసభల ద్వారా సాధించుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థిక, సామాజిక రాజకీయంగా ఎదిగి సాధికారిత సాధించినప్పుడే నిజమైన గుర్తింపు ఉంటుంది. ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న నేటి రోజుల్లోనూ ఆడపిల్ల పుడితే చాలు పురిట్లోనే అంతమొందిస్తుంటే మనం ఏ యుగంలో ఉన్నామో? అర్థం కావడం లేదు. ఇది ఎంతో బాధాకరం.

దాక్టర్ నయని, గైనకాలజిస్టు, ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్, కరీంనగర్

మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి. సాధికారత సాధించగలుగుతారు. మహిళలు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాల వైపు ప్రయనించాలి. ఉన్నతంగా ఎదిగిన మహిళల జీవిత చరిత్రలు చదవాలి. వివక్ష లేకుండా అన్ని రంగాల్లో రాణించాలి. మనలోని ప్రతిభా పాటవాలే మనను రాణింపజేస్తాయి. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు.

దాక్టర్ సుమలత, పల్మానాలజిస్ట్, సుమ హాస్పిటర్

వివక్ష లేని సమసమాజమే ప్రపంచ మహిళల ఆకాంక్ష



శతాబ్దానికిపైగా దాటిపో యినా లింగ సమానత్వం, మహిళా సాధికారకత విషయం లో సాధించింది అంతంత మాత్రమే. పురుషులతో సమానంగా ముందుకు సాగేలా ఆత్మస్థయిర్యాన్ని నింపుతున్న ధీరవనితలు చాలా మందే ఉన్నారు. తమ రంగాలలో అగ్రస్థానంలో నిలిచి చరిత్ర సృష్టించారు. మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, ఇబ్బందులపై చర్చించి, మహిళా హక్కులు, సమాన్వతం తదితర అవగాహన కల్పించడమే ఈ మహిళా దినోత్సవ ఉద్దేశం.

దాక్టర్ ఎనమల శ్రీదేవి, ప్రముఖ గైనకాలజిస్ట్, రోహన్ ఆస్పత్రి

మహిళల పురోభివృద్ధికి సమిష్టి కృషిచేయాలి



మహిళల పురోభివృద్ధికి సమాజంలోని అందరూ సమిష్టిగా కృషి చేయాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు నా శుభాకాంక్షలు. కేవలం మహిళదినోత్సవ రోజే కాకుండా ఎప్పుడూ మహిళల అభ్యున్నతికి పాటు పడాలి. మగువలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. వారికి మరింత ప్రోత్సాహం అందిస్తే ఎక్కువ విజయాలు సాధిస్తారు. కుటుంబంలో తల్లిదండ్రులూ అబ్బాయిలతో పాటు ఆడ పిల్లలకూ సరైన విద్యను అందించి ప్రోత్సహించాలి. ఉద్యోగాల్లో, వేతనాల్లో పురుషులకు సమానంగా మహిళలకు అవకాశం కల్పించాలి. ఆడపిల్లలు విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి.

-ఆకుల నర్మదనర్సన్న, 11వ డివిజన్ కార్పొరేటర్

స్త్రీల పట్ల వివక్షను రూపుమాపాలి



ప్రసుత్త సమాజంలో అన్ని రంగాలలో స్త్రీలు రాణిస్తున్నప్పటికీ సమాజంలో స్త్రీలపై వివక్షత కొనసాగుతునే ఉంది. మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, అసమానతల వలన మహిళలు అనేక రకాల హింసలను ఎదుర్కొంటున్నారు. దీనికి ముఖ్య కారణం పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీలు రెండవ శ్రేణి పౌరులుగా గుర్తింపబడటమే. సమాజంలో స్త్రీ ,పురుషులు ఇద్దరు సమానమే అనే ఆలోచన తోనే మహిళలకు సముచిత స్థానం దక్కుతుంది. కుటుంబం, ప్రజాప్రతినిదులుగా, విద్యా, వ్యాపార, పారిశ్రామిక, రంగాలతో పాటు అన్ని రంగాలల్లో ఉన్న ఉద్యోగాల్లో ఉన్నతాధికారులుగా విదులు నిర్వర్తిస్తున్నారు. అందులో పురుషలకు సమానంగా బాధ్యతులు నిర్వర్తిస్తున్నారు. దీనిని అందరూ గుర్తించాల్సిన అవసరం ఉంది.

దాక్టర్ ఆర్.లక్ష్మి, క్రిటికల్ కేర్ స్పెషటిస్ట్, ఆరోగ్య ఆస్పత్రి

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



మహిళలు ప్రతి రోజులు ఇంటి సమస్యలతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. మహిళలు ఆర్యోగంగా ఉంటేనే ఇల్లు, కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. అందుకే ప్రతీ మహిళ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి. మహిళలు తమ హక్కులు తెలుసుకోవాలి. మహిళలకు అంతర్జాతీయ మహిళ దినోత్సవం శుభాకాంక్షలు

దాక్టర్ సింధూర ప్రియాంకరెడ్డి, ఎండీ రెడియోడయాగ్నోసిస్, ఫెలోషిప్ ఇన్‌పెటల్ మెడిసిన్

మహిళబిల్లుతో అరుదైన గౌరవం దక్కింది

అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాలల చైర్మన్ ఎన్.రవీందర్‌రెడ్డి



మహిళామణులకు మహిళా బిల్లు ద్వారా అరుదైన గౌరవం దక్కింది. నింగి, నేలా సాక్షిగా అన్నింటిలో దూసుకుపోతున్న అతివలకు చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్ కల్పించాలనే కలనెరవేరడం సంతోషంగా ఉంది. పరిపాలనలో మహిళల పాత్రను పెంచడంతో పాటు మహిళా సాధికారతకు ఊతమిస్తుంది. మహిళలు శాస్త్ర సాంకేతికర రంగాల్లో దూసుకపోతున్నారు. మహిళలు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

మహిళా రక్షణకు చట్టాలు మరింత పటిష్టంగా అమలు చేయాలి



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నాతోటి మహిళలందరికీ శుభాకాంక్షలు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎన్నో రంగాల్లో తమ అద్భుతమైన ప్రతిభను చాటుతు న్నారు. అయినా ఎక్కడో ఒకచోట అవాంఛనీయ ఘటనలు జరు గుతూనే ఉన్నాయి. మహిళా రక్షణ కోసం ఎన్నో చట్టాలు వచ్చినా, ఇంకా ఎన్నో దౌర్జన్యాలు జరుగుతున్నాయి. మహిళా రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టా లు మరింత కఠినతరం చేసి, మరింత పటిష్టంగా అమలుపరిచి మహిళా హక్కులను గౌరవించాలి. హింస లేని సమాజంలో సంతోషంగా బతికే రోజును రావాలని ఆశిద్దాం.

విజయలక్ష్మీనాగరాజ్, కవయిత్రి, రచయిత్రి-హుజూరాబాద్

శ్రీ సప్తగిరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలు



నవతెలంగాణ - కరీంనగర్ రూరల్ : శ్రీ సప్తగిరి లయన్స్ ఉమెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు సప్తగిరి కాలనీలోని రామాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు పన్యాల సుజాత ఆధ్వర్యంలో ఐదుగురు గర్భిణులకు సీమంతం నిర్వహించి వారికి వస్త్రాలు, పండ్లు, ఫలహారాలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఉమెన్స్ లయన్స్ క్లబ్ సభ్యులు సత్యవతి, విమల, నిరంజని దేవి, సుజాత, అంగన్వాడి సూపర్వైజర్లు విజయ, స్వప్న, అంగన్వాడీ టీచర్లు ఉషారాణి, హరిప్రియ, పన్యాల వెంకటరెడ్డి, కోటేష్ కుమార్, కంటే రామచందర్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బిల్లులు చెల్లించాలి

బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్



మాట్లాడుతున్న బీకేఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్

ఉపాధిహామీ కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొమ్మకల్ గ్రామంలో ఉపాధిహామీ పనులను సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలకు నాలుగు నెలలుగా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కొలతల ఆధారంగా పనిచూడకుండా వేతనాలు పెంచాలని అన్నారు. ఆధార్ లింక్ తో పని చేసిన డబ్బుల మెసేజ్ వస్తున్న ఖాతాల్లో డబ్బులు పడడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టం ప్రకారం ఉపాధిహామీ కూలీలకు రోజు వారీ కూలి 600రూపాయలు చెల్లించాలని, 200రోజులు పని కల్పించాలని, పని ప్రదేశాలు దూరంగా ఉంటే రవాణా ఖర్చులు ఇవ్వాలని, ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి 5వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, పని గ్యారంటీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్లగొండ శ్రీనివాస్, విజయ, లక్ష్మీ లలిత, జ్యోతి మాధవి, వనిత, శైలజ, రాజవ్వ, కనుకలక్ష్మీ మల్లవ్వ, శోభారాణి పాల్గొన్నారు.

సంజీవని ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం



స్వాగతం పలుకుతున్న డాక్టర్లు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట పట్టణంలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. సీనియర్ వైద్య నిపుణురాలు, సామాజిక వేత్త డాక్టర్ హేమలత ప్రారంభించారు. సుమారు 400మంది మహిళలు వైద్య శిబిరంలో పాల్గొన్నారు. డాక్టర్ ఎం.ప్రణీత, డాక్టర్ ఊడుగుల అనిత ఆధ్వర్యంలో వివిధ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడారు. ఇలాంటి ఉచిత శిబిరాలు సామాన్య ప్రజలకు ఒక వరం లాంటిది అన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సామాజిక సేవ దృక్పథం గల సంజీవని ఆస్పత్రి యాజమాన్యాన్ని కొనియాడారు. ఇకముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యము అందిస్తూ, సామాన్యులకు అందుబాటులో ఉండే ఫీజును తీసుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సురేష్, డాక్టర్ ఊడుగుల సురేష్, డాక్టర్ కిషోర్ కుమార్ కామిశెట్టి, మేనేజ్మెంట్ కిరణ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

జమ్మికుంటలో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్

నవతెలంగాణ - జమ్మికుంట

ఈ నెల 7 నుండి జమ్మికుంట రైల్వే స్టేషన్లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఉంటుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ట్రైన్ సికింద్రాబాద్ నుండి దానాపూర్‌కు వెళుతుందన్నారు. దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఆగడం వలన జమ్మికుంట పరిసర ప్రాంత ప్రజలకు సౌకర్యార్థకంగా ఉంటుందని తెలిపారు.

జమ్మికుంట మున్సిపల్ సమావేశం



నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షతన గురువారం 2024-25 సంవత్సరానికి సంబందించిన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. రూ.2324.74 లక్షల బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మొహమ్మద్ ఆయాజ్, కౌన్సిలర్స్, మేనేజర్ భూపాల్‌రెడ్డి, జేఏఓ విమల పాల్గొన్నారు.

మార్కెట్ కు మూడు రోజులు సెలవులు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం విడి పత్తి 773 క్వింటాళ్లు 51 వాహనాలలో రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ఠ ధర 7,550, మోడల్ - 7400, కనిష్ఠ - 6,500 పలికిందని మార్కెట్ సెక్రటరీ గుగులోతు రెడ్డి తెలిపారు. శుక్రవారం అమావాస్య సందర్భంగా, శని, ఆదివారాలు మార్కెట్ సాధారణ సెలవులు ప్రకటించినట్టు తెలిపారు. తిరిగి ఈ నెల 11న మార్కెట్ పునఃప్రారంభం అవుతుందని, రైతులు గమనించి సహకరించాలని మార్కెట్ కార్యదర్శి కోరారు.

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మండలం గంద్రపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఆరోగ్య శిబిరం గురువారం నిర్వహించారు. విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల అవగాహన కల్పించారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ హిమబిందు, ప్రిన్సిపాల్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికే సైన్స్ ఫెయిర్

చొప్పదండి సీఐ రంగప్రకాష్‌గౌడ్



నవతెలంగాణ - చొప్పదండి

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి సైన్స్ ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందని చొప్పదండి సీఐ రంగప్రకాష్‌గౌడ్ అన్నారు. చొప్పదండి మండల కేంద్రంలోని శ్రీ కృకష్ణవేణి హైస్కూల్లో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో ముఖ్యఅతిథిగా సీఐ విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లింగారావు, ప్రధానోపాధ్యాయుడు మేడిశం భయ్యా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు అందజేత



నవతెలంగాణ - గన్నేరువరం

మండలంలోని జంగపల్లి, గన్నేరువరం జెడ్పీపాఠశాలలో పదోతరగతి విద్యార్థులు 116 మందికి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడులు, పెన్నులు, హాల్ టికెట్ కవర్స్ గురువారం అందజేశారు. పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5000 బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు.

ముందస్తుగా మహిళా దినోత్సవ సంబరాలు

నవతెలంగాణ ఇబ్రహీంపట్నం



ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గురువారం ముందస్తు గా మహిళా దినోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరంప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ భారతదేశం స్త్రీ మూర్తికి మొదటి ప్రాధాన్యత ఇచ్చిందని, వేద కాలం నుంచి మొదలుకొని ఇప్పటివరకు ఈ దేశంలో స్త్రీ సముచిత స్థానాన్ని పొందుతూ అమ్మగా అమ్మమ్మగా అక్కగా చెల్లిగా అనేక రూపాల్లో అగ్రస్థానంలో ఉందన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సారంగాపూర్



బీర్‌పూర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందించారు. గురువారం బీర్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన 46 మంది లబ్ధిదారులకు మంజూరైన 46 లక్షల రూపాయల విలువగల కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన అందజేశారు

మంత్రి సన్మాన సభకు గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి

నవతెలంగా-ఇబ్రహీంపట్నం



ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రవాణా. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఘన సన్మానంకు గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనం కు తరలి రావాలని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్ కోరారు. ఇబ్రహీంపట్నం మండలంలోని గోదురు గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న సంక్షేమ సంఘం నేరెళ్ల సుభాష్ అధ్యక్షతన ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 10న మధ్యాహ్నం 12 గంటలకు వి కన్వెన్షన్ బొమ్మకల్ బైపాస్ రోడ్డు కరీంనగర్‌లో గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనానికి భారీ సంఖ్యలో గౌడ బంధువులు కదలి రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గం కన్వీనర్ గోల్లపల్లి రామా గౌడ్, గొదుర్ గౌడ సంఘం అధ్యక్షులు కట్ట లక్ష్మీనారాయణ గౌడ్, గౌడ సంఘ సభ్యులు చెట్ల జోగేశ్వర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

అంతర్జాతీయ జపాన్ 3వ డాన్ బ్లాక్ బెల్ట్ డిప్లొమా సాధించిన కరాటే మాస్టర్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ బ్లాక్ బెల్ట్ ప్రశంసా పత్రాల ప్రధానోత్సవ కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ లెజెండ్ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత నటుడు సుమన్ చేతుల మీదుగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు సీనియర్ కరాటే మాస్టర్ ప్రవీణ్ కుమార్‌కు అంతర్జాతీయ జపాన్ బ్లాక్ బెల్ట్ డిప్లొమా ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ ఈ రోజుల్లో విద్యార్థులు శారీరిక మానసిక వ్యక్తిత్వ వికాసానికి విద్యార్థుల ఎదుగుదలకు ఇలాంటి కరాటే ఆత్మరక్షణ విద్యలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ స్టేట్ జపాన్ కరాటే అసోసియేషన్ ఛైర్మన్ సినీ నటుడు సుమన్, జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ శ్రీనివాసచారీ, జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు ప్రవీణ్ కుమార్,పాల్గొన్నారు

రంజాన్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

నవ తెలంగాణ-జగిత్యాల టౌన్



పవిత్ర రంజాన్ మాసంలో ముస్లీం మైనారిటీలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలను నుంచి వచ్చిన ముస్లీం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా ప్రార్థన మందిరాల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా, ముఖ్యంగా ప్రార్థన సమయంలో సరఫరాలో సమస్యలు రాకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని, అవసరమైన పక్షంలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, డి.ఎస్.పి. రఘు చందర్, జడ్పీ సీఈఓ గౌతం రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సాయిబాబా, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, ముస్లిం మైనారిటీ ప్రతినిధులు, పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-మల్లాపూర్



మండలంలోని ముత్యంపేట గ్రామం లోని బస్టాండ్ ఆవరణలో సుమన్ యూత్, ఉయ్యాల సుకుమార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత చలివేంద్రాన్ని సుమన్ యూత్ సభ్యులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమన్ యూత్ నాయకులు మాట్లాడుతూ.. ఉయ్యాల సుకుమార్ అనేక సేవా కార్యక్రమాలు చేసేవారని తెలిపారు. ఆయన చిన్న వయసులోనే ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. ఆయన జ్ఞాపకార్థం మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి కోరుట్ల నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో మినీ బస్టాండ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనేకమంది నిరుపేదలకు శీతాకాలంలో బట్టలు, దుప్పట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుకుమార్ తండ్రి విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు ఉయ్యాల నరసయ్య, ప్రముఖ పాత్రికేయుడు బలిజ రాజారెడ్డి, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు ఉయ్యాల శోభన్, పాల్గొన్నారు.

డ్రిప్ లైన్ పైపులు ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని సంగెం గ్రామ శివారులోని 299 సర్వే నెంబర్‌లో గల మూడెకరాల భూమిలో గల ఆయిల్ ఫామ్ లో డ్రిప్ లైన్ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు బాధితులు దేవా విశాలాక్షి, సంధ్య గురువారం తెలిపారు. సబ్సిడీ ద్వారా వచ్చిన 5 లక్షల రూపాయల విలువగల డ్రిప్ పైప్ లైన్ భూమిలో నుంచి బయటకు తీసి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని వాపోయారు.

గౌడ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మల్లాపూర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ ఈనెల 10వ తేదీన నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని గౌడ సంఘం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని గౌడ సంఘ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 10 న ఆదివారం రోజున మధ్యాహ్నం 12 గంటల నుండి వి కన్వెన్షన్ బొమ్మకల్ బైపాస్ రోడ్డు కరీంనగర్ లో గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనానికి భారీ సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలని కోరారు.

స్వయం సహాయక సంఘాల తోడ్పాటుతో

స్వశక్తితో ఎదుగుతున్న మహిళలు

నవతెలంగాణ-రాయికల్



వంటింటికి పరిమితం కాకుండా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారు అనడానికి నిదర్శ నంగా, స్వయం సహాయక సంఘాల సహకారంతో పేదరికం నుండి కొద్దీ కొద్దిగా తమ కుటుంబాల ఆర్థిక వ్యవస్థను మెరుగు పరుచు కుంటూ సాటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న ఆ తల్లులపై మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..కరోనా కన్నెర చేసిన సమయంలో కుటుంబ ఆర్థిక వ్యవస్థలు చిన్న భిన్నం అయినా పరిస్థితులను తట్టుకొని,మీ వల్ల కాదు అని ఎగతాళి చేసినవారి నోరు మూయిస్తూ స్వయం సహాయక సంఘాల తోడ్పాటుతో స్వశక్తితో ముందుకు నడుస్తున్నారు ఈ మహిళలు..

లోన్ తీసుకుని వ్యాపారం పెట్టుకున్నా

సిరిపురం భూదేవి
(చెప్పుల తయారీ వ్యాపారస్తురాలు-కిష్టంపేట)



మాది కిష్టంపేట గ్రామం కరోనా సమయంలో భర్త రామచంద్రం దుబాయి నుండి స్వదేశానికి వచ్చారు. ఆయన వచ్చిన 3 నెలలకు అత్తమ్మ చనిపోయింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం ఇద్దరు కుమారులు అపుడు 18 ఏళ్ళ లోపు వయసు గలవారే బీడీలు చుడుతూ వచ్చే ఆదాయం సరిపోవడం లేదు.ఏం చేద్దామని ఆలోచించే సమయంలో మా ఆయనకు చెప్పుల తయారీ వ్యాపారం చేయాలనే ఆలోచన వచ్చింది. కానీ ఏ వ్యాపారం చేయాలన్న లక్షల్లో పెట్టుబడి పెట్టాలి. చేతిలో చిల్లి గవ్వ లేదు.అపుడు మా విఒ లీడర్ శ్రీ సాయి స్వయం సహాయక సంఘం ద్వారా అక్టోబర్ 2021లో లక్ష రూపాయల అప్పు ఇచ్చారు. చెప్పుల తయారీ వ్యాపారానికి కావాల్సిన మిషన్ కొనుగోలు చేసి వ్యాపారాన్ని ప్రారంభించాం.గడిచిన 3 సంవత్సరాల్లో లక్ష నుండి రూ.3 లక్షల వరకు శ్రీనిధి ద్వారా లోన్ తీసుకొని వ్యాపారం చేస్తూ అప్పు తీరుస్తూ రోజుకి ఒక వేయి రూపాయల వరకు ఆదాయం సమకూరుతుంది.

పాలవ్యాపారంతో ఆదాయం సంపాదిస్తున్నా

సిరికొండ ఉమా
(డైరీ ఫాం వ్యాపారస్తురాలు-ఇటిక్యాల)



కుట్టు మిషన్ పని చేస్తుండే దానిని, కుటుంబ అవసరాలకు అనుగుణంగా డబ్బులు సరిపోయేవి కావు, 2018లో భర్త సాయి కిరణ్ తీవ్ర మైన అనారోగ్యం తో గల్ఫ్ దేశం నుండి తిరిగి వచ్చారు. మాకు ఆవులు అంటే చాల ఇష్టం.డైరీ ఫాం ఏర్పాటు చేసేందుకు ఉన్న కొద్ది డబ్బులతో చిన్న షెడ్ వేసాం.వెలుగు సాయి మహిళా సంఘం ద్వారా అప్పు తీసుకొని మొదట 2 ఆవులను కొనుగోలు చేశాను. రెండు ఆవులతో ప్రారంభం చేసిన పాల వ్యాపారం,స్వయం సహాయక సంఘాల ద్వారా రూ 8 లక్షలు లోన్ తీసికుంటూ తిరిగి చెల్లిస్తూ మా ఆయన సహకారంతో ఇప్పుడు 08 ఆవులతో నెలకి రూ.40 వేల వరకు సంపాదిస్తున్నాను.

పిండివంటలతో ఆదాయం

మారుపాక రమ (కిష్టంపేట)



మా మహిళా సంఘం నెల వారి సమావేశంలో పచ్చడులు, పిండి వంటకాల వ్యాపారం చేయాలనే ఆలోచన వచ్చింది. భువనేశ్వరి,శ్రీనిధి సంఘాల ద్వారా రూ.3 లక్షల వరకు లోన్ తీసుకొని ఇంట్లోనే పచ్చడులు, పిండి వంటకాలు చేస్తున్నాను.రెండు సంవత్సరాల క్రితం వ్యాపారాన్ని ప్రారంభించాను. చికెన్, మటన్ తో పాటు మామిడి, కాకర,టమాటా వంటి చట్నీలను తయారు చేస్తాను.ఎక్కువగా గల్ఫ్ దేశం వెళ్లే వారు ఆర్డర్ ఇస్తారు.నెలకి రూ.5000వేల వరకు అదనపు ఆదాయం సమకూర్చు కుంటున్నాను.

పాలన మరచి...అబద్దాలు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు : ఎమ్మెల్యే సంజయ్

నవతెలంగాణ -మెట్‌పల్లి



ముఖ్యమంత్రికి ప్రజల సమస్యలపై పట్టింపులేదని, రోజుకో అబద్ధం ఆడుతూ కాలం వెళ్ళదిస్తున్నారని, ముఖ్యమైన వ్యవసాయ రంగంపై ముఖ్యమంత్రి హోదాలో ఇంతవరకు సమీక్ష నిర్వహించలేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆరోపించారు. గురువారం మెట్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పంటలకు నీరు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతుంటే ఇంతవరకు వ్యవసాయ రంగంపై ముఖ్యమంత్రి సమీక్షించలేదని పాలన పట్ల కాంగ్రెస్ నాయకుల చిత్తశుద్ధి ఇదని ఆరోపించారు. ఎండాకాలం సమీపస్తునందున రాష్ట్రంలో తాగునీటి ఏద్దడి లేకుండా చూడాలని వెంటనే అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు.

ఎల్ఆర్ఎస్ భారం.

రాష్ట్ర ప్రజలపై ఎల్ఆర్ఎస్ పేరుతో సుమారు 25వేల కోట్ల రూపాయల భారం వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని దీన్ని అడ్డుకొని తిరుతామన్నారు. కోరుట్ల నియోజకవర్గం లోన్ సుమారు 15 వేలకు పైగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఉన్నాయని ఎవరు కూడా ఆందోళన చెందవద్దన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పై కాంగ్రెస్ అసత్యపు ప్రచారం..

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు రోజుకో మాట మాట్లాడుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని,కేవలం రెండు పిల్లర్లు పగుళ్ల రాగానే బ్యారేజీ పనికిరాదని అంటున్నారన్నారు. ఇంజనీర్లని సంప్రదించి రిపేర్ చేస్తే సరిపోతుందని ఇప్పటికి కాళేశ్వరం వద్ద నీటి ప్రవాహం ఉందని నీటిని ఎత్తిపోయడం ద్వారా ప్రజల అవసరాలు తీర్చవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుజాత, వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రావు, ఎంపీపీ మారు సాయిరెడ్డి, కౌన్సిలర్స్ లంక గంగాధర్, బంగారు కాళ్ల కిషోర్, ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్, కోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా ఉద్యోగులను సన్మానించిన కలెక్టర్

నవతెలంగాణ -మెట్‌పల్లి



అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని జగిత్యాల కలెక్టర్ కార్యాలయం లో జరిగిన ముందస్తు మహిళా దినోత్సవ వేడుకల్లో మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రెవిన్యూ ఆఫీసర్ ఉమా, మెప్మా ఆపరేటర్ పల్లవిలు ఉత్తమ మహిళల ఉద్యోగులుగా ఎన్నికైన సందర్భంగా కలెక్టర్ వారిని సన్మానించి,ప్రశంసా పత్రాలను అందించారు.

పెద్దాపూర్ మల్లన్న దేవాలయం కమిటీ ఎన్నిక

నవతెలంగాణ -మెట్‌పల్లి



మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ మల్లన్న స్వామి దేవస్థాన నూతన కమిటీని గ్రామస్తులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆలయకమిటీ అధ్యక్షునిగా మిట్టుపల్లి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షునిగా మెరుగు రమేష్ గౌడ్, పిల్లి మల్లేశం యాదవ్,కచ్చు శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తలుగా బైరి సురేష్, తెలుగంటి స్వామి, గొర్రె నరసయ్య, లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

13న మున్సిపల్ తై బజారుకు వేలం

నవతెలంగాణ -మెట్ పల్లి

మెట్ పల్లి మున్సిపల్ పరిధిలో బహిరంగ మార్కెట్ లో తై బజారు వసూలు కోసం ఈ నెల 13 బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వేలం పాట జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనేవారు మంగళవారం సాయంత్రం లోగా నిర్దేశించిన ఫీజు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఎల్ఆర్ఎస్‌ను నిలిపివేయాలని కలెక్టర్‌కి వినతి

నవతెలంగాణ-మెట్ పల్లి


కలెక్టర్‌కి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యేలు

ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ గురు వారం కోరుట్ల ఎమ్మెల్యే సంజ య్, జగిత్యాల ఎమ్మెల్యేతో కలిసి జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల పట్ల చిత్తశుద్ధి లేదని ఎల్ఆ ర్ఎస్ పేరున 20 వేల కోట్ల భారం ప్రజలపై వేయాలని చూస్తుందన్నారు.

జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

నవతెలంగాణ -మెట్‌పల్లి



కోరుట్ల నియోజకవర్గ యువత మెగాజాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ యువతను కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మెట్ పల్లి వెంకట్ రెడ్డి గార్డెన్లో ఈనెల 12 మంగళవారం రోజున 10 గంటల నుండి సాయంత్రం 4 గంటలవరకు మెగా జాబ్ మేళా జరిగితుందని ఇందులో 50 కంపెనీ లపైనే కంపెనీ ప్రతినిధులు వస్తున్నారని సుమారు 2 వేల మందికి ఉద్యోగ అవకాశం ఉందని తెలిపారు.దానికి సంబంధించి నిరుద్యోగులు సోమవారం ఉదయం లోగా తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.ఉచిత రిజిస్ట్రేషన్ కోసం క్యూఆర్ కోడ్ ను ఎమ్మెల్యే విడుదల చేసారు, క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం తమ కార్యాలయం సిబ్బంది రామకృష్ణ 9948335533 నవీన్ 7893636313 ఫోన్ ద్వారా, లేదా నేరుగా సంప్రదించి నిరుద్యోగ యువత తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

జాతర బస్ క్యాంప్ ప్రారంభించిన సీఐ నవీన్

నవతెలంగాణ -మెట్‌పల్లి

మహాశివరాత్రి జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం మెట్‌పల్లి బస్‌స్టాండ్‌లో ఏర్పాటు చేసిన క్యాంప్ ను మెట్‌పల్లి సీఐ నవీన్, ఇన్‌చార్జీ డిపో మేనేజర్ మాధురితో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు బస్‌లను జాగ్రత్తగా నడుపాలని, కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవి,ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గట్ల రమేష్, పాల్గొన్నారు.

ఎస్‌బీఐ బ్యాంక్ ముందు కాంగ్రెస్ నాయకుల నిరసన

నవతెలంగాణ -మెట్‌పల్లి



రాజకీయ పార్టీలకు సంబంధించి ఎలక్ట్రికల్ బాండ్‌ల వివరాలను మార్చి 6వ తేదీ లోగా పూర్తి వివరాలు ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించినా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు ఎలక్ట్రికల్ బాండ్ వివరాలను బహిర్గతం చేయకపోవడాని నిరసిస్తూ మెట్ పల్లి ఎస్‌బీఐ బ్యాంక్ ముందు కాంగ్రెస్ నాయకులు నిరసనకు దిగారు.ఎలక్ట్రికల్ బాండ్ ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, కౌన్సిలర్ ఎండి షాఖీర్, ఇబ్రహీంపట్నం మండల ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. గురువారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన అబ్బడి శ్రీనివాస్‌కు చెందిన ట్రాక్టర్‌లో కోమటి కొండపూర్ శివారులో గల గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తన ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ఇబ్రహీంపట్నం గ్రామ శివారులో పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు

పలు గ్రామాల్లో గృహ జ్యోతి ప్రారంభం


జీరో బిల్లు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్. తిమ్మాపూర్ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి కార్యక్రమాన్ని నాయకులు ప్రారంభించారు. లబ్ధిదారులకు విద్యుత్ అధికారులు జీరో బిల్లును అందజేశారు. కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సోషల్ మీడియా కో కన్వీనర్ కట్ట మనోజ్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ సల్ల సునీల్, తలారి ఆనంద్, కాస సంజీవ్, కాటిపల్లి రాజారెడ్డి, బోడలింగారెడ్డి, కాస ప్రశాంత్ లోక నరేందర్ రెడ్డి, రాజేశుని భూమయ్య, రాజేషుని రాకేష్, బైర మనోజ్, విద్యుత్ జూనియర్ లైన్మెన్ రవి, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సంక్షేమ పథకాలు అందేలా కృషి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



నవతెలంగాణ- కొడిమ్యాల

సకాలంలో సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తూ ముందుకు నడుస్తుందని, ప్రతి లబ్ధిదారుడు వీటిని సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో రూ. 59 లక్షల కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. అలాగే ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలకు నష్టపరిహారం కింద రూ .16 వేల చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలువేరి నారాయణ గౌడ్, మాజీ కేడీసీసీబీ అధ్యక్షుడు గుడి మల్లికార్జున్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జీవన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జామల్పూరి రాజేశ్వరి రాజేందర్, జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు భూషన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఐలయ్య,మ్యాకల మల్లేశం,రాజమల్లు, నాయకులు కాదారి మల్లేశం,పాల్గొన్నారు.

8వ రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

నవ తెలంగాణ-జగిత్యాల టౌన్

ద్వితీయ సంవత్సర జనరల్ విద్యార్థులకు జరిగిన గణిత శాస్త్రంబి, జంతు శాస్త్రం, చరిత్ర పరీక్షలో 4109 మంది విద్యార్థులకు 4052 మంది హాజరు కాగా 57 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1254 విద్యార్థులకు గాను 1180 మంది విద్యార్థులు హాజరు కాగా 74 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు.ఫ్లయింగ్ స్క్వాడ్ లు, సిట్టింగ్ స్క్వాడ్ లు,డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ, పరీక్షల కన్వీనర్ కలిసి మొత్తం 19 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగిత్యాల టౌన్



మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జగిత్యాల ఐడిఓసి సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారు అని తెలిపారు. గృహలక్ష్మి, మహాలక్ష్మి వంటివి రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఆధారిత కార్యక్రమాలను ప్రవేశ పెట్టి అమలు పరుస్తున్నదని అన్నారు. మహిళలు పొదుపు ఎక్కువగా చేస్తారని, నిరంతరం మహిళలు ఇంటి బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. శాశ్వతంగా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం మహిళా స్వయం సంఘాలకు రుణాలను అందిస్తున్నదని తెలిపారు. మహిళలు లేకుండా సమాజం లేదని, మహిళా సాధికారతకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ఆరోగ్య విషయంలో ఎక్కువ ఇన్వెస్ట్ చేయాలని అన్నారు. సామాజికంగా, నైతిక బాధ్యతతో మహిళలు పనిచేస్తున్నారని వివరించారు.జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, మహిళల సహకారంతోనే అభివృద్ధి జరుగుతుందని, ప్రభుత్వం బాలకల కోసం ప్రత్యేకంగా గురుకులాలు ఏర్పాటు చేసిందని, మహిలాభ్యుదయం కోసం సఖీ కేంద్రాలను నెలకొల్పి బాధిత మహిళలకు అండగా నిలుస్తున్నా యని తెలిపారు. కోరుట్ల శాసన సభ్యులు డా. కే.సంజయ్ మాట్లాడుతూ, మహిలాలతినే దేశాభివృద్ధి జరుగుతుందని, మహిళలు జీవిత దాతలు అని వివరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ, మగవారితో ధీటుగా మహిళలు రాణిస్తున్నరని తెలిపారు.ఈ కార్యక్రమాలలో జిల్లా సంక్షేమ అధికారిణి వాణి, వివిధ శాఖలలో మహిళా ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్‌లో పరివర్తన్ అన్యువల్ డే సెలబ్రేషన్స్

నవతెలంగాణ-జగిత్యాల టౌన్



సాంస్కృతిక కార్యక్రమాలలు ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుందని, కార్యకలాపాలను ఉత్సాహంగా పూర్తి చేయవచ్చని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి తో కలిసి ఆల్ఫోర్స్ పరివర్తన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేడు చాలా మంది యువకులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోవడం వివిధ అసాంఘిక పనులకు బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తరగతి గదిలో చాలా ఉత్సాహంగా ఉల్లాసంగా వ్యవహరించి ఏకాగ్రతతో అధ్యాపకులు బోధించే విషయాలను చురుకుగా చక్కగా తప్పకుండా విని విశ్లేషించుకోవాలని కోరారు. చిన్ననాటి నుండి ఉత్తమంగా వ్యవహరించి సమాజానికి కొద్దిగా ఉండాలని చెప్పారు. విద్యార్థులు సంచలన విజయాలను నమోదు చేయాలని చాలా గొప్ప విషయమని, ప్రారంభం నుంచే అత్యుత్తమ కీర్తిని సొంతం చేసుకోవడం ద్వారా వ్యవహర శైలి ఒక గొప్ప నిదర్శనం అని అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ - బోయినిపల్లి



మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోను పలువురు శాలువాలతో సన్మానించారు. వివిధ శాఖల అధికారినిలు బతుకమ్మలు పేర్చి బతుకమ్మ ఆట ఆడారు. పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు వివిధ శాఖలలో ఉన్న మహిళ ఉద్యోగులను అంగన్‌వాడీ ఆశా వర్కర్, ఏఎన్ఎంలు, ఐకేపీకి సంబంధించిన మహిళలను, శాలువాలతో ఘనంగా సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయశీల మాట్లాడుతూ.. మహిళలు నేడు అన్ని రంగాలలో ముందున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుష్ప లత, ఎంపీటీసీలు సంబ బుచ్చమ్మ, కోంకటి శిరీష, అక్కనపల్లి ఉపేందర్, మండల పంచాయతీ అధికారి గంగ తిలక్, వ్యవసాయ అధికారి ప్రణీత, ఏపీవో సబితా, కేజీబీవీ ఎస్ఓ పద్మ పాల్గొన్నారు.

స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ - తంగళ్ళపల్లి



స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను రెడ్డి సంఘం మండల అధ్యక్షులు ఎసిరెడ్డి రామిరెడ్డి ప్రారంభించారు. తంగళ్ళపల్లి మండలం గోపాలరావుపల్లె గ్రామంలో ఎసిరెడ్డి మల్లారెడ్డి నర్సవ్వల స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎసిరెడ్డి రామ్ రెడ్డి (మాజీ సర్పంచ్) గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొండవేని దేవయ్య, ఎంపీటీసీ దుర్గాప్రసాద్, నూనె కిషన్, మిరాల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించాలి..

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : నేత కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. కార్మికులకు ఉపాధి కల్పించాలంటూ తంగళ్ళపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై కార్మికులు ఆసాములతో కలిసి రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వస్త్ర పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు, అనుబంధ రంగాల కార్మికులకు గత మూడు మాసాల నుంచి పని లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. యజమానులు మాంద్యం ఉందని పరిశ్రమలు మూసివేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఇచ్చే బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. కార్మికులకు రావలసిన యారన్ సబ్సిడీ, బతుకమ్మ చీరల బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం నేత కార్మికుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. అనేక దఫాలుగా మంత్రులకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన ప్రభుత్వం నుంచి రావడం లేదన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే వస్త్ర పరిశ్రమ మొత్తం కనుమరుగయ్యే పరిస్థితి కనబడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసాముల, కార్మికుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులు దయనీయంగా మారాయన్నారు. ప్రభుత్వం ఉన్న పలంగా బతుకమ్మ చీరల ఆర్డర్లు బకాయిలు విడుదల చేస్తేనే కొంత కార్మికులకు పని దొరికే అవకాశం ఏర్పడుతుందని, లేకుంటే కార్మికులు, ఆసాములు పస్తులు ఉండే పరిస్థితి నెలకొందన్నారు. కార్మికుల కుటుంబాల్లో పండుగ పూట పస్తులు ఉండే పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో కూచన శంకర్, కుడికాల కనకయ్య, సామల శ్రీనివాస్, మోర శ్రీనివాస్, ఎల్లండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నింటా ఆమె..

అన్ని రంగాల్లో రాణించినప్పుడే.. సాధికారత..

- తాళ్లపల్లి భాగ్యలక్ష్మి, కవయిత్రి సిరిసిల్ల.



అమ్మాయిని ఒకలా.. అబ్బాయిని ఒకలా చూడడం మంచిది కాదు. కొడుకు అయినా.. కూతురైన.. ఒకటే అని భావన ఉండాలి. మహిళలను ప్రోత్సహించినప్పుడు సమాజంలో అసమానతలు తొలగిపోతాయి. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమని కవయిత్రి తాళ్లపల్లి భాగ్యలక్ష్మి అన్నారు. ఇటు కవయిత్రిగా, అటూ ఉపాధ్యాయురాలుగా విజయం సాధిస్తున్నారు.

మొదట నాన్న.. తర్వాత భర్త ప్రోత్సాహంతో.. భాగ్యలక్ష్మి నాన్న ఐదో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. కానీ ఆయన ఆశయాలు, ఆలోచనలు గొప్పగా ఉండేవి. జ్ఞానమే అసలైన సంపదగా భావించే ఆయన పిల్లలకు ఉన్నత ఆశయాలు నూరి పోశారు. పద్య కవి భాగ్యత్వంలో ఆసక్తి ఉన్న ఆయన ప్రతి సందర్భాన్ని పద్యం ద్వారా వారి పిల్లలకు వినిపించేవారు. భాగ్యలక్ష్మి తండ్రి మాటలను ఆచరిస్తూ వచ్చేవారు. దీంతో పుస్తకాలు, సాహిత్యం పట్ల ఆమెకు అభిరుచి కలిగింది. మెట్టినింట అడుగుపెట్టగానే అక్కడ పుస్తకం ప్రపంచం తలపించింది. ఆమె భర్త మోతుకుల నారాయణ గౌడ్ వీర్నపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ గా పనిచేస్తున్నారు. భార్య భాగ్యలక్ష్మి సాహిత్యం దిశగా ప్రోత్సహించారు. భాగ్యలక్ష్మి 2002లో హెచ్ జి టి లో ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం ఇందిరమ్మ కాలనీ మండలం పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తుంది. భాగ్యలక్ష్మి రాసిన కవితలకు త్వరలో చెన్నమ్మ శతకం అనే పుస్తక రూపము ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

జ్ఞానం ఒకటే సంపద.. ధైర్యం ఒకటే ఆయుధం.. అని ఉద్బోధించిన వారి నాన్న మాటలు ఆచరణీయమంటూ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగిన మహిళల గురించి చెప్పేవారు. ఇప్పటివరకు 500 కు పైగా కవితలు, 600 పైగా పద్యాలు, 20 సామాజిక చైతన్య వ్యాసాలు, 30 బాల గేయాలు రాశాను.

అన్ని రంగాల్లో రాణించాలి.. మహిళ సాధికారత అనేది మహిళలు అన్ని రంగాల్లో సంపూర్ణంగా రానించినప్పుడే సాధ్యమవుతుంది. మహిళలు స్వతంత్రంగా నియాధికారం తీసుకునే పిచ్చా రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇంటి నుంచి మొదలు పెడితే సమాజంలోని వివిధ స్థానాల్లో ప్రతి మహిళ తన సొంత నిర్ణయం తీసుకొని అమలు చేయలేని పరిస్థితిలో ఉంటుంది. ఇది సరైనది కాదు. మహిళలు ధైర్యంగా ముందుకు కొనసాగాలని కోరుకుంటున్నాను.

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆడపిల్లగా భూమి పైకి వచ్చి.. అక్కగా ఆదరించి.. చెల్లిగా తోడుగా నిలిచి.. భార్యగా ఏడడుగులు నడిచి.. అమ్మగా లాలించి.. ఇల్లాలిగా ఇంటిని పాలించి.. భావితరాలకు మార్గదర్శక నిలిచింది మహిళ. ఆమె అవని.. విశ్వానికి జనని.. ఆమె ఓపికకు వందనం. ఆమె లేనిదే జననం లేదు. ఈ ప్రపంచానికి మనుగడే లేదు. నాడు వంటింటికే పరిమితమై ఇల్లు దాటని మహిళ నేడు ఆకాశంలో సగం.. అవనిలో సగం అన్నట్లు సాగుతోంది. చదువులో అగ్రస్థానంలో నిలుస్తూ.. అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. అటెండర్ నుంచి ఐఏఎస్, ఐపీఎస్ బాధ్యతలు నిర్వహిస్తూనే.. ఇంటి బాధ్యతలను మరో చేతితో మోస్తోంది. ఇలా మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. ఆడపిల్ల పుట్టిందంటే భయపడే నాటి కాలం నుంచి మహాలక్ష్మిగా భావిస్తూ.. ఘన స్వాగతం పలుకుతున్నారు కొందరు. ఊర్లో అమ్మాయి పుడితే ఆర్థికంగా అండగా ఉంటున్నారు. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెబుతున్నారు నేటి యువత.

-నవతెలంగాణ, సిరిసిల్ల రూరల్

ఏడాదంతా మహిళల రోజులే..

- వల్లాల మంజుల. టీజీటీ సామాజిక ఉద్యోగి



ఉన్నత విద్యతోనే మహిళాభివృద్ధి సాధ్యం. మహిళల్లో ఇంకా మార్పు రావాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం స్థానిక సంస్థల్లో మహిళల కోసం కల్పించిన 50% రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలి. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో దూసుకు వెళ్లాలని కోరుకుంటున్నాను. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదు. ముందుగా మనలను మనం తక్కువగా అంచనా వేసుకోవద్దు. పోటీ ప్రపంచంలో మనకంటూ గుర్తింపు తెచ్చుకోవాలి.

మహిళలు తమ కాళ్లమీద తాము నిలబడాలి



నవతెలంగాణ - కొనరావుపేట : మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోనరావుపేట గ్రామపంచాయితీ కార్యాలయం ఆవరణలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ దేవరకొండ నరసింహ చారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ఇప్పటికే మంచి ప్రగతి సాధిస్తున్నారని, చైతన్యవంతులై తమ కాళ్ళమీద తాము నిలబడేలా ఎదగాలన్నారు. మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లకు, అంగన్వాడీ టీచర్లకు, మహిళా సంఘాల అధ్యక్షులు, సహాయకులకు వారి సేవలకు గుర్తుగా శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు శంకర్ రెడ్డి అసిస్టెంట్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీ రాకేష్ రావు, గ్రామ పంచాయితి కార్యదర్శి సాయికష్ణ సీసీ జనార్ధన్ గ్రామ ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష వద్దు..

- బూర్ల కళ్యాణి, న్యాయవాది,సిరిసిల్ల



మహిళలపై వివక్ష ఇంటి నుంచే పోవాలి. ఆడపిల్ల అనే చూపు చూడొద్దు. అప్పుడే వారు ఉన్నత చదువులతో సమాజంలో గుర్తింపు తెచ్చుకుంటారు. స్త్రీలు చేస్తున్న వివక్షపై పోరాటానికి మద్దతుగా నిలిస్తే జాబిల్లి కూడా సాధ్యం అంటున్నారు సిరిసిల్లకు చెందిన న్యాయవాది బూర్ల కళ్యాణి.

చిన్నపాటి సమస్యలే.. ఐదేళ్ల క్రితం న్యాయవాది కోర్సు పూర్తి చేశా. ఏడాదిగా కోర్టులో ప్రాక్టీస్ చేశాను. ఇంత తక్కువ ఏది లోనే మహిళలకు సంబంధించిన వివక్ష కేసులు ఎన్నో నా దష్టికి వచ్చాయి. అన్ని చిన్న చిన్న సమస్యలే. మహిళ సాధికారిత అనుకోవడమే కానీ నాకు అలా కనిపించట్లేదు.

ఆర్థికంగా బలోపేతం కావాలి.. మహిళల సైతం ఒకరిపై ఆధారపడి బతికే పరిస్థితి నుంచి వాళ్ల కాళ్లపై వారు నిలబడాలి. మహిళలపై వివక్ష.. రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నప్పటికీ సమాజంలో మార్పు రావడం కీలకం. తల్లిదండ్రులు ఆడపిల్లల విషయంలో వివక్ష చూపకపోతే వారి కుటుంబానికి ఆధారంగా నిలుస్తారు. సమస్యల పైన కాకుండా గెలుపు వైపు అడుగులు వేస్తే ప్రతి మహిళ తను ఎదుర్కొంటున్న వివక్షతలను, అవహేళనలను, నిరంకుశత్వాల బారి నుండి విముక్తి పొంది అన్ని రంగాలలో విజయాలను పొందవచ్చును.

దేశ ఆర్థికప్రగతికి మహిళల ముందడుగే కీలకం

వైస్ ఎంపీపీ సుమలత శ్రీనివాస్

నవతెలంగాణ - కోనరావుపేట

కొనరావుపేట మండల కేంద్రం మండల ప్రజా పరిషత్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైస్ ఎంపీపీ సుమలత శ్రీనివాస్ మాట్లాడుతూ సృష్టికి మూలం మగువ. ఆకాశంలో సగం, అవనిలో సగం మహిళ.. కాస్త ప్రోత్సహిస్తే అవకాశాలలోనూ సగం.. అంతకు మించి అని నిరూపించే స్థితికి వచ్చింది నేటి మహిళ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పల్లె మంజుల రవీందర్ నరసింహచారి మండల ప్రజా పరిషత్ సూపరింటెండెంట్ శంకర్ రెడ్డి ఏపిఓ మంచి శ్రీనివాస్ మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం..

నవతెలంగాణ - గంభీరావుపేట



: గంభీరావుపేట మండల పరిధిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. మహిళ ఎంపిటీసీలు, కార్యాలయంలో పని చేస్తున్న మహిళ ఉద్యోగులను స్థానిక ఎంపీపీ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పలు రంగాల్లో మహిళలు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, ఏపీవో అరుణ పలు గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది, మహిళా ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :



మండలంలోని కోరుట్లపేట గ్రామంలో మహిళ ఉద్యోగులకు, పంచాయతీ సిబ్బందిని మహిళ దినోత్సవం సందర్భంగా గురువారం ఎంపీటీసీ మధు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మధు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను గౌరవించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు చేసే సేవలు ఎంతో అముల్యమైనవన్నారు. పంచాయతీ కార్యదర్శి సుస్మిత, అంగన్‌వాడీ టీచర్ హాలియా, ఏఎన్ఎం పద్మ, అశ వర్కర్ సునంద, ఫిల్డ్ అసిస్టెంట్ లక్ష్మి, గ్రామ సీఏ వనజ, అస్రియా, రాజవ్వ గ్రామ పంచాయతీ మహిళ సిబ్బందిని ఎంపీటీసీ మధు సన్మానించారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

జిల్లా జడ్జి ప్రేమలత

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్



: సమాజంలో మహిళల పాత్ర కీలకమని జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ లకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. మహిళలకు న్యాయ విజ్ఞానం ఎంతో అవసరమని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిలు ప్రవీణ్, సృజన, లోక్ అదాలత్ మెంబర్ చింతోజు భాస్కర్, పెంట శ్రీను, ఆడెపు వేణు పాలొగొన్నారు.

విద్యార్థులకు చదువు ఎంతో విలువైనది



నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం వడ్డేపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి భా పురస్కారాలు ఇచ్చారు. గతేడాది పదవ తరగతిలో 10 జీపీఏ సాధించి న బూర్ల శ్రీలత, పిట్ల తేజస్విని 9.8 వచ్చిన విద్యార్థినులకు వడ్డేపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వడ్డేపల్లి కృష్ణ ప్రతిభా పురస్కారంతోపాటు నగదు బహుమతి కూడా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు శారద, ఉపాధ్యాయులు ఎలగొండ రవి, నరేందర్, అనురాధ జయంతి,స్వప్న, విమోచన, వైదేహి పాల్గొన్నారు.

రైతుల సొమ్ము స్వాహా..

- సహకార సంఘంలో వెలుగు చూస్తున్న రోజుకో కుంభకోణం
- రుణాలు చెల్లించినా జమకాని డబ్బులు..

నవతెలంగాణ - చందుర్తి



రసీప్ట్,క్లోస్ సర్టిఫికెట్

రైతుల సమన్వయంతో వారి సొమ్ముతో సహకార సంఘంలో లబ్ది చేకూరడానికి నెలకొల్పిన సంఘం నేడు వారు చెల్లించిన సొమ్ముకు గ్యారంటీ లేకుండా పోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి సహకార సంఘం పరపతిలో రైతులకు రుణ మాఫీ వచ్చినప్పటికీ ఇంకా డబ్బులు జమ కాలేదు. మూడపల్లి గ్రామానికి చెందిన పుల్కం నారాయణ 2020 సెప్టెంబర్ 8న రూ.45వేలు సంఘంలో అప్పుగా తీసుకున్నాడు. 6జులై2022న తీసుకున్న రూ.45వేల అప్పుకు వడ్డీతో సహా చెల్లించాడు. కానీ రెండు సంవత్సరాలు గడుస్తున్నా అప్పు చెల్లించినట్లుగా సర్టిఫికెట్ ఇవ్వక పోవడంతో సదరు రైతు ఖాతాలో డబ్బులు జమకాలేదు.

దీంతో రైతు నారాయణ వైస్ చైర్మెన్ మోహన్‌ను సంప్రదించగా గురువారం వైస్ చైర్మెన్ సంఘానికి వచ్చి సీఈవో గంగారెడ్డిని నిలదీసాడు. దీంతో అప్పటికప్పుడు 28ఫిబ్రవరి2024 రుణం చెల్లించినట్లుగా సర్టిఫికెట్ ఇచ్చారు.

రైతు ఖాతాలో లేవు..

సంఘంలో జమ కాలేదు..

రెండు సంవత్సరాల కిందట రైతు చెల్లించిన డబ్బులు ఇప్పటివరకు సహకార సంఘంలో జమ కాలేదు రైతు ఖాతాలో లేవు. అంటే రైతులు చెల్లించిన డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయనేది ప్రశ్నర్థకంగా మారింది. దీంతో సంఘం సిబ్బంది నిర్లక్ష్య ధోరణినితో అటు రైతులు ఇటు సంఘం నష్ట పోవాల్సి వస్తున్నది. ఇది ఒక్క నారాయణ అనే రైతు పరిస్థితి మాత్రమే కాదు.. మరో 40మంది రైతులు బాధితులుగా ఉన్నట్టు సంఘం డైరెక్టర్లు చెబుతున్నారు.

సంఘం నష్టపోతోంది



రైతులు చెలించిన రుణాలను సహకార సంఘంలో చెల్లించకుండా సొంతానికి వాడుకోవడంతో సంఘం నష్టపోయింది. వ్యక్తిగత లోన్‌లు కూడా రూ.20లక్షల వరకు ఉన్నాయి. గత ఆరు సంవత్సరాలుగా ఆ లోన్‌లు రికవరీ చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సీఈవో చొరవ తీసుకుని రైతులు, సొసైటీ నష్టపోకుండా చూడాలి.

- పుల్కం మోహన్, సహకార సంఘం వైస్ చైర్మన్

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఎస్బీఐ బ్యాంకు ఎదుట నిరసన, ధర్నా

నవతెలంగాణ - వేములవాడ



కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిరసన చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకొని నిర్వీర్యం చేస్తున్నదని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఏఐసీసీ, పీసీసీ ఇచ్చిన పిలుపుమేరకు వేములవాడ పట్టణంలోని ఎస్బిఐ శాఖ ముందు మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇటీవల బీజేపీ యొక్క ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని భావించి నిషేధం విధించిందన్నారు. ఈ పథకం ద్వారా స్వీకరించిన విరాళాలను బహిర్గతం చేయాలని అన్ని రాజకీయ పార్టీలకు ఎన్నికల విరాళాలపై పూర్తి సమాచారాన్ని మార్చి 6లోపు బహిరంగపరచాలని, ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)ని కోర్టు ఆదేశించిందని కానీ దానికి అనుగుణంగా నడుచుకోవాల్సిన బీజేపీ ప్రభుత్వం దాతల గురించిన సమాచారం పబ్లిక్‌గా ఇస్తే, కార్పొరేట్‌లతో తన సంబంధాలను బహిర్గతం అవుతుందని భయపడుతుందన్నారు. బీజేపీ ఆందోళన చెందుతూ ఎలక్టోరల్ బాండ్ సమాచారాన్ని పంచుకోవద్దని మోడీ ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై ఒత్తిడి తెస్తూ పెత్తనం చెలయిస్తోందని విమర్శించారు. కోర్టు నిర్ణయంతో ఎన్నికల్లో నల్లధనానికి వ్యతిరేకంగా నిర్ణయాత్మక చర్యగా ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు స్వాగతించాయి అన్నారు. ఎలక్టోరల్ బాండ్ పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి బీజేపీ పార్టీ ఒక్కటే 26,566.11 కోట్లను అందుకుంది, ఇది మొత్తం ఎలక్టోరల్ బాండ్లలో 55శాతం ఉందన్నారు. ఎలక్టోరల్ బాండ్ వివరాలను పంచుకోవడానికి జూన్ వరకు పొడిగించాలని కోరుతూ ఎస్బిఐతో సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు వేయించిందన్నారు. బీజేపీ ఆర్థిక అవకతవకలను, నల్లధనం మూలాన్ని దాచిపెట్టేందుకు ఎస్‌బీఐని బీజేపీ ప్రభుత్వం ఉపయోగించుకుంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రభుత్వ రంగ సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకున్న బిజెపి ప్రభుత్వానికి ప్రజలు తప్పకుండా గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, అర్బన్ మండల అధ్యక్షులు పిల్లి కనకయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగారం వెంకటస్వామి, కౌన్సిలర్లు ఇప్పపుల అజయ్ పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, పాత సత్యలక్ష్మి, చిలుక రమేష్, తూం మధు, పుల్కం రాజు, ఎండి రజాక్, వస్తాది కృష్ణ ప్రసాద్ గౌడ్‌తోపాటు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష

నవతెలంగాణ - సిరిసిల్ల :

రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి మేజిస్ట్రేట్ ప్రవీణ్ గురువారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబద్ ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు. 2018 జూన్ 12న ఎల్లారెడ్డిపేటకు చెందిన మాలోతు తుకారాం తన స్నేహితుడు భూక్య శ్రీనివాస్ తో కలిసి కారులో సిద్దిపేటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో శ్రీనివాస్ కారు డ్రైవింగ్ చేస్తుండగా తుకారాం ప్రక్కన కూర్చున్నాడు. శ్రీనివాస్ అనే వ్యక్తి కారుని అతి వేగంగా నడపడం వలన ముస్తాబాద్ మండలం బధనకల్ గ్రామం వద్ద కారు బోల్తా పడగ ఈ ప్రమాదంలో తుకారాం తీవ్రంగా గాయపడ్డాడు. ఇట్టి సంఘటనపై ముస్తాబాద్ పోలీసులు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ శ్రవణ్ యాదవ్ కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమశ్రేణి మేజిస్ట్రేట్ ప్రవీణ్ నేరం రుజువు కావడంతో నిందితుడికి ఒక సంవత్సరం శిక్ష జరిమాన విధించినట్లు ముస్తాబద్ ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

వికలాంగులు ఉన్నతంగా ఎదగాలి

ఐడియా స్వచ్ఛంద సంస్థ కో ఫౌండర్ రాహుల్ సరిదేనా

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : వికలాంగులు ఉన్నతంగా ఎదగాలని అందుకు తమ కృషి ఎప్పటికీ ఉంటుందని ఐడియా స్వచ్ఛంద సంస్థ కోఫౌండర్ రాహుల్ సరిదేనా అన్నారు. గురువారం పట్టణంలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో వికలాంగులకు వ్యాపార లావాదేవీలపై ఐదు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆఖరి రోజు ఐడియా స్వచ్ఛంద సంస్థ కోఫౌండర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడం లక్ష్యంగా తమ స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని తెలిపారు. 2030 నాటికి 10,000 మంది దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలతోపాటు, 5000 మందిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా సంస్థ పనిచేస్తున్నదన్నారు. ఇప్పటికే 20200 ఉద్యోగాలని ఇచ్చి, 950 మందిని వ్యాపారవేత్తలుగా తయారు చేశామన్నారు. అనంతరం దివ్యాంగులకు శిక్షణ సర్టిఫికెట్‌లతో పాటు రూ.500 నగదును అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి లీడర్లు శీలం రాజు, వేణు, గౌడ వాసు, అనిల్ పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న రైతులు

నవతెలంగాణ - కొనరావుపేట : మండలంలోని వెంకట్రావుపేట మూలవాగు నుంచి అధికారుల అనుమతులతో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను రైతులు అడ్డుకున్నారు. కొనరావుపేట మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ యజమానులు ఇళ్ల నిర్మాణం కోసం తహసీల్దార్ అనుమతులతో మండలంలోని వెంకట్రావుపేట బావుసాయిపేట గ్రామాల మధ్య ఉన్న మూలవాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా రెండు గ్రామాల రైతులు ఇసుక రవాణా చేయవద్దంటూ అడ్డుకున్నారు. మూలవాగు నుండి ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు తగ్గుతున్నాయని, వాగు పరివాహక ప్రాంతంలో ఉన్న పొలాల్లో వర్షాకాలంలో వాగు ఉధృతికి తమ పొలాల్లో ఇసుక మేటలు పెట్టాయని రైతులు వాపోతున్నారు. దీంతో ఇండ్ల నిర్మాణం చేస్తున్న ప్రజలు ఇంటి నిర్మాణం చేసేందుకు ఇసుక లేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా బింగి మహేష్ ఎన్నిక

నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మెన్‌గా బింగి మహేష్ ఎన్నికయ్యారు. వేములవాడ మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న వైస్ చైర్మెన్ పదవి భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు గురువారం వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించడం జరిగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికలు అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆధ్వర్యంలో నిబంధనల ప్రకారం నిర్వహించారు. వేములవాడ మున్సిపాలిటీలోని 28వార్డు సభ్యులు, ఎక్స్ ఆఫీసు సభ్యులైన ఎమ్మెల్యే మొత్తం 29 మంది హాజరయ్యారు. బింగి మహేష్ వైస్ చైర్మన్ కావడానికి మద్దతుగా అసమ్మతి బిఆర్ఎస్ కౌన్సిలర్‌లు యాచమనేని శ్రీనివాస్ రావు, రెండో వార్డు సభ్యులు జయ జడల శ్రీలక్ష్మి ముప్పిడి సునందనల మద్దతుతో పాటు బిజెపి కాంగ్రెస్ సభ్యుల మద్దతు, ఎక్స్ ఆఫిసియో సభ్యులైన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మద్దతు తెలపడంతో మొత్తం 29 (28 కౌన్సిలర్లు, 1 ఎక్స్ ఆఫిసియో) మందిలో 18 మంది మద్దతు తెలుపడంతో బింగి మహేష్ వైస్ చైర్మన్ గా ఎంపికయ్యారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎంపికైన బింగి మహేష్‌కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

రెండవ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

నేషనల్ హెల్త్ మిషన్ పీహెచ్‌సీ, యుపిహెచ్‌సీలలో కాంట్రాక్ట్ ప్రాతిపాదికన పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్‌లో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. 33రకాల రికార్డులను నిర్వహించటంతోపాటు 33యాప్‌లను కూడా పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం టీఏ, డీఏలు చెల్లించకపోవడంతో కేవలం జీతాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. గత ఆరు నెలల నుండి పిఆర్‌సి బకాయిలు, యూనిఫాం అలవెన్స్ తదితర బకాయిలు చెల్లించలేదన్నారు. డిసెంబర్ నుండి ఫిబ్రవరి నెలలకు సంబంధించిన జీతాలను కూడా మంజూరు చేయకపోవటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి 6నెలల పీఆర్సీ బకాయిలు, ఏపీడీ బకాయిలు, 3నెలల జీతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చెపుడుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు కడారి రాములు, తెలంగాణ నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పథకాన్ని వినియోగించుకోవాలి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండలంలో గృహ జ్యోతి ఉచిత విద్యుత్ పథకాన్ని పేద ప్రజలు వినియోగించుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పిలుపునిచ్చారు. నారాయణపూర్ గ్రామంలో ఎండీ బాబు ఇంటి దగ్గర హెల్పర్ సతీష్ విద్యుత్ జీరో బిల్లును ఇంటి యజమానికి అందించారు. కొంతమంది గృహ వినియోగదారులు వారు అర్హులైనప్పటికి వారికి జీరో బిల్లు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే సరి చేస్తామన్నారు. మాకు గృహ జ్యోతి వర్తించదని ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. అర్హులైన అందరికి ఈ పథకం వరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు షేక్ గౌస్, మాజీ ఉపసర్పంచ్ సిరిపురం మహేందర్, నాయకులు దొమ్మాటి రాజు, గోగురి దేవిరెడ్డి, అంబూరి బాబు, సూర బాలరాజు, జెల్ల శ్రీనివాస్, దేవయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-పెద్దపల్లి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలలో మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొనగా నలుగురు విద్యార్థులకు మొదటి, రెండో బహుమతులు లభించాయి. పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు తీసుకున్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తొడుపునూరి శ్రీనివాస్, కళాశాల అకౌంట్స్ ఆఫీసర్ పవన్, కళాశాల అధ్యాపకులు, విభాగాధిపతులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-ఓదెల



ఓదెల మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పెద్దపల్లి శాసనసభ్యుడు విజయ రమణారావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎస్ఆర్ఇజిఎస్ నిధుల నుంచి లంబాడి తండా 5 లక్షలు,నాంసానిపల్లి 5 లక్షలు, అబిడిపల్లి గ్రామానికి 5 లక్షలు,భీమరపల్లి 5 లక్షలు,గూడెం 5 లక్షలు,గుంపుల 10 లక్షలు, శానగొండ 5 లక్షలు,జీలకుంట 10 లక్షలు,మడక 10 లక్షల రూపాయలతో మొత్తం 60 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో నాలుగు అమల్లోకి వచ్చాయని మార్చి 11న మరొక హామీనీ అమలు చేస్తున్నారని దశలవారీగా మిగతా హామీలను అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అంతేకాక గ్రామాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించినప్పుడే గ్రామాలు పట్టణాల వలె అభివృద్ధి చెందుతాయన్నారు. అర్హులైన వారిని గుర్తించి అర్హులైన నిరుపేదలకు మార్చి 11న ప్రారంభించే గృహలక్ష్మి పథకంలో ఇల్లు మంజూరు చేయడంతో పాటు మిగతా హామీలను అమల్లోకి తీసుకొస్తామన్నారు. అదేవిధంగా రూపు నారాయణపేట గ్రామంలో 6 గ్యారంటీలో భాగంగా గృహ జ్యోతి 200 యూనిట్ల ఉచిత కరెంటు పథకాన్ని ప్రారంభించి ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ ఉచిత కరెంట్ అందిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్,ఎంపీపీ, ఎమ్మార్వో యాకయ్య,ఎంపీడీవో తిరుపతి,చీకట్ల మొండయ్య,బోడకుంట శంకర్,పడాల రాజు,కంకణాల బాస్కర్ రెడ్డి,కంకణాల సాయి రెడ్డి, బొంగోని శ్రీనివాస్ గౌడ్,బండారి శ్రీనివాస్,తిప్పారపు సంపత్,కౌటం తిరుపతి, రంగు శంకర్ గౌడ్,బినవేని కుమారస్వామి మ,అశోక్, పంగ ఆనంద్,మాజీ సర్పంచులు,ఉప సర్పంచ్లు,ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి రిషి విద్యాలయ మాతమందిర్

పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని:



స్థానిక పవరహౌజ్ కాలనీలోని సాయి రిషి విద్యాలయ మాతమందిర్ పాఠశాల 20వ వార్షికోత్సవ వేడుకలనను మార్కండేయ కాలనీ శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్జీ 1 జీఎం చింతల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో నేర్పిస్తున్నటువంటి సాంప్రదాయాలు, ప్రాణాయామం, మెడిటేషన్‌పై పిల్లలను ఆయన మెచ్చుకున్నారు. సింగరేణి యాజమాన్యం తరఫున 20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రామగుండం ట్రస్మా అధ్యక్షులు సాంబారావు, 7వ డివిజన్ కార్పొరేటర్ రమాదేవి శ్రీనివాస్, కరస్పాండెంట్ సంధ్యారాణి సంధ్యమ్మ, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ ప్రసన్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉన్నారు.

సింగరేణి ఆర్జీ-1లో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని:



అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని సింగరేణి సేవా సమితి ఆర్జీ-1 ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి సేవా సమితి భవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి హాజరై జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాలను ప్రారంభించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళా కష్ట పడి ఉన్నత స్థానాలను అధిరోహించాలని, పస్తుతం మహిళలు పురుషులకు సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని అన్నారు.ప్రతి ఒక్క మహిళా ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని తదనుగుణంగా కష్ట పడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. ఇప్పటికే మహిళలలో చైతన్యం వచ్చిందని ముసు ముందు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎఐటీయుసి బ్రాంచి సెక్రటరీ ఆరెల్లి పోషం, పర్సనల్ ఎజీఎం లక్ష్మినారాయణ, లేడీస్ క్లబ్ సెక్రటరీ చిలక లక్ష్మి, కో ఆర్డినేటింగ్ అధికారి, సీనియర్ పిఓ బంగారు సారంగపాణి, స్పోర్ట్స్ సూపర్ వైజర్ రమేష్, కో ఆర్డినేటర్ తిరుపతి, సేవా శిక్షకులు, మహిళలున్నారు.

పెద్దపల్లి ఎమ్మెల్యేకి ఉద్యమకారుల ఆహ్వానం

నవతెలంగాణ-ఓదెల



ఓదెల మండలంలోని పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు విచ్చేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజరమణారావుకు స్వాగతం పలికి మార్చి 12 న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఉద్యమకారుల కృతజ్ఞత సభకు రావాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో చింతకుంట వెంకటరెడ్డి,గూగుల్ పర్ష,ఈరవేన శంకర్,రవి,అంచల మల్లయ్యలు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలను వెంటనే నెరవేర్చాలి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ-పెద్దపల్లి



ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి,బిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలవడం కొరకు కాంగ్రెస్ పార్టీ అనేక అబద్దాలను సృష్టించారని అన్నారు.ఎన్నికల్లో ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు జవాబుదారీ గా పనిచేయాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు రైతు రుణమాఫీ, పెన్షన్లు,ఆరు గ్యారంటీలు ఇప్పటివరకు ప్రజలకు అందలేదన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన పనులను పూర్తి చేయకుండా అబద్ధాలు చెబుతూ ఆరోపణలకు పరిమితమైందని అన్నారు.ఎల్ఆర్ఎస్ ప్రజలకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ,మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్, సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీ రావు, నాయకులు శ్రీనివాస్ గౌడ్, మోహన్ రావులతో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

నవతెలంగాణ-గోదావరిఖని:



రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తండ్రి కోరుకంటి మల్లయ్య ఇటీవల మృతి చెందగా, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మాజీ శాసన సభ్యుడు నడిపల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్యలు గురువారం పరామర్శించారు. కోరుకంటి మల్లయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.చందర్‌ను, అతని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

చిన్న, చిన్న మార్పులతో మహిళా సాధికారత సాధ్యం

▶ **జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

నవతెలంగాణ-పెద్దపల్లి

మన ఇంట్లో మనం అవలంభించే చిన్న, చిన్న మార్పులతో మహిళా సాధికారత సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతా రెడ్డి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ..మహిళలను మరొకరు అభివృద్ధి చేయాల్సిన అవసరం లేదని, తమకు తాముగా అన్ని రంగాలలో రాణించగల సత్తా మహిళలకు ఉందని కలెక్టర్ అన్నారు. విద్య, ఆహారం, ఆర్థిక అంశాలలో మహిళలను సమానంగా చూడాలని కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ..మహిళలు బలమైన నమ్మకంతో ప్రతి రంగంలోనూ ఎదగాలని అన్నారు. పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతా రెడ్డి మాట్లాడుతూ..మహిళలు ఆర్థికంగా ఎదగాలని, మన అవసరాలకు ఇతరులపై ఆధారపడకుండా ఉండాలని అన్నారు. అనంతరం మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళ ప్రజా ప్రతినిధులు, జిల్లా మహిళా అధికారులు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళ ఉద్యోగులను ఘనంగా సన్మానించి మెమెంటో, ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ రేణుక, జూలపల్లి ఎంపీపీ రమ, జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందిస్తున్న కలెక్టర్

మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలి

-సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.జ్యోతి

నవతెలంగాణ-పెద్దపల్లి



అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.జ్యోతి అన్నారు. గురువారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో సీఐటీయూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో అంతరా ్జతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ..100 సంవత్సరాల కిందట ప్రపంచవ్యాప్తంగా శ్రామిక శ్రామిక మహిళలు చేసిన వీరోచిత పోరాటాల ఫలితంగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నామని, మహిళా రక్షణ చట్టాలు పాలకులు తీసుకువచ్చారని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో మహిళా సాధికారత దేశం వెనుకబడిందని అన్నారు. అనేక రంగాలలో మహిళలు పురుషులతో సమానంగా పని చేస్తున్న సమాన పనికి సమాన వేతనం అందడం లేదని, స్థిరమైన ఉపాధి లభించడం లేదని అన్నారు. సమాన అవకాశాలు మహిళకు దూరంగా ఉన్నాయని అన్నారు. అంగన్వాడీ ఆశ, మున్సిపల్ బిల్డింగ్ రంగాలలో వేలాదిమంది మహిళలు కనీస వేతనాలకు ఉద్యోగ భద్రతకు చట్టబద్ధ సౌకర్యాలకు దూరంగా ఉన్నారని, మహిళా దినోత్సవ స్ఫూర్తితో శ్రామిక మహిళల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మతం పేరుతో రాజకీయాలు చేసే పార్టీలకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. మహిళా సాధికారత గురించి పాలకులు ఉపన్యాసాలు తప్ప ఆచరణలో మహిళలకు కనీస రక్షణ లేకుండా పోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మణ్, ఎస్.రామలక్ష్మి, భాగ్యలక్ష్మి, అమృత, ప్రియాంక, లక్ష్మి, పాల్గొన్నారు.

సివిక్ కార్మికులకు పని స్థలాల్లో రెస్ట్ షెడ్లు, బాత్ రూమ్స్ ఏర్పాటు చేయండి

ఆర్జీ 1 డిజిఎం సివిల్‌కు వినతి పత్రం ఇచ్చిన ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:



సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని వివిధ కాలనీల్లో పని చేస్తున్న సివిక్ కాంట్రాక్టు కార్మికులకు పని స్థలాల్లో రెస్ట్ షెల్టర్లు, బాత్రూంలు ఏర్పాటు చేయాలని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అనుబంధ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో గురువారం సింగరేణి ఆర్జీ-1 సివిల్ డిజిఎంకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీ యూసీ ఆర్జీ-1 బ్రాంచి అధ్యక్షులు ఎం.ఎ.గౌస్, కార్యదర్శి శనగల శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని సెక్టర్ 1, ఫైవ్ ఇంక్లైన్ రోడ్, పోస్ట్ ఆఫీస్, తిలక్ నగర్ ఏరియా కాలనీలలో పనిచేస్తున్న సివిక్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇప్పటివరకు కనీసం రెస్ట్ షెడ్లు గాని, బాత్రూమ్స్ గాని యాజమాన్యం ఏర్పాటు చేయకపోవడం చాలా విచారకరమని వారు పేర్కొన్నారు. పని స్థలాల్లో వారికి బాత్రూంలు లేకపోవడంవల్ల సమస్యను ఎదుర్కొంటున్నారని, అంతేకాకుండా రెస్ట్ షెల్టర్ లేకపోవడం వల్ల వారు తెచ్చుకున్న టిఫిన్ బాక్సులు బయట పెట్టడం వల్ల కోతుల బెడద, భోజనం చేసే సమయంలో పిట్టలు, కాకులు, రెట్టలు వేయడం వల్ల కూడా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని. కోవిడ్ సమయం లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఈ కార్మికులే వాడ వాడలను శుభ్రం చేశారని వారు గుర్తు చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి సివిక్ సెంటర్లలో కనీస సౌకర్యాలైన, రెస్ట్ షెడ్లు, బాత్రూమ్స్ ఏర్పాటు చేయడమా లేదా ఏదైనా రిజెక్ట్ క్వార్టర్‌ను బాగు చేయించి వారికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని, కార్మికులను మానసిక ఒత్తిడి నుండి దూరం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సివిక్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

విద్యను అభ్యసించడంలో పిల్లలపై ఒత్తిడి పెంచవద్దు

పెద్దపల్లి జిల్లా విద్యాధికారి మాధవి

నవతెలంగాణ-రామగిరి



ప్రభుత్వ పాఠశాలలో విద్యన భ్యసించడంలో పిల్లలపై ఒత్తిడి పెంచవద్దని పెద్దపల్లి జిల్లా డీఈవో డి మాధవి అన్నారు. గురువారం రామగిరి మండలం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో టి.ఎల్.ఎం కార్నివాల్ కార్యక్రమంను ఆమె వీక్షించారు. ముఖ్యంగా బోధన అభ్యాసక పరికరాలు, దృశ్య పరికరాల ద్వారా విద్యా సులువుగా గ్రహించి అర్థం చేసుకుంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు ఎంతో పెద్ద స్థాయిలో ఉన్నారని అన్నారు. విద్యార్థులు తాము నేర్చుకున్న విద్యను బోధన పరికరాల ద్వారా అధికారుల ముందు ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను డీఈవో డి.మాధవి అభినందించారు. హెచ్.ఎం వెగొలపు సదానందం అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎం.ఈ.వో పల్లెపాటి సంపత్ రావు, కాంప్లెక్స్ హెచ్.ఎం తూము శోభన్ రావు, నోడల్ అధికారి కొమురయ్య, షేక్, ఎంపీటీసీ దర్శుల రాజ సంపత్, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సహజను సన్మానించిన డీఈవో

నవ తెలంగాణ-రామగిరి



రామగిరి మండలం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ట్రిపుల్ ఐటీ విద్యార్థిని నగునూరి సహజ ను గురువారం పెద్దపల్లి డీఈవో డి.మాధవి సన్మానించారు. బేగంపేటకు చెందిన నగునూరి సతీష్-శైలజల కూతురు సహజ రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 8 వ తరగతి వరకు, బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో 9,10 వ తరగతి పూర్తి చేసింది. బాసర ట్రిపుల్ ఐటీ లో 6 సంవత్సరల కోర్సులో చేరింది.రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొని, ప్రస్తుతం బీ.టెక్ (ఈ.సి.ఈ) ఫస్ట్ ఇయర్ విద్య ను అభ్యసిస్తుంది. ముంబై కి చెందిన సిమెన్స్ కంపెనీ స్కాలర్ షిప్ కి ఎంపిక అయ్యింది. ప్రభుత్వ పాఠశాలలో చదివి , ఉన్నత విద్యా కూడా ప్రభుత్వ కళశాలలో చదవడం పై డీఈవో మాధవి ఈ విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.వో పల్లేపాటి సంపత్ రావు, హెచ్.ఎం వేగోలపు సదానందం, తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు, ఎంపిటిసి దర్శుల రాజ సంపత్, మాజీ విద్య కమిటీ చైర్మెన్ నగునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మగవారితో పోటీ పడుతున్నా.. గౌరవం లభించడం లేదు

దాసరి ఉష, బీఎస్పీ నియోజకవర్గం ఇన్‌చార్జీ

నవతెలంగాణ-పెద్దపల్లి



సమాజంలో దేశ అభివృద్ధిలో పురుషులతో పాటు సమానంగా మహిళలు కుడా సహాయ పడుతుందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ దాసరి ఉష అన్నారు. మగవారితో సమానంగా గౌరవం అవకాశాలు లభించడం లేదు. ప్రతి రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించ"డానికి వారి హక్కుల గురించి మహిళలకే అవగాహనా కల్పించడానికే అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం జరుపుకుంటాం. మహిళల ధైర్యాన్ని, స్థైర్యాన్ని కోల్పోకుండా ఆత్మ స్థైర్యంతో తమ లక్ష్యాన్ని చేరుకోవాలి. సమస్యలు వచ్చినప్పుడు పిరికితనంతో ఆత్మహత్యలకు పాల్పడకుండా మనో నిబ్బరంతో వాటిని ఎదుర్కోవాలి.

మట్టి దందా అవినీతిపె విచారణ జరిపించాలి: తిరుపతి నాయక్

నవతెలంగాణ-గోదావరిఖని:



అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో గల ప్రభుత్వ అటవీ భూముల్లో మట్టి దందా సుమారు రెండు నుండి మూడు కోట్ల వరకు వ్యాపారం జరిగినట్టు అనుకుంటున్న పట్టించుకోవడం లేదని అంతర్గాం బీఆర్ఎస్ నాయకుడు తిరుపతి నాయక్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ అంతర్గాం మండలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ఇసుక మట్టి అక్రమ రవాణా కార్యక్రమాలతో బిజీగా గడుపుతున్నారని, కొందరైతే ఏకంగా బ్రాహ్మణపల్లి అటవీ ప్రాంతంలో గల భూముల్లో సుమారు 20 నుండి 30 ఎకరాల భూమిని ప్రోకలైన్లు మిషన్లు పెట్టి చదును చేసుకుని మట్టి రవాణా కోసం సిద్ధం చేసుకుని పెట్టుకున్నారని, ఈ రవాణా కోసం ప్రత్యేకంగా సుమారు నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల మేర రిజర్వ్ ఫారెస్ట్ నుండి రెండు లైన్ల రహదారిని అంతర్గాం బసంత్ నగర్ రహదారికి చేరుకునే విధంగా దారిని నిర్మించుకున్నారని ఆరోపించారు. అవినీతి రహితంగా ఈ ప్రాంతాన్ని పాలించాలనుకుంటున్న రామగుండం శాసనసభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అవినీతి మీద విచారణ జరిపించి, ఈ దందా చేస్తున్న కాంగ్రెస్ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేసి, వారి నిజాయితీని, నిబద్ధతను రామగుండం నియోజకవర్గ ప్రజల ముందు చాటుకోవాలని డిమాండ్ చేశారు. తద్వారా ఎంతటి వారైనా అవినీతి అక్రమాలు చేస్తే సహించేది లేదనే సంకేతాన్ని నియోజకవర్గ ప్రజలకు పంపించాలని రామగుండం ఎమ్మెల్యేకు ఆయన విన్నవించారు.

ట్రస్టీ బోర్డు ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా

సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

నవతెలంగాణ-గోదావరిఖని:

ఫిబ్రవరి 22న న్యూఢిల్లీలో జరిగిన సీఎం పిఎఫ్ ట్రస్టీ బోర్డు సభ్యుల 180వ సమావేశంలో బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జ్, సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డ్ సభ్యులు కొత్త కాపు లక్ష్మారెడ్డి, ఆశిష్ మూర్తి ప్రతిపాదించిన ప్రతిపాదన రూ.1000 సిఎంపిఎఫ్ ట్రస్టీ బోర్డు ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపిందని బిఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గు పెన్షనర్లు దీంతో కనీస పెన్షన్ రూ. 1,000 పొందుతారని ధన్‌బాద్ ప్రత్యేక ప్రతినిధి సిఎంపిఎఫ్ఓ (కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్) రిటైర్డ్ బొగ్గు కార్మికుల కనీస పెన్షన్‌ను రూ. 1,000కి పెంచడం ట్రస్టీ బోర్డు ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన పేర్కొన్నారు. దీంతో 1.2 లక్షల మంది రిటైర్డ్ బొగ్గు కార్మికులకు ప్రయోజనం చేకూరనుందని స్పష్టం చేశారు.

మహిళలు మరింత ఎదగాలి

శ్రీమాల, డిసివో, పెద్దపల్లి

నవతెలంగాణ-పెద్దపల్లి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ళు గడుస్తున్నా మహిళలపై దాడులు జరగడం హేయమైన చర్య. మహిళలు ఆర్థికంగా ఇంకా ఎదగాల్సిన అవసరం ఉందని పెద్దపల్లి డీసీవో అన్నారు. అన్ని రంగాల్లో మహిళలు రాణించాలంటే వారికి మరింత ప్రోత్సహం అవసరం. ముఖ్యంగా పురుషులతో సమానంగా మహిళలకు నిర్ణయాలు తీసుకునే అధికారంతో పాటు స్వేచ్ఛను కల్పించాలి. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే మహిళల కొరకు ప్రత్యేక రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలి. మహిళలకు ఉండే ఇబ్బందులు, ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారికి ప్రత్యేక సడలింపులు కల్పించాలి.

ఎస్‌ఓ-2 జీఎంకు వినతిపత్రం

నవతెలంగాణ-రామగిరి



సింగరేణి ఆర్జి- ఏరియాలో ఎంతోమంది సి,డి గ్రేడ్‌లో ఉన్న ఈపీ ఆపరేటర్లు ఏ గ్రేడ్ మిషనరీ నడుపుతూ, ఏ గ్రేడు ఆక్టింగ్ తీసుకుంటున్నారనీ గురువారం ఏరియా ఎస్ఓ డిజిఎం జి రఘుపతి సీఐటీయూ నాయకులు వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడరు. సిబిఎ గ్రేడ్స్ ప్రమోషన్ కోసం పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులు అయి ఉన్నప్పటికీ కూడా వేకెన్సీ లేదని చెప్పి ప్రమోషన్‌లు ఇవ్వడం లేదనీ, 2018 సంవత్సరంలో ఈపి ఆపరేటర్లు గ్రేడింగ్ డిగా సెలెక్ట్ అయి మణుగూరు, కొత్తగూడెం రామగుండం 1, 2, 3 లకు బదిలీ మీద వచ్చిన సుమారు 40 మంది ఆపరేటర్లకు ఎలాంటి పరీక్ష నిర్వహించలేదని, వారు ఇంకా డి గ్రేడ్ లోనే పని చేస్తున్నారని కాబట్టి టైం బాండ్ ప్రకారం తదుపరి గ్రేడ్లు ఇప్పించగలరని అదేవిధంగా రెగ్యులర్గా ప్రమోషన్ పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన ఈపి ఆపరేటర్కు వేకెన్సీలు కల్పించి తదుపరి గ్రేడ్లకు పదోన్నతులు కల్పించాలని ఎస్ఓ-2 జిఎంకు వివరించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వి విజయ్ కుమార్ రెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, ఎండి అహ్మద్ పాషా, ఓ నరేష్, కె రాజేష్, పి విజేందర్, ఎస్ జగదీష్, ఎ కృష్ణ, బి అనిల్ కుమార్, బి కార్తీక్, ఎస్ తిరుపతి, వి అనిల్ కుమార్, కె కిషోర్ తదితరులు ఉన్నారు.

గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో ఉమెన్స్ డే

నవతెలంగాణ-పెద్దపల్లి



స్థానిక గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో ముం దస్తు అంత ర్జాతీయ మహిళా దినో త్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ గౌరవనీయులు డాక్టర్ డి.హేమంత్ కుమార్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనేక రంగాలలో మహిళలు రాణిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్క మహిళ రాణి రుద్రమదేవిలా, ఝాన్సీ లక్ష్మీబాయిలా ధైర్య సాహసాలు ప్రదర్శించాలని తెలిపారు. స్త్రీని మన భారతదేశంలో గొప్పగా పూజిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.శ్రీనివాస్ (చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పెద్దపల్లి), కే.శ్రీధర్ (వైస్ ప్రెసిడెంట్ బార్ అసోసియేషన్ పెద్దపల్లి) లు పాల్గొన్నారు. డిస్ట్రిక్ట్ కోర్ట్ ఆఫ్ పెద్దపల్లి జూనియర్ అసిస్టెంట్ తేజస్విని, జి.కవిత(టైపిస్ట్), కావ్యశ్రీ (ఫీల్డ్ అసిస్టెంట్) లను గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, అల్లెంకి రజనీ దేవి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జే.రవీందర్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉమెన్స్‌డే

నవతెలంగాణ-పెద్దపల్లి



పెద్దపల్లి పట్టణంలోని స్థానిక ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అకాడమీ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్ మాట్లాడుతూ..మహిళలని అన్ని రంగాలలో ప్రోత్సహిస్తూ మహిళా శక్తిని బలపరిచే విధంగా ప్రోత్సహించే విధంగా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మహిళా ఉపాధ్యాయులు స్వాతి, కౌసల్య, విజయ, సంధ్యా అపర్ణ, లక్ష్మి, శ్రావణి సంధ్యారాణి, లావణ్య, భూలక్ష్మి, షాజహాన్, లీనా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

సన్మాన సభకు గౌడ సంఘాలు తరలిరావాలి

నవతెలంగాణ-ఓదెల



గౌడ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మార్చి 10న జరిగే రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సన్మాన సభకు గౌడ కులస్తులందరూ తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.పి రాజయ్య గౌడ్ పిలుపునిచ్చారు.మన గౌడ జాతి ముద్దు బిడ్డ బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలంగాణ ఉద్యమ నేత రవాణా,బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ విద్యార్థి దశలోనే రాజకీయ అరంగేట్రం చేసి కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ గా జిల్లాలో పశుదాన తయారీ కేంద్రం నెలకొలిపి 200 కుటుంబాల కు జీవనోపాధి కల్పించిన ఘనత పొన్నందే అన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడడమే కాకుండా గీతా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయడంలో ముందున్నారన్నారు. పొన్నం ప్రభాకర్ సన్మాన సభకు గౌడ కులస్తులు ప్రతి ఒక్కరు తరలిరావాలన్నారు. ఈ కార్యకమంలో వేగోళం శ్రీనివాస్ గౌడ్, కోటగిరి స్వామి గౌడ్,యనమల శంకర్ గౌడ్,బోయిని కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను సన్మానించిన ప్రధానోపాధ్యాయుడు అశోక్ రెడ్డి

నవతెలంగాణ ఓదెల



ఓదెల మండలంలోని మడక ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ శతాబ్దం లో యూరప్ లో ప్రారిశ్రామికరణ ప్రారంభమైన తరువాత పెట్టుబడి దారులు పరిశ్రమలో పురుషులను కాకుండా స్త్రీల తో కూడా తక్కువ వేతనంతో రోజులో 18 గంటలు పనిచేయించే వారు.పాలిచ్చే తల్లులకు పిల్లలకు పాలిచ్చే సమయానికి కూడా జీతం కోత విధించి వారి శ్రమను దోసుకొన్నారు.ఇది యూరప్ కాకుండా ప్రపంచవ్యాప్తంగా మహిళ శ్రమకు గౌరవం ఇచ్చేవారు కాదు.జర్మన్ కమ్యూనిస్ట్ నాయకురాలు క్లారాజట్కిన్ ఆధ్వర్యంలో మహిళలు ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాలు చేసి మార్చ్ 8 తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యకమిటి చైర్మన్ నోముల రమణారెడ్డి, ఉపాధ్యాయులు ఎం.సిద్దయ్య,ఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కెవికెలో 12వ శాస్త్రీయ సలహా సమావేశం

నవతెలంగాణ-రామగిరి



రామగిరి మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి కిల్లాలో 12వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ విజయ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది ఈ సమావేశంలో డాక్టర్ విజయ మాట్లాడుతూ, కృషి విజ్ఞాన కేంద్రం గ్రామాలలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను తెలుపుతూ, గ్రామ అభివృద్ధిలో కృషి విజ్ఞాన కేంద్రం పాత్రను వచ్చిన అతిథి లకు, రైతులకు, శాస్త్రవేత్త బృందాలకు అభినందనలు తెలిపారు. అలాగే డాక్టర్ ఎ ఆర్. రెడ్డి, అటారి, జోన్-10, హైదరాబాద్ వారు ముఖ్యఅతిథిగా వచ్చి కృషి విజ్ఞాన కేంద్రం క్షేతంను సందర్శించారు. ఇందులో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం వారు ఏర్పాటుచేసిన ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కునరం, ప్రధన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ , ఏటీఎం ఎజిఎం జై ప్రకాశ , వ్యవసాయ మండల అధికారులు ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

ఇసుక లభ్యతపై కట్టుదిట్టమైన నివేదిక సమర్పించాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-పెద్దపల్లి



జిల్లాలోని ఇసుక రీచ్‌లలో ఉన్న ఇసుక లభ్యతపై కట్టు దిట్టమైన నివేదిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 26 ఇసుక రీచ్‌లను మరోసారి మైనింగ్, రెవెన్యూ, భూగర్భ జలాలు, నీటి పారుదల శాఖ, టీఎస్ఎండీసీ శాఖలు సంయుక్తంగా పరిశీలించి, అక్కడ అందుబాటులో ఉన్న ఇసుకపై కట్టుదిట్టమైన నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మైనింగ్ శాఖ ఏడీ సాయినాథ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
శుక్రవారం | మార్చి 08, 2024 | www.navatelangana.com

కనీస వేతనం రూ.26వేలు కల్పించాలి

-సీఐటీయూ శ్రామిక మహిళా కన్వీనర్ మరెల్ల శ్రీలత

నవతెలంగాణ-కరీంనగర్ : శ్రామిక మహిళ కార్మికులకు కనీస వేతనం రూ.26000లు, పని భద్రత కల్పించాలని సీఐటీయూ శ్రామిక మహిళా కన్వీనర్ మరెల్ల శ్రీలత అన్నారు. స్థానిక ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ శ్రామిక మహిళా కన్వీనర్ మరెల్ల శ్రీలత మాట్లాడుతూ.. దేశంలో మహిళలపై నిత్యం లైంగిక దాడులు, వేధింపులు, అవమానాలు, హత్యలు, ప్రేమ దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సమానత్వం, సాధికారత, హక్కుల గురించి ఎన్నికలు ఉపన్యాసాలు మాట్లాడుతున్నారు తప్ప ఆచరణలో వారికి అన్యాయం జరుగుతుంటే మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వ పెద్దలు మహిళలపై జరుగుతున్న దాడుల పట్ల ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం యొక్క మతోన్మాద కార్పొరేట్ విధానాలను ప్రతిఘటించి మహిళలు తగిన గుణపాఠం చెప్పాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, డీవైఎఫ్ఐ జిల్లా తిరుపతి, శ్రామిక మహిళా నాయకులు ప్రభ, రజిత, రాజమణి, స్వర్ణ, లక్ష్మి, వెంకట లక్ష్మీ, అనిత, కల్పన, రజిత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ డాక్యుమెంట్ల కేసులో తహసీల్దార్ సహా ముగ్గురి అరెస్ట్

నవతెలంగాణ - భగత్‌నగర్





ఫేక్ డాక్యుమెంట్లను క్రియేట్ చేసిన కేసులో తహసీల్దార్ సహా పలువురిని కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలోని ఓ భూమి విషయంలో ఈ నకిలీ పత్రం ద్వారా భూమిని ఆక్రమించినందుకు ఈ కేసు నమోదు చేసినట్టుగా పోలీసులు తెలిపారు. కొత్తపల్లి పోలీసుల కథనం ప్రకారం... సీతారాంపూర్‌కు చెందిన బొంతల రఘుకు పూర్వీకుల నుండి సంక్రమించిన ఆస్తి రేకుర్తి, ఆరెపల్లి, సీతారాంపూర్ శివార్లలో ఉంది. ఈ భూమిని 2012లో రఘురాజు తాత ఐలయ్య నుండి ఆయన తండ్రితో పాటు చిన్నాన్నలకు సమాన భాగాలు చేసి రిజిస్ట్రేషన్ చేశారు. ఇందులో రేకుర్తి శివార్లలోని సర్వే నెంబర్ 29లోని 30 గుంటల భూమి మాత్రం మూటేషన్ అయినప్పటికీ ఆన్ లైన్ లో చూపించలేదు. దీంతో అప్పుడు కొత్తపల్లి తహసీల్దార్‌గా ఉన్న చిల్ల శ్రీనివాస్‌ను కలిసి తన సమస్య పరిష్కరించాలని కోరారు. అయితే ఇందుకు కొంతభూమిని తనకు లంచంగా ఇవ్వాలని తహసీల్దార్ అడగడంతో బాధితుడు ఒప్పుకున్నాడు. 2015లో పట్టాదారు ఐలయ్య చనిపోగా 2016లో అదే భూమిని బాధితుని నానమ్మ పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్టుగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. అప్పుడు ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్న పల్లె జీవన్ ద్వారా 2022 ఆగస్టులో రఘు చిన్నాన్న, మేనత్తల పేరిట నాలుగు గుంటల చొప్పున, తహసీల్దార్ బినామి అయిన చంద సంతోష్ తండ్రి శంకరయ్య పేరిట 3.250 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బాధితుడు రఘు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు ఈ కేసులో ప్రస్తుత గజ్వేల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న చిల్ల శ్రీనివాస్, చంద సంతోష్, బొంతల రవి, బొంతల లావణ్య, ఉప్పుల కనక లక్ష్మీ, దాడి రాధ, చుప్ప మంజుల, చిలువేరు స్వప్న, చిలువేరు మల్లేశం, పల్లె జీవన్, వినోద్, బుచ్చయ్యపై 467, 468, 471, 409, 120బి రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్లలో కేసు నమోదు చేశారు. వీరిలో తహసీల్దార్ శ్రీనివాస్, చంద సంతోష్, పల్లె జీవన్‌ను అరెస్ట్ చేసి కరీంనగర్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. వీరికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ కరీంనగర్ కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో వారిని జిల్లా జైలుకు తరలించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

-జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

-పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

నవతెలంగాణ-కరీంనగర్



ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మాట్లాడుతున్న కలెక్టర్

ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కరీంనగర్‌లోని బుట్టి రాజారామ్ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి రోజు ఎంతమంది పేషెంట్లు ఆస్పత్రికి వస్తున్నారు? ఏమేం పరీక్షలు చేస్తున్నారు? అని వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చిన వారి వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న తీరును పరిశీలించారు. పరీక్షల కోసం వచ్చిన కిషోర బాలికలతోనూ కలెక్టర్ మాట్లాడారు. వైద్యసేవలు ఎలా అందుతున్నాయని తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కిశోర బాలికలు, యువతులు పోషకాహారం తీసుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. నిత్యం పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులు దరి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఆస్పత్రికి వచ్చే వారికి తగిన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని వైద్యాధికారులకు సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని కలెక్టర్ వివరించారు. హాస్టల్స్, కాలేజీల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యాధికారి గదితో పాటు ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, ఎంసీహెచ్ పీఓ సనా జావేరియా, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శోభ, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేయించండి..

-అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

-పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణపై నేతలతో సమావేశం

నవతెలంగాణ-కరీంనగర్




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

18 ఏళ్ల పైబడిన వారందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..కొత్తగా ఐదు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ప్రతిపాదనలు వచ్చాయని పేర్కొన్నారు. మూడు పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పిడి, 30 పోలింగ్ స్టేషన్ల స్థానాల మార్పుపై ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. ఈ ప్రతిపాదనలను అనుమతి కోసం ఎలక్షన్ కమిషన్‌కు పంపిస్తామని, పోలింగ్ స్టేషన్ల అంశం విషయంలో ఏమైనా అనుమానాలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని రాజకీయ పార్టీల నేతలకు అదనపు కలెక్టర్ సూచించారు. అన్నింటిపై కూలంకషంగా చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పవన్ కుమార్, ఆర్డీఓ కే.మహేశ్వర్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్లు, బీఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహన్, బీజేపీ ప్రతినిధి ఎడమ సత్యనారాయణ రెడ్డి, సీపీఐ (ఎం) మిల్కూరీ వాసుదేవ రెడ్డి, ఎంఐఎం నేత బర్కత్ అలీ, టీడీపీ కళ్యాడపు ఆగయ్య, బీఎస్పీ గాలి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో క్రీడోత్సవాల ముగింపు


నవతెలంగాణ - కరీంనగర్



గెలుపొందినవారితో వైస్ చైర్మెన్

స్థానిక అంబేద్కర్ స్టేడియంలో రెండు రోజుల క్రీడోత్సవాలలో భాగంగా చివరి రోజు ముగింపు కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మెన్ సాకేత్ రామారావు పాల్గొని క్రికెట్, కబడ్డీ, ఖో ఖో తదితర క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ అర్జున్ రావు, అనుష్‌రెడ్డి, డాక్టర్ నవీన్, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ ఆదినారాయణ, రవీంద్రాచారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిషి ద ప్లే స్కూల్‌లో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన





నవతెలంగాణ-కరీంనగర్ : భారతరత్న నోబల్ అవార్డ్ గ్రహీత సర్ సీవీ రామన్ సేవలు ఎంతో చారిత్రాత్మకమైనవని రిషి విద్యాసంస్థల చైర్మెన్ కామరపు చెన్నప్ప కొనియాడారు. గురువారం నగరంలోని మారుతీ నగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల రిషి ద ప్లే స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని చెన్నప్ప ప్రారంభించారు. ఇందులో సుమారు 250 మంది చిన్నారులు వివిధ ఆకర్షణీయమైన ఆలోచింప చేసే నమూనాలను రూపొందించి వీక్షకులకు, సందర్శకులకు అత్యుత్తమంగా వర్ణించి చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి కామారపు కౌశల్, అడ్మిన్ రజిత, ఉపాధ్యాయులు సరళ, నాగలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందే రాధిక ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఉత్తమ సేవలందించిన మహిళ ఉద్యోగులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మునిసిపల్ కమిషనర్ ఎస్.సమ్మయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో

ఎంపీడీవో కార్యాలయంలో సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ ప్రజా సంరక్షణ సమితి, సంయుక్తంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్వాగతం ఉపన్యాసం సందెల వెంకన్న, మహాత్మా జ్యోతిరావు పూలే కమిటీ మాజీ చైర్మన్ మోరే రంజిత్ కుమార్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా సెకండ్ అడిషనల్ జూనియర్ జడ్జి జి.స్వాతి, ఫస్ట్ అడిషనల్ జూనియర్ జడ్జి పద్మశ్రీ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరుమల రాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ భగవాన్‌రెడ్డి విజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హమ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలు



నవతెలంగాణ - భగత్‌నగర్

హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఒకటవ డివిజన్ తీగల గుట్టపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్లో ఘనంగా నిర్వహించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాతవాహన యూనివర్సిటీ ఫార్మసిటికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.



గంగాధర : బహుమతులు అందుకున్న తల్లులు

ప్రధానోపాధ్యాయురాలు కరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గంగాధర

గంగాధర మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ండలంలోని గర్శకుర్తి గ్రామ సరస్వతి హైస్కూల్‌లో విద్యార్థుల తల్లులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మిట్టపల్లి రాజశేఖర్, ఎంపీటీసీ తడిగొప్పుల రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జమ్మికుంటలో..

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ బోయినపల్లి మాధవి విద్యార్థినులకి గర్భాశయ వ్యవస్థ నిర్మాణం, పనిచేసే పద్ధతి, నెలసరి రోజులలో వచ్చే సమస్యలు రాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి, క్యాన్సర్ నివారించడానికి వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రతిమ వైద్య విజ్ఞాన సంస్థ నుంచి డాక్టర్ హారిక, డాక్టర్ అనూష, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ రిజర్వేషన్ అయినందున తనకు ఇవ్వాలని మండలంలోని కాట్నపెల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కట్టెకోల లక్ష్మణ్ గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో మొదటి నుండి క్రియాశీలకంగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో పోరాటంలో అరెస్టయ్యాయని తెలిపారు. పార్టీకి విస్తృత సేవలు చేసినట్లుగా తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నవతెలంగాణ - హుజురాబాద్



హుజురాబాద్ మండలం సింగపూర్ గ్రామంలోని తన నివాసంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు సమక్షంలో కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఇనుగాల సారంగపాణి, ఇనుగాల అనిల్, కుమ్మరి రవి, కుమ్మరి తిరుపతి, కుమ్మరి శ్రీనివాస్, ఇనుగాల రాజు, సమ్మయ్య, మాసు కిరణ్, మొగిలి, రాజేందర్, సురేష్, మధు, కిషన్, చేరిపల్లి రవీందర్ ఉన్నారు.

రామడుగు ఎస్ఐగా ఎం.సురేందర్

నవతెలంగాణ - రామడుగు



రామడుగు ఎస్ఐగా ఎం.సురేందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు .ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది కొత్తగా వచ్చిన ఎస్సైకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం తఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

మున్సిపల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ - హుజురాబాద్



హుజురాబాద్ పురపాలక సంఘ చైర్‌పర్సన్ గందె రాధిక ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 10,22,00,000 బడ్జెట్ ప్రతిపాదనలను జూనియర్ అకౌంట్స్ అధికారి జి. సంధ్యారాణి ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ ఎస్.సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి

-ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి

-ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



నవతెలంగాణ-కరీంనగర్ : మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి అన్నారు. గురువారం స్థానిక కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో 33 శాతం రిజర్వేషన్ చట్టం చేసినప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరం అన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు దాడులు వేధింపులు అరికట్టాలని కఠిన చట్టాలు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా శిక్షలు పడేటట్లుగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ద్యవా అన్నపూర్ణ, జిల్లా సహాయ కార్యదర్శి, కార్యదర్శి జరీనా బేగం జిల్లా కమిటీ సభ్యురాలు లక్ష్మి సిహెచ్ రోజా, యమునా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలు బాధ్యతాయుతంగా పని చేయాలి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

మహిళా ఉద్యోగులు, సిబ్బంది తమ విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళా సాధికారతతోనే సమాజంలో మార్పు వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి, కలెక్టర్‌ను టీఎన్జీవోస్ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన మహిళ ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, ఆడిట్ ఆఫీసర్ రజిత, టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి, ఎస్.లక్ష్మణ్ రావు, మహిళా జేఏసీ చైర్మెన్ ఇరుమాల్ల శారద, సబిత, సునీత, సరిత, విజయలక్ష్మి, హరిప్రియ, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ - భగత్‌నగర్ : స్థానిక కట్టరాంపూర్‌లోని కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో గురువారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సతీమణి గున్నాల అర్చన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 150మంది విద్యార్థిని విద్యార్థుల మాతృమూర్తులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి, గెలిచిన, పాల్గొన్న వారందరికీ బహుమతి ప్రదానం చేశారు. ముఖ్య అతిథితో పాఠశాల మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ముఖ్య అతిథి గున్నాల అర్చన మాట్లాడుతూ ప్రస్తుత రోజులలో మహిళా ప్రాధాన్యం గురించి వివరించారు. వారికున్న ఇంత బిజీ షెడ్యూల్లో కూడా పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలకు హాజరై ఆటలు ఆడిన మాతృమూర్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కేక్ కట్ చేయించినట్టు పాఠశాల కరస్పాండెంట్ గున్నాల క్రాంతికుమార్ తెలిపారు. డైరెక్టర్ నల్ల దశరథమ్ పాల్గొన్నారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో వేడుకలు

నవతెలంగాణ - కరీంనగర్

స్థానిక అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అల్ఫోర్స్ ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ క్లబ్ నిర్వహించగా కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి విచ్చేసి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన విద్యార్థినులను, ఇటీవల ప్రకటించిన గురుకుల విద్యాలయాల్లో ఉద్యోగం సాధించిన కళాశాల ఉపాధ్యాయినులను రవీందర్‌రెడ్డి సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అక్షయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



తనవతెలంగాణ - భగత్‌నగర్ : మహిళా దినోత్సవం సందర్భంగా యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయుష్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న మాట్లాడుతూ రక్తదానం ఒక గొప్ప సేవ అని, అత్యవసర సమయంలో రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరు ముందుండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సంగీత, పద్మిని, మల్లీశ్వరి, శాలిని పాల్గొన్నారు

9న నారీ విజయ భేరి వేడుకలు

నవతెలంగాణ - భగత్‌నగర్



అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న 'నారీ విజయ భేరి' పేరుతో వేడుకలు నిర్వహించనున్నట్లు సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి మూగ జయశ్రీ తెలిపారు. గురువారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ దశాబ్ది కాలంలో మహిళల ప్రస్థానంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అధికృతను చాటుకుంటూ, సాధికారతతో సమానత్వం దిశగా సాగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో భాగంగా 9న మధ్యాహ్నం 12గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో ముగ్గుల పోటీలు, మెహందీ డిజైనింగ్, హేర్ స్టయిల్స్, ఏక్ మినేట్, ఆటల పోటీలు, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, కళాశాలల్లో వ్యాసరచన పోటీలు కూడా నిర్వహిస్తామని ఆమె చెప్పారు. సాయంత్రం 6 గంటలకు జరిగే ముగింపు కార్యక్రమంలో పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమాలకు ఎలాంటి ఎంట్రీ ఫీజులు లేవని, మహిళలందరూ పాల్గొనవచ్చని ఆహ్వానించారు.

శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు

నవతెలంగాణ - గంగాధర



మహా శివరాత్రి ఉత్సవాలకు గంగాధర మండలంలోని శివాలయాలు ముస్తాబైయ్యాయి. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం తర్వాత వెయ్యి లింగాలతో అలరారుతున్న ఆలయం న్యాలకొండన్నపల్లి గ్రామ శివారులోని సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయం అత్యంత ప్రసిద్ధి చెందింది. డాక్టర్ గున్నాల రాజశేఖర్ స్వయంగా స్థలం కొనుగోలు చేసి నిర్మించిన ఈ ఆలయంలో ప్రతి యేటా మహా శివరాత్రి పర్వదినంను పురస్కరించుకుని మహా జాతర నిర్వహిస్తారు. గర్శకుర్తి గ్రామంలోని శివభక్త మార్కండేయ స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగనుండగా, బూర్గుపల్లి, గట్టుభూత్కూర్, కోట్ల నర్సింహులపల్లి గ్రామంలోని శివాలయాల్లో మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

నవచిత్రం


చేతన్ కృష్ణ, హెబ్బాపటేల్

ధూం ధాం..

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ధూం ధాం'. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు.

ఈ సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు సాయి కిశోర్ మచ్చ రూపొంది స్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉన్న ఈ సినిమా ఈ సమ్మర్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మూవీ టీమ్ ఆన్ లోకేషన్‌లో రిలీజ్ చేశారు.

వెయ్ దరువెయ్ రిలీజ్‌కి రెడీ

సాయిరామ్ శంకర్, యషా శివకుమార్, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా సాయి తేజ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ మీద దేవరాజు పొత్తూరు నిర్మించిన చిత్రం 'వెయ్ దరువెయ్'. లక్ష్మీనారాయణ పొత్తూరు సమర్పణలో వస్తున్న ఈ మూవీకి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం బాధ్యతల్ని నవీన్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరీష్ శంకర్ మాట్లాడుతూ,' కేవీఆర్ మాట్లాడితే నేరుగా గుండెకు తాకుతోంది. ఇంత తక్కువ టైంలో నిర్మాత దేవరాజ్, దర్శకుడు నవీన్ రెడ్డి ఈ సినిమాను గొప్పగా తీశారు. సాయి రామ్ శంకర్ నాకు బ్రదర్‌లాంటి వాడు. అతని ఫుల్ ఎనర్జీని ఈ చిత్రంలో చూడబోతున్నారు. ఈ సినిమాలోని పాట లు, లిరిక్స్ బాగున్నాయి. భీమ్స్ మంచి పాటలే కాదు.. మంచి మాటలు కూడా మాట్లాడతాడని తెలిసింది. ఈ సినిమాలో కామారెడ్డి నుంచి హీరో వస్తాడు. కానీ కామారెడ్డి నుంచి హీరోలే వస్తారని కేవీఆర్ నిరూపించారు. ఈనెల 15న ఈ చిత్రం రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయాలి' అని అన్నారు.

'తక్కువ డబ్బుతో ఎక్కువ ఆనందాన్ని సినిమా ఇస్తుంది. సినిమా అనేది వ్యసనం కాదు. హరీష్, మాలా శ్రీ ప్రేమ ఖైదీ సినిమా కోసం ఆడిషన్స్‌కి వెళ్లాను. ప్రభాస్ శ్రీను, సత్యం రాజేష్ వంటి హాస్యనటులంటే నాకు చాలా ఇష్టం. ఒక సినిమా హిట్టయితే ఎన్నో కుటుంబాల్లో సంతోషం నిండు తుంది. వచ్చిన సక్సెస్‌ను కాపాడుకోవడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది' అని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీ రమణా రెడ్డి తెలిపారు.

నిర్మాత దేవరాజ్ మాట్లాడుతూ, 'ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. సినిమా కచ్చితంగా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. డైరెక్టర్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, 'మా ఈవెంట్‌కు గెస్టుగా వచ్చిన హరీష్ శంకర్‌కి, కేవీఆర్‌కి థ్యాంక్స్. కథ చెప్పిన వెంటనే నిర్మాత దేవరాజ్ ఓకే చెప్పారు. సాయి రామ్ శంకర్ మా చిత్రానికి ఎంతో కష్టపడ్డారు. ఈనెల 15న ఈ మూవీ రాబోతోంది. ఆడియెన్స్ అంతా మా సినిమాను చూడండి' అని అన్నారు.



సాయి రామ్ శంకర్ మాట్లాడుతూ, 'కమర్షియల్‌గా తీసిన ఈ సినిమాకు భీమ్స్ మంచి పాటలు, ఆర్ఆర్ ఇచ్చారు. ఈ సినిమాలో ప్రభాస్ శ్రీను అన్నకి మంచి పాత్ర దొరికింది. సత్యం రాజేష్‌ను మేం బాగా ఇబ్బంది పెట్టాం (నవ్వుతూ). మా నిర్మాతకు సినిమాలంటే ప్యాషన్. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. బంపర్ ఆఫర్, అమ్మనాన్న ఓ తమిళమ్మాయి లాంటి ఎమోషన్స్‌తో ఈ సినిమా ఉంటుంది. చాలా తక్కువ టైంలో ఈ సినిమాను దర్శకుడు అద్భుతంగా తీశారు. సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మార్చి 15న మా సినిమా రాబోతోంది.' అని చెప్పారు.





తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం గురువారం లండన్‌లో ప్రారంభమైంది. పవన్ కల్యాణ్ 'బ్రో' చిత్రంలో సాయిధరమ్ తేజ్ తమ్ముడిగా నటించిన శ్రీనివాస్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఏ స్టార్ ప్రొడక్షన్స్, ఏబి ఇంటర్‌నేషనల్ ఫిలింస్, అనిక ప్రొడక్షన్‌లు సంయుక్తంగా ఈ 'దీన్ తననా' చిత్రాన్ని హుస్సేన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నాయి.

కారును ఢీకొన్న వాటర్ ట్యాంకర్ ..చిన్నారి మృతి

నవతెలంగాణ-రాజేంద్రనగర్

అతివేగంగా నడుపుతున్న వాటర్ ట్యాంకర్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన ఘటనలో మూడేండ్ల పాప అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ నవాబ్‌కుంట ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం గురు వారం మొయినాబాద్ నుంచి రాజేంద్రనగర్‌కు కారులో వెళ్తున్నారు. అయితే హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్ వద్ద అతివేగంగా ఎదురుగా వస్తున్న వాటర్ ట్యాంకర్ ఈ కారుని ఢీకొట్టింది. దాంతో అందులో ప్రయాణిస్తున్న చిన్నారి సమీరా ఫాతిమా అక్కడికక్కడే మృతి చెందింది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి ప్రయాణికులు.. పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీ సులు తీవ్రంగా గాయపడిన నలుగురిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు వాటర్ ట్యాంకర్ డ్రైవర్ అతివేగమే కారణమని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న వాటర్ ట్యాంకర్ డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా 14 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1,445 మంది కాంట్రాక్టు అధ్యాపకులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ ఎస్కే మహమూద్‌ను ఆ సంఘం చైర్మెన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్, వర్కింగ్ చైర్మెన్ ఎం రామేశ్వరరావు నేతృత్వంలో కలిసి వినతి పత్రం సమర్పిం చారు. వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ కో చైర్మెన్ జి వెంకటేశ్వర్లు, నాయకులు రవీందర్‌రెడ్డి, పెంచాల శ్రీనివాస్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో సర్కారుకు షాక్

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టింది. కోర్టులో నడుస్తున్న కేసును పక్కన పెట్టి ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా నామినెట్ చేసింది. గవర్నర్ సైతం సర్కార్ సిఫారసుకు ఆమోదం తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం వీరి ఎన్నికను అధికారికంగా ప్రకటించడంతో గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. తమ నియామకానికి సంబంధించిన కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగా ప్రభుత్వం కొత్త వారిని ఎలా సిఫారసు చేస్తుంది? గవర్నర్ దాన్ని ఎలా ఆమో దిస్తారు? అంటూ మరోసారి దాసోజు, కుర్రా కోర్టు తలుపు తట్టారు. తమ పటిషన్‌పై తీర్పు వెలువడే వరకు నియామకాలు ఆపాలని అభ్యర్థించడంతో ప్రమాణ స్వీకారం ఆగింది. ఈ మధ్య కాలంలో ఈ కేసుకు సంబంధించి పలు దఫాలుగా విచారణ జరిగింది. పిటిషనర్లు, రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ తరపు న సుదీర్ఘ వాదనల అనంతరం సర్కార్ జారీ చేసిన గెజిట్‌ను కొట్టి వేస్తూ గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. క్యాబినెట్ నిర్ణయాన్ని నేరు గా తిరస్కరించకుండా వెనక్కి తిరిగి పంపించాల్సిందని అభిప్రాయ పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీల నియామకంపై పున:సమీక్షించాలని ఆదేశించింది.

అరాచక శక్తులకు కేంద్రంగా సందేశ్ ఖలీ ప్రాంతం

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్

ఆ ప్రాంత బాధితులకు వ్యకాస పరామర్శ

- మమతా, బీజేపీ సష్టించిన అరాచక గ్యాంగ్ లీడరే షాజహాన్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పర్గణ జిల్లాలో సందేశ్ ఖలీ ప్రాంతం అరాచక శక్తులకు కేంద్రంగా మారిందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ అన్నారు. సందేశ్ ఖలీ ప్రాంతంలో అరాచకాలకు గురైన గిరిజన ప్రజలకు వ్యకాస అండగా ఉంటుందని తెలిపారు. సందేశ్ ఖలీ బాధితులను విచారించి వారి బాధలను పరిశీలించి వారికి మనోధైర్యం కల్పించేందుకు వెళ్లిన వ్యవసాయ కార్మిక సంఘం బృందంలో వెంకట్‌తో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు తుషార్ ఘోష్, అమియా పాత్ర తదితరులు ఉన్నారు. ఈ బృందం ముందు బాధితులు తమ గోడు వెల్ల బోసుకున్నారు. 2011 నుండి సందేశ్ ఖలీ ప్రాంతంలో నిరుపేద గిరిజనులు ఎదుర్కొంటున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని తెలిపారు. ఆ ప్రాంతంలోని ఐదు పంచాయతీలను 2011 నాటికి లెఫ్ట్ ఫ్రంట్ గెలిచిందని, తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం నామినేషన్ వేసే అవకాశం కూడా లేకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. ఈ అరాచక గుంపులకు వ్యతిరేకంగా పోరాడుతున్న మాజీ శాసనసభ్యులు, గిరిజన ప్రజల నేత నిరాపత్ సర్దార్‌కు, వారి బృందానికి అభినందనలు తెలియజేసే కార్యక్రమాన్ని వ్యకాస బుధవారం కలకత్తాలో నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మమతా బెనర్జీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు సృష్టించిన అరాచక గ్యాంగులు బెంగాల్ రాష్ట్రమంతటా అకత్యాలకు తెగబడుతున్నారని అన్నారు. గత వామపక్ష ప్రభుత్వం పేదలకు భూములు పంచి వారి జీవితాలకు, భవిష్యత్తుకు భద్రతను కల్పించగా, మమత అధికారంలోకి రాగానే అరాచక శక్తుల చేతుల్లోకి అధికారం చేరిందని, కేంద్రంలోని బీజేపీ అండదండలతో విచ్చలవిడి భూ ఆక్రమణలు, కబ్జాలకు టీఎంసీ పార్టీ నేతలు తెగబడ్డారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ కబ్జాలను అడ్డుకున్న వారిపై దాడులు, దౌర్జన్యాలు, హత్యాకాండ సాగించారని, వారి అరాచకాలను ప్రశ్నించిన మహిళలపై అమానుషమైన మానభంగాలు చేశారని ఆయన తెలిపారు. ఇటువంటి అరాచక గుంపును ఆసరా చేసుకుని ఎన్నికల్లో లబ్ధి పొందేదానికోసం ఇటు తృణమూల్ కాంగ్రెస్, అటు బీజేపీ ప్రభుత్వాలు చట్టాపట్టాలేసుకుని సాగాయని అన్నారు.

ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడుతున్న స్థితిలో తమ స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీ, టీఎంసీ ఒకదానిపై ఒకటి దుమ్మెత్తి పోసుకుంటు న్నాయని అన్నారు. రాష్ట్రంలోని తృణమూల్ కాంగ్రెస్ ఈ అరాచకాలకు పాల్పడుతున్న షేక్ షాజహాన్‌ను నిలువరించేందుకు కానీ, అరెస్టు చేసే దానికి కానీ ఎటువంటి ప్రయత్నం చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టులు తీవ్రంగా మందలించి, హెచ్చరించిన తర్వాత మాత్రమే ఆ నిందితున్ని అరెస్ట్ చేయటం, కేసును సీబీఐకి అప్పగించడం జరిగిందని తెలిపారు. దోషులను అరెస్టు చేయడం చేతగాని ప్రభుత్వం వారి దౌర్జన్యాలను అడ్డుకుంటున్న గిరిజన నేత, మాజీ శాసనసభ్యులు నిరాఫర్ సర్దారుపై భౌతిక దాడులు చేసి అక్రమంగా అరెస్టు చేసి బెయిల్ కూడా రాకుండా అమానుషంగా 20 రోజులు పాటు జైల్లో నిర్బంధించిందని అన్నారు. ఈ చర్యలను తీవ్రంగా పరిగణిస్తూ సుప్రీంకోర్టు టీఎంసీ ప్రభుత్వానికి చివాట్లు పెట్టిన తర్వాతే నీరా సర్దార్ని విడుదల చేయడం, అరాచక గ్యాంగ్ లీడర్ షాజహాన్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు.

సందేశ్ ఖలీలో జరుగుతున్న ఈ అరాచకాలను ఎదుర్కొం టున్న పేదలను ఆసరా చేసుకుని, అల్లర్లను మరింత పెంచి బెంగా ల్లో హిందూమత ఉన్మాదాన్ని రగిలిం చేందుకు బీజేపీ కుట్రలు, కుయుక్తులకు పాల్పడుతున్నదని అన్నారు. బీజేపీ ఉన్మాద చర్యలను బెంగాల్ ప్రజలు హర్షించరని, కచ్చితంగా తిప్పి కొడతారని ఆయన అన్నారు. బెంగాల్ ప్రజలు ప్రజాస్వామిక వాదులని, బీజేపీ తృణ మూల్ అరాచకాలు ఎదురొడ్డి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వాతావరణం కోసం పోరాడుతున్న బాధితులకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం విస్తృతంగా రాష్ట్రవ్యాప్త ప్రచారం చేయబోతున్నదని అన్నా రు. 25 లక్షల మంది ప్రజలను కలవాలని, గ్రామ గ్రామాన జనరల్ బాడీ సమావేశాలు జరపాలని, బాధితులకు అండగా ప్రజాతంత్ర వాదులందరిని సమీకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

తాడిచర్ల సింగరేణికే

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తాడిచర్ల కోల్ బ్లాక్ -2లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ బొగ్గు ఉత్పత్తి చేయడానికి త్వరలోనే కేంద్ర ప్రభుత్వం ప్రేయర్ అప్రూవల్‌కు సానుకూలంగా స్పందించడం తెలంగాణ రాష్ట్రానికి, సింగరేణి కాలరీస్ సంస్థకు శుభవార్తని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణికి కావాల్సిన కోల్ బ్లాక్స్, సింగరేణి సమస్యలు, సింగరేణి అవసరాల గురించి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి, వర్చువల్ మీటరింగ్ విధానంతో పేదల ఇండ్లకు సౌర విద్యుత్తునందించే విషయమై కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్.కె సింగ్‌ను వేర్వేరుగా కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అవసరాలు, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంలో సింగరేణి సమస్యలు, కేటాయించాల్సిన బొగ్గు గనులు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన మంత్రి సూర్యగర్ ముఫ్త బిజిలి యోజన పథకం అమలుపై చర్చించినట్టు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్ల కోల్ బ్లాక్ -2 బొగ్గు బ్లాక్‌ను 2013లో సింగరేణి కాలరీస్ సంస్థకు కేటాయించారన్నారు. తాడిచర్ల కోల్ బ్లాక్ -2లో దాదాపు 5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం ఉందన్నారు. 30 సంవత్సరాల పాటు 182 మిలియన్ టన్నలు బొగ్గు నిక్షేపా లను వెలికితీసే అవకాశం ఉందని చెప్పారు. ఈ మైనింగ్‌ను గత ప్రభుత్వం ప్రొడక్షన్‌లోకి తీసుకొచ్చుంటే సింగరేణి సంస్థకు లాభాలు సమకూరేవన్నారు. తాడిచర్ల కోల్ బ్లాక్ -2లో బొగ్గు ఉత్పత్తికి గత ప్రభుత్వం పదేండ్లుగా ప్రేయర్ అప్రూవల్ తీసుకురాకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి, సింగరేణి సంస్థకు ఆర్థికంగా తీవ్ర నష్టం చేసిందన్నారు. తెలంగాణలో పెరుగుతున్న ప్రజల విద్యుత్తు డిమాండ్ అవసరాలను తీర్చడానికి బొగ్గు ఉత్పత్తులను పెంచాలని, ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి విన్నవించడం వల్ల తాడిచర్ల కోల్ బ్లాక్-2లో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తికి ప్రేయర్ అప్రూవల్ త్వరలోనే ఇస్తామని సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర బొగ్గు గనుల మంత్రిని కలవడం వల్ల రాష్ట్రానికి మంచి మేలు జరిగిందన్నారు. తాడిచర్ల కోల్ బ్లాక్-2 మైనింగ్‌ను ప్రొడక్షన్‌లోకి తీసుకురావడం వల్ల సింగరేణి కాలరీస్‌కు లాభాలు, తెలంగాణ రాష్ట్రానికి ఆదాయం రానుందన్నారు. **కేంద్ర విద్యుత్తు మంత్రికి వినతి** ..కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి సూర్యగర్ ముఫ్త బిజిలి యోజన పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్తు సబ్ స్టేషన్స్‌లో ఉన్న పరిసర ప్రాంతాల్లో వర్చువల్ మీటరింగ్ విధానంతో సోలార్ ప్యానల్‌లను ఏర్పాటు చేసి అక్కడి నుంచే పేదల ఇండ్లకు కరెంటు సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రతిపాదనలను కేంద్ర విద్యుత్తు మంత్రి ఆర్.కె సింగ్‌కు అందజేసినట్టు తెలిపారు. ప్రధానమంత్రి సూర్యగర్ ముఫ్త బిజిలి యోజన పథకంలో రూఫ్‌టాప్ సోలార్ విదుత్తు ఉత్పత్తికి కేంద్ర ఇస్తున్న సబ్సిడీ పొందడానికి చాలా మంది పేదలు తమ ఇండ్లపై రూఫ్‌టాప్ వేయించుకోవడానికి అవకాశం లేకపోవడంతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోలేని పరిస్థితుల్లో ఈ పథకానికి దూరమయ్యే అవకాశం ఉందన్నారు. వారికి ప్రయోజనం కల్గించడానికి వర్చువల్ మీటరింగ్ విధానాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ కాకుండా ఇతర అమౌంట్ మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించి ఈ పథకాన్ని ముందుకు తీసుకుపోవాలనే ఆలోచనతో కార్యాచరణను సిద్ధం చేశామన్నారు. కేంద్రానికి సమర్పించిన మా ప్రతిపాదన సోలరైజేషన్‌ను త్వరగా ప్రజలకందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. పేదలకు మేలు చేసేందుకు చేసిన మా ప్రతిపాదనపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సమగ్ర పరిశీలన చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్టు భట్టి వెల్లడించారు. డిప్యూటీ సీఎం వెంట ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, సింగరేణి సంస్థల కాలరీస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం ఉన్నారు.




కమ్యూనిజం వర్ధిల్లితేనే మహిళకు సమానత్వం

'మహిళా దినోత్సవం' అన్నా, 'శ్రామిక మహిళా దినోత్సవం' అన్నా ఈ రోజు అంతర్జాతీయ సంఘీభావ దినోత్సవం. శ్రామిక మహిళా ఉద్యమం తన బలాన్ని, నిర్మాణాన్ని సమీక్షించుకోవాల్సిన రోజు. అయితే ఇది మహిళలకు మాత్రమే ప్రత్యేకించిన రోజు కాదు. మార్చి 8 అనేది శ్రామికులకు, రైతాంగానికి, కార్మిక వర్గానికి యావత్ ప్రపంచ కార్మిక వర్గానికి చారిత్రాత్మకమైన, మరుపురాని రోజు. మహిళా దినోత్సవం నాడు ప్రత్యేకించి శ్రామిక, రైతాంగ మహిళా సమావేశాలు నిర్వహించడం మీదే ఎందుకు దృష్టి పెడుతున్నాం? ఏ లక్ష్యం కోసం మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామో ఈ రోజు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

1910 నుండి మహిళా సమానత్వం గురించి, మగవాళ్ళతో పాటు మహిళలకు కూడా రాజకీయ పాలనాధికారం గురించి తీవ్రమైన చర్చ మొదలయింది. అభివృద్ధి చెందిన దేశాలన్నింటా కార్మిక వర్గం శ్రామిక మహిళల హక్కుల గురించి పోరాటాలు నిర్వహిస్తూ ఉన్నది. కానీ పెట్టుబడిదారులు శ్రామిక మహిళలకు హక్కులు ఇవ్వనిరాకరించారు. దాంతో అమెరికాలో సోషలిస్టులు మహిళలకు ఓటు హక్కు కోసం పట్టుబట్టి పోరాటాలు నిర్వహించారు. 1909 ఫిబ్రవరి 28న శ్రామిక మహిళలకు రాజకీయ హక్కులు కల్పించాలనే డిమాండ్‌తో అమెరికా అంతటా ప్రదర్శనలు, మీటింగ్‌లు జరిగాయి. ఒకరకంగా చెప్పుకోవాలంటే ఇదీ 'మహిళా దినోత్సవమే'. మహిళా దినోత్సవ నిర్వహణకు సంబంధించి చొరవ చేసింది అమెరికన్ మహిళా కార్మిక వర్గమే అని చెప్పుకోవచ్చు.

మహిళా ఐక్యతను పెంపొందించి

1910లో జరిగిన శ్రామిక మహిళల రెండవ అంతర్జాతీయ సదస్సులో క్లారాజెట్కిన్ అంతర్జాతీయ శ్రామిక దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అవసరం గురించి లేవనెత్తారు. మహిళలకు ఓటింగ్ హక్కు సాధించుకోవడం ద్వారా మహిళా ఐక్యతను పెంపొందించుకుని సోషలిజం సాధనను బలోపేతం చెయ్యాలనే నినాదంతో ప్రతి దేశంలో ప్రతి ఏడాది ఒకే రోజున 'మహిళా దినోత్సవం' నిర్వహించుకోవాలని సదస్సు పిలుపునిచ్చింది. ఈ కాలంలో మహిళలకు వయోజన ఓటు హక్కు కల్పించడం ద్వారా పార్లమెంటును మరింత ప్రజాస్వామికరించాలనే అంశం కీలక ప్రాధాన్యతను సంతరించుకుంది. మొదటి ప్రపంచ యుద్ధానికంటే ముందు ఒక్క రష్యాలో మినహా అన్ని దేశాల్లోనూ కార్మికులకు ఓటు హక్కు ఉంది. కేవలం మహిళలు, మతిస్థిమితం లేని వాళ్లను మాత్రమే ఈ హక్కు నుండి మినహాయించారు. అదే సందర్భంలో పెట్టుబడిదారి సమాజం అభివృద్ధి చెందుతున్న కొద్ది దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్య అవసరాలు అంతకంతకూ పెరుగుతూ వచ్చాయి. ఫ్యాక్టరీలలో, వర్క్‌షాపులలో, ఆఫీసులలో పని చేయడానికి మహిళల అవసరం ఏటికేటికీ పెరుగుతూ వచ్చింది. పురుషులతో సమానంగా మహిళలూ పని చేసి దేశ సంపద పోగు చేయడంలో తమవంతు కృషి చేశారు. అయినా మహిళలకు ఓటు హక్కు లేదు.



సమరశీలతకు అద్దం పట్టిన

1911 మార్చి 19న తొలి అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిపారు. అంచనాలకు మించి జయప్రదమైంది. జర్మనీ, ఆస్ట్రియాలలో శ్రామిక మహిళా ప్రదర్శనలు సముద్రంలా పొటెత్తిపోయాయి. చిన్న చిన్న పట్టణాలు, పల్లెల్లో కూడా మహిళా సమావేశాలు జయప్రదంగా జరిగాయి. శ్రామిక మహిళల సమరశీలతకు అద్దం పట్టిన తొలి ప్రదర్శన ఇది. మగవాళ్లు ఇంటి పట్టున ఉండి పిల్లల్ని చూసుకునేవారు. వంటింటికే పరిమితమైన గృహిణులు తొలిసారిగా వీధికెక్కారు. 1913లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 8వ తేదీకి మార్చారు. అప్పటి నుండి మార్చి 8 మహిళా దినోత్సవంగా, శ్రామిక మహిళల సమరశీలతకు గుర్తుగా మారింది.

అగ్గిలా రాజుకున్నాయి

మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఆహార ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగిపోయి ఇంటిపట్టున ఉండే గృహిణులు కూడా ఇందుకు గల రాజకీయ కారణాలను అర్థం చేసుకుని దోపిడీని ప్రశ్నించే స్థాయికి ఎదిగారు. తిరుగుబాట్లు, రోడ్లమీదకొచ్చి ప్రదర్శనలు చెయ్యడం, నిరసన తెలపడం నానాటికీ పెరిగిపోయింది. ఈ నిరసనలు ఒక్కో దేశం నుండి ఇంకో దేశానికి అగ్గిలా రాజుకున్నాయి. ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలన్నింటా ఇలాంటి ఉద్యమాలు నడిచాయి. మార్కెట్లలో షాపుల మీద పడి ధ్వంసం చేయడం, వ్యాపారస్తులను చితకబాదడం సాధారణమయింది. అయితే ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రయోజనం లేకుండా పోతుందని, పెరిగిన ధరలకు మూలకారణం ప్రభుత్వం అనుసరిస్తున్న రాజకీయ విధానాల్లో ఉందని శ్రామిక మహిళలు అర్థం చేసుకున్నారు. పరిస్థితుల్లో మార్పు రావాలంటే రాజకీయాల్లో మార్పు తీసుకురావాలనీ, అందుకోసం మహిళలకు ఓటు హక్కు కల్పించాలనే డిమాండ్ ముందుకొచ్చింది. దీని సాధనకై ప్రతి దేశంలో విధిగా మహిళా దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలందరికీ ఈ హక్కుల సాధన సాధ్యం కావాలంటే ఉమ్మడి లక్ష్యంతో అంతర్జాతీయ సంఘీభావంతో ఉద్యమాలు నడపాలనీ, ఏటా శ్రామిక మహిళల నిర్మాణ బలాన్ని అంచనా వేసుకుంటూ సోషలిజం సాధన దిశగా ఎలాంటి కార్యక్రమాలు రూపొందించుకోవాలో మహిళా దినోత్సవం రోజున సమీక్షించుకోవాలని నిర్ణయం జరిగింది.



మనం తృప్తి పడకూడదు

మహిళా దినోత్సవ స్ఫూర్తితో చేసిన ఎన్నో పోరాటాల ఫలితంగా మహిళలకు ఓటు హక్కుతో పాటు పౌర హక్కులు కూడా లభించాయి. పురుషులతో సమానంగా స్త్రీలకు అన్ని హక్కులూ దక్కాయి. తమ జీవితాలను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకునే అవకాశాలు మహిళలకు లభించాయి. అయితే హక్కులు సాధించుకోవడంతోనే మనం తృప్తి పడకూడదు. ఆ హక్కులను ఎలా ఉపయోగ పెట్టుకోవాలనే మెళకువ సంపాదించుకోవాలి. ఓటు హక్కును స్వీయ ప్రయోజనాలకు, కార్మికవర్గ శ్రేయస్సుకు ఎలా ఉపయోగించుకోవాలో అర్థం చేసుకుంటేనే ఆ హక్కు మన చేతిలో వజ్రాయుధంగా మారుతుంది.

హింసలేని సమాజం రావాలి

మహిళలు హక్కులు సాధించుకొని వంద ఏండ్లు దాటి పోయింది. అభివృద్ధిలో వేగంగా దూసుకుపోతున్నాం. మహిళలు కూడా అన్ని రంగాల్లో మగవారితో సమానంగా శ్రమిస్తున్నారు, రాణిస్తున్నారు. అయితే అదే స్థాయిలో హింస, వివక్ష కూడా పెరిగిపోతోంది. ఇది అంతం కావాలి. మహిళలపై హింసలేని సమాజం రావాలి.

కమ్యూనిజం వర్ధిల్లితేనే మహిళలకు మౌలికమైన సమానత్వం లభిస్తుంది' అంటారు ప్రముఖ మహిళా ఉద్యమ నాయకురాలు కొల్లంతాయ్. కాబట్టి మహిళలంతా ఏకతాటిపై నిలబడి అలాంటి సమానత్వం కోసం ఉద్యమించాలి. అభ్యుదయ మహిళా సంఘాలన్నీ ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు అలాంటి నినాదంతో పోరాటాలు రూపొందించుకోవాలి.

మహిళా

ఈ సమాజానికి మహిళే ఒక ఆధారం
మన సృష్టికి స్త్రీ ఒక శ్రీకారం,
అన్నీ తాను అయి
మన జీవితాలకు జీవన ప్రాకారమై
తరతరాలుగా సాగుతున్న స్ఫూర్తి

ఒక మనసుకు శ్రుతి అయి
జెత కలిసే సతి అయి
ఇల్లాలై,తల్లి అయి
అచ్చమైన సిరి అయి

కష్టం అయినా, సుఖమైనా
స్వాగతించే చెలి అవుతుంది
త్యాగం అవుతూ, స్వేదం అవుతూ
ప్రేమను పంచే ప్రేమ ధాత్రి అవుతుంది

అంక్షలు ఎన్ని ఎదురయినా
అడ్డుకట్టలు ఎన్ని ఎదురయినా
అవమానాలను ఎన్నింటినో దిగమింగి
గెలిచి సంకల్పం చాటుతుంది

బానిసలా చూస్తున్నా
భారమెంత వేస్తున్నా
ఆత్మశక్తితో, ధైర్యంతో
సాధించాలి అనే తపిస్తుంది

తను చదువుల నెలవై
పదవుల కొలువై
కల చెదరని నది అయి
వెను తిరగని తెగువై

తాను సాగింది
అంత ఎత్తైన శిఖరాన
స్వప్నాలే సాధించే
స్వేచ్ఛమైన సఖిలా

- దామెర్ల హర్షి బాబు
7660057095
DYFI హైదబాద్ జిల్లా అధ్యక్షుడు

ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

రాక కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులను ఆయన కలుసుకున్నారు.

సజీవంగా బయటకు రావడం ఆశ్చర్యమే : సాయిబాబా

దారుణ పరిస్థితుల మధ్య జైలు జీవితం అనుభవించానని.. చివరకు సజీవంగా బయటకు రావడం ఆశ్చర్యంగా ఉందని ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా పేర్కొన్నారు. మావోయిస్టులతో సంబంధమున్న కేసులో నిర్దోషిగా తేలి, జైలు నుంచి విడుదలైన అనంతరం మీడియాతో మాట్లాడారు. అత్యంత దారుణ, కఠిన పరిస్థితుల మధ్య ఎనిమిదేండ్లు జైలు జీవితం గడిపానని అన్నారు.'వీల్‌ఛైర్ నుంచి బయటకు కదలలేకపోయా. సొంతగా టాయిలెట్‌కి వెళ్లలేకపోయా. కనీసం పైకి లేచే పరిస్థితి లేదు. అక్కడ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. జీవితం ముందుకు సాగడం కష్టమనిపించింది. కానీ, ఈరోజు సజీవంగా బయటకు రావడం నిజంగా ఆశ్చర్యమే' అని సాయిబాబా పేర్కొన్నారు. తనపై పెట్టిన కేసు కల్పితమైందన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించిన ఆయన.. ఆరోగ్యం ఎంతో క్షీణించిందని, ప్రస్తుతం ఏమీ మాట్లాడలేనన్నారు. మీడియా, న్యాయవాదుల విజ్ఞప్తితో మనసు మార్చుకున్న ఆయన.. జైల్లో తాను అనుభవించిన వేదనను వివరించారు. ఇదే విషయంపై సాయిబాబా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. వాస్తవాలు లేవని రెండుసార్లు ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసినప్పటికీ ఈ కేసును ఎందుకు ఇంతకాలం సాగదీశారని ప్రశ్నించారు. పదేళ్ల జీవితం వథా అయ్యిందని, దాన్ని ఎవరు తిరిగి తెచ్చిస్తారని అన్నారు.

పీఎస్‌యూల్లో ఆగని డిజిన్వెస్ట్‌మెంట్

(మొదటిపేజీ తరువాయి)

వాటాలను విక్రయించాలని మోడీ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత 2023-24లో రూ.30,000 కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఏడు పిఎస్‌యుల్లో మైనారిటీ వాటాలను విక్రయించి.. రూ.12,504 కోట్లు తన ఖజానాలో వేసుకుంది. ఈ నెల ముగింపు నాటికి రూ.30వేల కోట్ల వాటాల విక్రయ లక్ష్యాన్ని చేరాలని నిర్దేశించుకుంది. కాగా.. గురువారం బీఎస్‌ఈలో ఎన్‌ఎల్‌సి ఇండియా షేర్ 3.75 శాతం తగ్గి రూ.218.20 వద్ద ముగిసింది.

దురుద్దేశపూరితం

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల అమ్మకపు వివరాలను వెల్లడించడంలో విఫలమైన ఎస్‌బీఐపై గురువారం కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థ తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిని సత్వరమే విచారణకు చేపట్టాలని కోరారు. 2019 ఏప్రిల్ నుండి విక్రయించిన ఎన్నికల బాండ్ల వివరాలను మార్చి 6వ తేదీ లోగా ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలంటూ సుప్రీంకోర్టు ఎస్‌బీఐని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే గడువు ముగిసినప్పటికీ ఎస్‌బీఐ ఆ వివరాలు అందజేయలేదు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించేందుకు జూన్ 30వ తేదీ వరకూ గడువు ఇవ్వాలని ఎస్‌బీఐ చైర్మెన్ దినేష్ కుమార్ ఖేరా సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఎన్నికల బాండ్లకు సంబంధించిన సమాచారం, పత్రాలు దేశంలోని వివిధ ఎస్‌బీఐ శాఖలలో ఉన్నాయని, వీటన్నింటినీ డీకోడింగ్ చేయడం కష్టమైన పని అని, కొంత సమయం అవసరమవుతుందని తెలిపారు. తొమ్మిది పేజీలతో కూడిన ఈ దరఖాస్తు వచ్చే సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ దరఖాస్తుతో పాటే కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను కూడా విచారించాలని ప్రశాంత్ భూషణ్ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌ను కోరారు. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ దరఖాస్తు నెంబరుతో వివరాలను ఈ-మెయిల్ ద్వారా పంపాలని సూచించారు. 'మీ పిటిషన్‌ను రిజిస్ట్రీ వెరిఫై చేయగానే మీ జూనియర్లు ఈ-మెయిల్ పంపవచ్చు. నేను ఆదేశాలు జారీ చేస్తాను' అని ఆయన తెలిపారు. ఏడీఆర్‌తో పాటు కామన్‌కాజ్ అనే సంస్థ కూడా ఈ పిటిషన్‌లో భాగస్వామి అయింది.

ఎన్నికల బాండ్ల పథకాన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన వారిలో ఏడీఆర్ కూడా ఉంది. ఈ పిటిషన్లపై గత నెల 15న సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరిస్తూ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. బాండ్లు కొనుగోలు చేసిన వారి వివరాలను మార్చి 6 లోగా ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని ఎస్‌బీఐని ఆదేశించింది. ఆ వివరాలను మార్చి 13వ తేదీ లోగా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని ఎన్నికల కమిషన్‌ను కూడా ఆదేశించింది. ఈ ప్రక్రియ యావత్తూ సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందే పూర్తయితే ఓటర్లు ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంటుంది.

ఏడీఆర్ పిటిషన్‌లో ఏముంది?

కోర్టు ఆదేశాలను ఎస్‌బీఐ ఉద్దేశపూర్వకంగానే ధిక్కరించిందని, ఆ బ్యాంకుపై చర్యలు చేపట్టాలని ఏడీఆర్, కామన్‌కాజ్ సంస్థలు తమ పిటిషన్‌లో కోరాయి. పిటిషనర్ల తరఫున ప్రశాంత్ భూషణ్‌తో పాటు న్యాయవాదులు ఛెరస్ డి సౌజా, నేహా రథి కోర్టుకు హాజరయ్యారు. గడువు పొడిగించాలంటూ ఎస్‌బీఐ సమర్పించిన దరఖాస్తు దురుద్దేశపూరితంగా ఉన్నదని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను విఘాతం కలిగించేందుకు ఆ బ్యాంక్ ప్రయత్నిస్తోందని ఏడీఆర్ ఆరోపించింది.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించేందుకు ఎస్‌బీఐకి మరింత సమయం అవసరం లేదని, ఆ సమాచారాన్ని బహిర్గతం చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఆ బ్యాంకుకు ఉన్నాయని తెలిపింది. ఎన్నికల బాండ్ల నిర్వహణ కోసం ఎస్‌బీఐకి ఇప్పటికే ఐటీ వ్యవస్థ ఉన్నదని గుర్తు చేసింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అవసరమని ఏడీఆర్ పునరుద్ఘాటించింది. రాజకీయ పార్టీలకు ఎవరు విరాళాలు అందజేశారు, ఎంత మొత్తంలో ఇచ్చారు అనే సమాచారాన్ని తెలుసుకునే ప్రాథమిక హక్కు రాజ్యాంగంలోని 19 (1) (ఏ) ద్వారా ప్రజలకు సంక్రమించిందని వాదించింది. 'వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు అందించిన వారి వివరాలు ఎన్నికల లోగా ప్రజలకు తెలియకుండా ఉంచేందుకు ఎస్‌బీఐ ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోంది. పైగా బాండ్లకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా, త్వరగా తెలుసుకోవచ్చునంటూ 2019 మార్చి 15న కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌కు ఎస్‌బీఐ వైఖరి భిన్నంగా ఉంది' అని తెలిపింది.

విరాళాలను ఫ్రీజ్ చేయాలి

2017-18 నుండి 2022-23 వరకూ రూ.12,008 కోట్ల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను విక్రయించారని ఏడీఆర్ తెలిపింది. వీటిలో బీజేపీకి రూ.6,564 కోట్లు (సుమారు 55%) అందాయి. ఈ ఐదు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్‌కు అందిన విరాళాలు కేవలం రూ.1,135 కోట్లు (9.5%) మాత్రమే. అదే కాలంలో తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.1,096 కోట్ల విరాళం లభించింది. కాగా రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు పొందిన సొమ్మును స్తంభింపజేయాలంటూ మాజీ అధికారి ఈఏఎస్ శర్మ ఎన్నికల కమిషన్‌ను కోరారు. వివరాలు అందజేయడానికి లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకూ ఎస్‌బీఐ గడువు కోరిన నేపథ్యంలో ఎన్నికల బాండ్ల ద్వారా పార్టీలు పొందిన విరాళాలను ఎన్నికల కమిషన్ కానీ లేదా సుప్రీంకోర్టు కానీ స్తంభింపజేయాలని పలువురు నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు శాతం డీఏ పెంపు

(మొదటిపేజీ తరువాయి)

చేరుకుంటుంది. పెంపు 2024 జనవరి 1 నుంచే అమల్లోకి వస్తుందని కేంద్ర మంత్రి పియూశ్ గోయల్ తెలిపారు. తాజా నిర్ణయంతోదాదాపు కోటి మంది ఉద్యోగులు, పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారని అన్నారు. గురువారం ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి పియూశ్ గోయల్ మాట్లాడారు.

ఉజ్వల లబ్దిదారులకు వంట గ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న రాయితీ గడువును పొడిగించింది. ఒక్కో సిలిండర్‌పై ప్రస్తుతం ఇస్తున్న రూ.300 సబ్సిడీని ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికీ ఈ రాయితీని వర్తింపజేసింది. ఏడాదికి 12 సిలిండర్ల వరకు ఈ రాయితీ లభిస్తుంది. మార్చి 31తో ఈ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో క్యాబినెట్ సమావేశంలో ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల పది కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్ తెలిపారు. ప్రభుత్వ ఖజానాపై రూ.12 వేల కోట్ల భారం పడనుందని చెప్పారు.

పెట్టుబడిదారుల ప్రోత్సాహకాల పథకానికి ఆమోదం

ఉత్తర పూర్వ పరివర్తన పారిశ్రామికీకరణ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. పదేండ్ల పాటు ఉత్తర్ పూర్వ రూపాంతర పారిశ్రామికీకరణ పథకం-2024 కోసం వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్యం ప్రతిపాదనను ఆమోదించింది. మొత్తం రూ.10,037 కోట్లతో నిర్వహించనుంది. కొత్త యూనిట్లను స్థాపించడానికి, ఇప్పటికే ఉన్న యూనిట్ల విస్తరణను చేపట్టడానికి పెట్టుబడిదారులకు ఈ పథకం కింద ప్రోత్సాహకాలు అందుబాటులో ఉంటాయి.

ముడి జూట్‌కు కనీస మద్దతు ధర

2024-25 సీజన్ కోసం ముడి జూట్‌కు కనీస మద్దతు ధరలకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. 2024-25 సీజన్‌లో రా జూట్ ఎంఎస్‌పి (టిడిఎన్-3 మునుపటి టిడి-5 గ్రేడ్‌కి సమానం) క్వింటాల్‌కు రూ.5,335గా నిర్ణయించింది. ఇది మొత్తం దేశ సగటు ఉత్పత్తి వ్యయం కంటే 64.8 శాతం రాబడిని నిర్ధారిస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. కమీషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (సీఏసీపీ) సిఫారసుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. 2024-25 సీజన్‌కు ఎంఎస్‌పీ గత సీజన్‌తో పోలిస్తే ముడి జూట్‌కి క్వింటాల్‌కు రూ.285 పెరిగింది. ప్రస్తుత సీజన్ 2023-24లో, ప్రభుత్వం రూ.524.32 కోట్లతో 6.24 లక్షల కంటే ఎక్కువ ముడి జూట్‌లను రికార్డు స్థాయిలో సేకరించింది. దీనివల్ల దాదాపు 1.65 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని అన్నారు. జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జేసీఐ) ప్రైస్ సపోర్టు కార్యకలాపాలను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా కొనసాగుతుంది. అటువంటి కార్యకలాపాలలో ఏవైనా నష్టాలు ఉంటే, కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రీయింబర్స్ చేస్తుందని అని అన్నారు.

కేంద్రం సహకరించకపోతే కొట్లాడుతం..



మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కారిడార్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ముఖద్వారంగా నిలుస్తుందని చెప్పారు. భూముల కేటాయింపు, చాంద్రాయణ గుట్ట రక్షణ శాఖ భూముల లీజ్ రెన్యూవల్ చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాప్యం చేసిందనీ, తాము అధికారంలోకి రాగానే తక్షణమే అధికారులతో సమీక్షించి రక్షణ శాఖకు భూములు అప్పగించామనీ చెప్పారు. కేంద్రానికి రాష్ట్రం, రాష్ట్రానికి కేంద్రం పరస్పరం సహకరించుకోవడం వల్లే ఈ సమస్య త్వరగా పరిష్కారమైందన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో రాజీవ్ ఎలివేటెడ్ కారిడార్ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్టు గుర్తు చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో గంజాయి, డ్రగ్స్, పబ్బులు పెరిగాయి తప్పితే నగరాన్ని ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు.

రెండో దశలో 75 కిలో మీటర్ల మెట్రో విస్తరణ చేపట్టబోతున్నామని వెల్లడించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కేంద్రంతో భేషజాలకు వెళ్లం.. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలని, ఎన్నికలు ముగిశాక అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అభివృద్ధి కోసం భవిష్యత్‌లోనూ కేంద్రాన్ని అడుగుతూనే ఉంటామని, కేంద్రం సహకరించకపోతే కొట్లాడుతామన్నారు. తమ పోరాటం ఫలించిందని మాజీ మంత్రి కేటీఆర్ అంటున్నారని.. ఆయన ఏం పోరాటం చేశారని ప్రశ్నించారు. ట్విట్టర్‌లో వ్యంగంగా పోస్టులు పెట్టడం తప్పితే కేటీఆర్ చేసిందేమీ లేదన్నారు. తాము కేంద్రం నుంచి అనుమతులు తీసుకొస్తే కేటీఆర్ పోరాటం చేశారని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఇందిరాపార్కు వద్ద కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలని సూచించారు. కేటీఆర్ చచ్చుడో.. అభివృద్ధికి నిధులు వచ్చుడో తేలే వరకు దీక్ష చేపట్టాలన్నారు. ఈ దీక్షకు తమ కార్యకర్తలే కంచె వేసి కేటీఆర్‌ను కాపాడుతారని చెప్పారు.

స్నాతకోత్సవానికి రావడం సంతోషం కలిగించింది

కాలేజీ స్నాతకోత్సవానికి హాజరు కావడం సంతోషం కలిగించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జవహర్‌నగర్‌లోని సికింద్రాబాద్ ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ స్నాతకోత్సవ వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీలో ప్రతి విద్యార్థినీ అభినందిస్తున్నానని, కృషి, అంకితభావం మిమ్మల్ని ఇక్కడికి తీసుకొచ్చాయని చెప్పారు. సక్సెస్‌ను ఆస్వాదించాలి కానీ, ఎప్పుడూ బాధ్యతలను మరిచిపోవద్దన్నారు. మీరు చేసే పనులు మీ కుటుంబానికే కాదు.. కాలేజీకీ గుర్తింపును తీసుకొస్తాయన్నారు. ఏసీడీఎస్ మన సైనికుల పిల్లలకు సేవలందించడం సైన్యానికి, దేశానికి గర్వ కారణం అన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి

జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లో బాబు జగ్జీవన్ రామ్ భవన్‌ను సీఎం ప్రారంభించారు. జగ్జీవన్ రామ్ రాజకీయాల్లో ఉన్నంత కాలం గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీతో కొనసాగారని తెలిపారు. దేశంలో ఎన్నో సంస్కరణలకు కృషి చేశారని గుర్తు చేశారు. లోక్‌సభ స్పీకర్‌గా తెలంగాణ బిల్లుకు ఆమోదం తెలిపింది జగ్జీవన్ రామ్ కూతురు మీరాకుమారి అని, రాష్ట్రమంతా ఆమెను ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటుందన్నారు. దళితులు, గిరిజనులు, బీసీ, మైనార్టీలందరికీ ఒకే చోట ఇందిరమ్మ ఇండ్లు కేటాయించేలా అధికారులను ఆదేశించామని చెప్పారు. గతంలో రెసిడెన్షియల్ స్కూల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విడివిడిగా ఉండేవని, ప్రతి నియోజకవర్గంలో ఒకే క్యాంపస్‌లో గురుకులాలన్నీ ఉండేలా ఏర్పాటు చేసి కులాల మధ్య అంతరాలను చెరిపేయాలనుకుంటున్నామని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో శంకుస్థాపన చేశామని తెలిపారు. చదువు మీద పెట్టేది ఖర్చు కాదు పెట్టుబడి అని, చదువుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆకునూరి మురళి లాంటి వారికి చదువుకుంటేనే గుర్తింపు, గౌరవం వచ్చినట్టు తెలిపారు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని, ఒకసారి దొరల చేతుల్లో ఉంటే.. మరోసారి దళితుల చేతుల్లో ఉంటుందన్నారు. దొరలకు ఇష్టం ఉన్నా, లేకున్నా నేడు అసెంబ్లీలో గడ్డం ప్రసాద్‌ను అధ్యక్షా అని పిలవాల్సిందే అన్నారు. చదువును ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని, చదువే లక్ష్యంగా పెట్టుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

మేడిగడ్డ పగుళ్లు పరిశీలన

నవతెలంగాణ-భూపాలపల్లి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు బ్యారేజీలను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల బృందం గురువారం పరిశీలించింది. బుధవారం రాత్రి హన్మకొండలో బస చేసిన బృందం గురువారం ఉదయాన్నే జయశంకర్ జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ క్యాంప్ ఆఫీస్‌కు చేరుకుంది. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం అక్కడి అధికారులతో భేటీ అయ్యారు. అనంతరం బ్యారేజీ వద్దకు వెళ్లి ఏడో బ్లాక్‌లో కుంగిపోయిన ప్రాంతం.. దిగువ భాగంలో ఏర్పడిన పగుళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. గేట్ల సామర్థ్యం, కుంగుబాటుకు కారణాలపై ఈ కమిటీ పూర్తిగా అధ్యయనం చేయనున్నది. అక్కడి నుంచి మధ్యాహ్నం అన్నారం, సరస్వతీ బ్యారేజీలను సందర్శించారు. ప్రాజెక్టు లోపాలు, పునరుద్ధరణ అవకాశాలపై అధ్యయనం చేయనున్నారు. కాగా, ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల గడువు విధించిన సంగతి తెలిసిందే.

కుల్దీప్, అశ్విన్ మాయాజాలం

ధర్మశాల స్టేడియం. చుట్టూ మంచు కొండలు. అతి శీతల వాతావరణం. భారత్‌తో స్వదేశంలో విదేశీ పరిస్థితులు, విదేశీ జట్టుకు సుదూర స్వదేశీ పరిస్థితులు కనిపించే భిన్నమైన మైదానం. తేమ, పిచ్ స్వభావ రీత్యా స్వింగ్‌కు బ్యాటర్లు బెంబేలెత్తాలి. కానీ ధర్మశాల స్పిన్ టర్న్ తీసుకుంది. పేసర్లు నిప్పులు చెరిగే చోట స్పిన్నర్లు పది వికెట్లతో మాయాజాలం ప్రదర్శించారు. కుల్దీప్ యాదవ్ (5/72) ఐదు వికెట్ల ప్రదర్శనకు తోడు వందో టెస్టు మాయగాడు రవిచంద్రన్ అశ్విన్ (4/51), జడేజా (1/17) మెరువటంతో ఇంగ్లాడ్ తొలి ఇన్నింగ్స్‌లో 218 పరుగులకే కుప్పకూలింది.

చిచ్చర పిడుగు యశస్వి జైస్వాల్ (57), కెప్టెన్ రోహిత్ శర్మ (52 బ్యాటింగ్) అర్థ సెంచరీలతో దంచికొట్టారు. ఓపెనర్లు సెంచరీ భాగస్వామ్యంతో కదం తొక్కగా భారత్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా దూసుకెళ్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మరో 83 పరుగుల దూరంలోనే నిలిచింది. బంతితో, బ్యాట్‌తో ఇంగ్లాండ్‌ను బాదిన భారత్ ఐదో టెస్టు తొలి రోజు ఎదురులేని జోరు చూపించింది.

- కుల్దీప్ యాదవ్ ఐదు వికెట్ల మాయ
- ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ 218/10
- రోహిత్, యశస్వి అర్థ శతకాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 135/1
ధర్మశాల టెస్టు తొలి రోజు





నవతెలంగాణ-ధర్మశాల

భారత స్పిన్నర్లు మాయ చేశారు. ధర్మశాలలో ఊరట విజయం ఆశించిన ఇంగ్లాండ్‌కు తొలి రోజే చుక్కలు చూపించారు. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (5/72), వందో టెస్టు మాయావీ రవిచంద్రన్ అశ్విన్ (4/51) మాయజాలంతో ఇంగ్లాండ్ విలవిల్లాడింది. తొలి ఇన్నింగ్స్‌లో స్టోక్స్‌సేన 218 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ జాక్ క్రాప్లీ (79, 108 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో రాణించినా స్పిన్ మ్యాజిక్ ముందు ఇంగ్లాండ్ బ్యాటర్లు తేలిపోయారు. బెన్ స్టోక్స్ (0), ఒలీ పోప్ (11) చేతులెత్తేయగా.. బెన్ డకెట్ (27), జో రూట్ (26), జానీ బెయిర్‌స్టో (29), బెన్ ఫోక్స్ (24) మంచి ఆరంభాలు దక్కినా స్పిన్‌కు చిత్తయ్యారు. తొలి రోజు 30 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన భారత్ 135/1 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌కు మరో 83 పరుగుల దూరంలోనే నిలిచింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (57, 58 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ రోహిత్ శర్మ (52 బ్యాటింగ్, 83 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో చెలరేగారు. శుభ్‌మన్ గిల్ (26 బ్యాటింగ్, 39 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు.

ఓపెనర్లు మెరిసినా.. :

ధర్మశాలలో కీలక టాస్ నెగ్గిన ఇంగ్లాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఉదయం సెషన్లో పేసర్లు బుమ్రా, సిరాజ్‌లు స్వింగ్ రాబట్టారు. బుమ్రా, సిరాజ్ నిప్పులు చెరుగగా.. ఇంగ్లాండ్ ఓపెనర్లు తప్పిదాలు చేస్తూనే ఉన్నారు. కానీ తొలి గంట ఆటలో పేసర్లను ఎదురొడ్డి ఓపెనర్లు నిలువటం ఆశ్చర్యం కలిగించింది. జాక్ క్రాప్లీ (79), బెన్ డకెట్ (27, 58 బంతుల్లో 4 ఫోర్లు) తొలి వికెట్‌కు శుభారంభం చేశారు. ప్రమాదకర పేసర్లకు వికెట్ ఇవ్వకుండా క్రీజులో నిలబడ్డారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని చైనామన్ కుల్దీప్ విడదీశాడు. తొలి ఓవర్లోనే బెన్ డకెట్‌ను సాగనంపాడు. లెగ్‌సైడ్‌లో గిల్ సూపర్ క్యాచ్‌తో తొలి వికెట్‌లో భాగమయ్యాడు. ఒలీ పోప్ (11, 24 బంతుల్లో) ఎంతోసేపు క్రీజులో నిలువలేదు. కుల్దీప్ ఓవర్లో క్రీజు వదిలి ముందుకొచ్చిన పోప్.. మళ్లీ వెనక్కి వెళ్లాల్సి రాలేదు. జురెల్ మెరుపు స్టంపింగ్‌తో ఇంగ్లాండ్ 100 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. ఓపెనర్ జాక్ క్రాప్లీ 9 ఫోర్లతో 64 బంతుల్లో అర్థ సెంచరీ సాధించి ఇంగ్లాండ్‌ను నడిపించాడు. తొలి సెషన్లో ఇంగ్లాండ్ 25.3 ఓవర్లలో 100 పరుగులు చేసింది. పేస్‌కు అనుకూలించే సెషన్లో రెండు వికెట్లనూ స్పిన్నర్ పడగొట్టడం విశేషం.

మాయకు విలవిల :

తొలి సెషన్‌లో ఇంగ్లాండ్, భారత్ సంతృప్తికర ప్రదర్శన చేయగా.. లంచ్ విరామం తర్వాత కథ మారింది. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్‌కు.. వందో టెస్టు మాయావీ అశ్విన్, లెఫ్టార్మ్ స్పిన్నర్ జడేజా జత కలిశారు. దీంతో వికెట్ల జాతర సాగింది. జో రూట్ (26, 56 బంతుల్లో 4 ఫోర్లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే పనిలో నిమగ్నమైన జాక్ క్రాప్లీని కుల్దీప్ సాగనంపాడు. క్రాప్లీ వికెట్లను గిరాటేసిన కుల్దీప్.. వందో టెస్టు హీరో జానీ బెయిర్‌స్టో (29, 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఉత్సాహంపై నీళ్లు చల్లాడు. రెండు ఫోర్లు, సిక్సర్లతో జోరందుకున్న బెయిర్‌స్టో.. కుల్దీప్ బంతికి వికెట్ల వెనకాల క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. 175/3తో కుదురుకుంటున్న ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుదేలైంది. ఒక్క పరుగూ జోడించకుండానే ఇంగ్లాండ్ మూడు కీలక వికెట్లు కోల్పోయింది. వరుస ఓవర్లలో బెయిర్‌స్టో, జో రూట్, బెన్ స్టోక్స్ (0) పెవిలియన్ బాట పట్టారు. క్రీజులో కుదురుకున్న రూట్‌ను జడేజా అవుట్ చేయగా.. బెన్ స్టోక్స్ కుల్దీప్ మాయలో పడ్డాడు. కుల్దీప్ ఐదో వికెట్ తీయగా.. ఇంగ్లాండ్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. ఇక్కడ్నుంచి టెయిలెండర్ల కథ అశ్విన్ ముగించాడు. రెండు ఓవర్లలోనే నాలుగు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఇన్నింగ్స్ 50వ ఓవర్లో టామ్ హర్ట్‌లీ (6), మార్క్‌వుడ్ (0)లను అవుట్ చేసిన అశ్విన్.. ఇన్నింగ్స్ 58వ ఓవర్లో బెన్ ఫోక్స్ (24), జేమ్స్ అండర్సన్ (0)లను సాగనంపాడు. దీంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ 57.4 ఓవర్లలో 218 పరుగులకే ముగిసింది. ఓపెనర్లు మంచి ఆరంభాన్ని అందించినా ఇంగ్లాండ్ మెరుగైన స్కోరు చేయలేదు. చివరి ఏడు వికెట్లను 43 పరుగుల వ్యవధిలోనే కోల్పోయింది.

యశస్వి దూకుడు :

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (57) అర్థ సెంచరీతో చెలరేగాడు. షోయబ్ బషీర్ ఓవర్లో మూడు సిక్సర్లు సంధించిన జైస్వాల్.. మరో ఐదు బౌండరీలతో దండెత్తాడు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 56 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన యశస్వి ఈ క్రమంలో ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా విరాట్ కోహ్లి రికార్డును బద్దలుకొట్టాడు. అర్థ సెంచరీ అనంతరం బషీర్ ఓవర్లోనే ముందుకొచ్చి ఆడిన యశస్వి.. స్టంపౌట్‌గా నిష్క్రమించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (52 బ్యాటింగ్) ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 77 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. గిల్ సైతం రెండేసి ఫోర్లు, సిక్సర్లు బాదటంతో స్కోరు బోర్డు పరుగులు తీసింది. శుభ్‌మన్ గిల్ (22 బ్యాటింగ్) తోడుగా రోహిత్ శర్మ క్రీజులో అజేయంగా నిలిచాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 135/1తో కొనసాగుతున్న భారత్ మరో 83 పరుగుల తొలి ఇన్నింగ్స్ వెనుకంజలో నిలిచింది.

1000 టెస్టుల్లో వేగంగా వెయ్యి పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా యశస్వి జైస్వాల్ నిలిచాడు. 9 టెస్టుల్లోనే (16 ఇన్నింగ్స్‌లు) జైస్వాల్ ఈ ఘనత సాధించగా.. వినోద్ కాంబ్లి 12 టెస్టులు (14 ఇన్నింగ్స్‌లు), పుజారా 11 టెస్టులు (18 ఇన్నింగ్స్‌లు), మయాంక్ 12 టెస్టులు (19 ఇన్నింగ్స్‌లు), గవాస్కర్ 11 టెస్టులు (21 ఇన్నింగ్స్‌లు) ఆ తర్వాత స్థానంలో ఉన్నారు.

712 ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా విరాట్ కోహ్లి (655) రికార్డును యశస్వి జైస్వాల్ (712) అధిగమించాడు. ఓవరాల్‌గా సునీల్ గవాస్కర్ (774) తర్వాతి స్థానంలో నిలిచాడు.

50 టెస్టుల్లో అరంగ్రేటం చేసి ఏడేండ్ల తర్వాత కుల్దీప్ యాదవ్ 50 వికెట్ల క్లబ్‌లో చేరాడు. కానీ అత్యంత వేగంగా ఈ మార్క్ అందుకున్న స్పిన్నర్‌గా నిలిచాడు. కుల్దీప్ 1871 బంతుల్లోనే 50 వికెట్లు కూల్చగా.. అక్షర్ పటేల్ 2205, జస్‌ప్రీత్ బుమ్రా 2465 బంతులకు పడగొట్టారు. ఓవరాల్‌గా ఇంగ్లాండ్ స్పిన్నర్ జానీ బ్రిగ్స్ (1512) తర్వాతి స్థానంలో కుల్దీప్ నిలిచాడు.

స్కోరు వివరాలు

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : జాక్ క్రాప్లీ (బి) కుల్దీప్ 79, బెన్ డకెట్ (సి) గిల్ (బి) కుల్దీప్ 27, ఒలీ పోప్ (స్టంప్డ్) జురెల్ (బి) కుల్దీప్ 11, జో రూట్ (ఎల్బీ) జడేజా 26, జానీ బెయిర్‌స్టో (సి) జురెల్ (బి) కుల్దీప్ 29, బెన్ స్టోక్స్ (ఎల్బీ) కుల్దీప్ 0, బెన్ ఫోక్స్ (బి) అశ్విన్ 24, టామ్ హర్ట్‌లీ (సి) పడిక్కల్ (బి) అశ్విన్ 6, మార్క్‌వుడ్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0, షోయబ్ బషీర్ నాటౌట్ 11, జేమ్స్ అండర్సన్ (సి) పడిక్కల్ (బి) అశ్విన్ 0, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం : (57.4 ఓవర్లలో ఆలౌట్) 218.**

వికెట్ల పతనం : 1-64, 2-100, 3-137, 4-175, 5-175, 6-175, 7-183, 8-183, 9-218, 10-218.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 13-2-51-0, మహ్మద్ సిరాజ్ 8-1-24-0, రవిచంద్రన్ అశ్విన్ 11.4-1-51-4, కుల్దీప్ యాదవ్ 15-1-72-5, రవీంద్ర జడేజా 10-2-17-1.

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (స్టంప్డ్) బెన్ ఫోక్స్ (బి) షోయబ్ బషీర్ 57, రోహిత్ శర్మ బ్యాటింగ్ 52, శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ 26, ఎక్స్‌ట్రాలు : 0, **మొత్తం : (30 ఓవర్లలో వికెట్ నష్టానికి) 135.**

వికెట్ల పతనం : 1-104.

బౌలింగ్ : జేమ్స్ అండర్సన్ 4-1-4-0, మార్క్‌వుడ్ 3-0-21-0, టామ్ హర్ట్‌లీ 12-0-46-0, షోయబ్ బషీర్ 11-2-64-1.

నాదల్ ఔట్, నాగల్ ఇన్

ఇండియన్ వెల్స్ టెన్నిస్ టోర్నీ





కాలిఫోర్నియా : స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ నిష్క్రమణ.. భారత యువ కెరటం సుమిత్ నాగల్‌కు వరమైంది. 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల చాంపియన్ నాదల్ ఇండియన్ వెల్స్ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించని నాదల్.. ఇండియన్ వెల్స్ పోటీలో నిలువలేనని తెలిపాడు. 'ఇండియన్ వెల్స్ టోర్నీ నుంచి తప్పుకోవటం ఎంతో బాధగా ఉంది. ఇండియన్ వెల్స్‌లో ఆడటాన్ని నేను ఎంతగానో ఇష్టపడతానని అందరికీ తెలుసు. అందుకే ఎంతో ముందుగానే ఇక్కడికి చేరుకుని సాధన మొదలెట్టాను. కానీ గత వారం స్వీయ పరీక్షలో ఈ స్థాయి పోటీకి నేను ఇంకా సిద్ధంగా లేనని అర్థమైంది. అభిమానులకు, నాకు నేను అబద్ధం చెప్పుకోలేను. ఇది తేలికైన నిర్ణయం కాదు' అని నాదల్ ఓ ప్రకటనలో తెలిపాడు. రఫెల్ నాదల్ లేకపోవటం అభిమానులకు అతిపెద్ద లోటు అని ఇండియన్ వెల్స్ టోర్నమెంట్ డైరెక్టర్ టామీ హాస్ వ్యాఖ్యానించాడు. గాయంతో వరుసగా టోర్నీలకు దూరమవుతున్న నాదల్.. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌తో పాటు పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నాయి. నాదల్ ఫేవరేట్ మట్టికోర్టులో జరిగే ఈ రెండు ప్రతిష్టాత్మక ఈవెంట్లలో అత్యుత్తమ ప్రదర్శనతో నాదల్ వీడ్కోలు ప్రకటించే అవకాశం లేకపోలేదు.

ఇక ఫ్రెంచ్ యోధుడు తప్పుకోవటంతో సుమిత్ నాగల్ ఇండియన్ వెల్స్ ప్రధాన టోర్నీకి అర్హత సాధించాడు. అర్హత రౌండ్‌లో సుమిత్ నాగల్ రెండో మ్యాచ్‌లో ఓటమి పాలయ్యాడు. కానీ ప్రధాన డ్రా నుంచి ఎవరు తప్పుకున్నా.. అర్హత టోర్నీలో పోటీపడిన మెరుగైన ర్యాంకర్‌కు అవకాశం దక్కుతుంది. నిబంధనల ప్రకారం మెరుగైన ర్యాంక్ (101) కలిగిన సుమిత్ నాగల్.. నాదల్ స్థానంలో పోటీపడనున్నాడు. మెన్స్ సింగిల్స్ తొలి రౌండ్లో 2016 వింబుల్డన్ ఫైనలిస్ట్ మిలోస్ రావోనిక్ (కెనడా)తో నాగల్ తలపడనున్నాడు.

క్వార్టర్స్‌లో సింధు

ఫ్రెంచ్ ఓపెన్ 2024



పారిస్ : తెలుగు తేజం పి.వి సింధు క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో ఫామ్ అందుకున్న సింధు.. అదే జోరు ఫ్రెంచ్ ఓపెన్‌లో కొనసాగిస్తుంది. మహిళల సింగిల్స్ విభాగంలో పి.వి సింధు మూడు గేముల మ్యాచ్‌లో విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. అమెరికా షట్లర్ బీవెన్ జాంగ్‌పై 13-21, 21-10, 21-14తో సింధు మెరుపు విజయం సాధించింది. తొలి గేమ్‌లో నిరాశపరిచిన సింధు.. తర్వాత వరుసగా రెండు గేముల్లో దుమ్మురేపింది. ఏకపక్షంగా చివరి రెండు గేముల్లో గెలుపొంది క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపింది. 55 నిమిషాల మ్యాచ్‌లో సింధు సాధికారిక ప్రదర్శన చేసింది. పురుషుల సింగిల్స్‌లో మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్‌కు నిరాశే ఎదురైంది. 2-19, 12-21, 20-22తో వరల్డ్ నం.17 చైనీస్ తైపీ షట్లర్ చో చెన్ చేతిలో పోరాడి ఓడాడు. తొలి గేమ్ నెగ్గిన శ్రీకాంత్, రెండో గేమ్‌లో నిరాశపరిచాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌ను టైబ్రేకర్‌లో చేజార్చుకుని ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 నుంచి నిష్క్రమించాడు.

18 నుంచి టెన్త్ పరీక్షలు

- వెబ్‌సైట్‌లో విద్యార్థుల హాల్‌టికెట్లు
- 5,08,385 మంది హాజరు
- 2,676 పరీక్షా కేంద్రాల ఏర్పాటు


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయి. వచ్చేనెల రెండో తేదీ వరకు జరుగుతాయి. 5,08,385 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారు. ఇందులో 2,57,952 మంది అబ్బాయిలు, 2,50,433 మంది అమ్మాయిలున్నారు. వారి కోసం 2,676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు సబ్జెక్టుకు మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సైన్స్ సబ్జెక్టును రెండు విడతల్లో నిర్వహిస్తున్నామనీ, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌ను వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తేవడాన్ని నిషేధించామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుల కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామనీ, విద్యార్థులు 040-23230942 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. హాల్‌టికెట్లు, ముద్రించిన నామినల్ రోల్స్‌ను డీఈవోల ద్వారా సంబంధిత పాఠశాలలకు పంపించామని తెలిపారు. హెడ్మాస్టర్ల ద్వారా వాటిని తీసుకోవాలని కోరారు. www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామనీ, వాటిని విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మాధ్యమం, సబ్జెక్టులకు సంబంధించి ఏమైనా తప్పులుంటే సంబంధిత పాఠశాలల హెడ్మాస్టర్ల దృష్టికి తేవాలని కోరారు.

30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలి : డీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులకు 30 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ని అమలు చేయాలని డీటీఎఫ్ కోరింది. ఈ మేరకు పీఆర్సీ కమిటీ చైర్మెన్ శివశంకర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సోమయ్య, టి లింగారెడ్డి గురువారం కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. ఉద్యోగుల కనీస వేతనం రూ.32 వేలు, గరిష్ట వేతనం రూ.2,68,950గా ఉండాలని కోరారు. గతేడాది జులై ఒకటి నుంచి పీఆర్సీని అమలు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న 33.67 డీఏకు 30 శాతం ఫిట్‌మెంట్ కలిపి వేతన సవరణ చేయాలని కోరారు. పెరిగిన ద్రవ్యోల్బణం, పెరుగాల్సిన జీవన ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని వేతన సవరణ కమిషన్ సిఫారసులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి రాజిరెడ్డి, రాష్ట్ర అకడమిక్ సెల్ కన్వీనర్ బి రామకృష్ణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం ఘనం.. ఆచరణ శూన్యం

- 'ది స్కిల్ ఇండియా' వంటి కార్యక్రమాల తీరు
- ఐటీఐలపై వేల కోట్ల ఖర్చు.. ఫలితం మాత్రం నిల్
- అప్రెంటిషిప్‌లకు చెల్లింపులూ తక్కువే
- చట్టాల అమలులో కేంద్రానికి లేని చిత్తశుద్ధి
- అనుకూల కథనాలతో ప్రచారార్భాటాలు
- మోడీ సర్కారు తీరుపై యువతలో అసంతృప్తి



కేంద్రంలోని మోడీ సర్కారు ప్రవేశపెట్టే ఏ పథకమైనా.. తీవ్ర ప్రచారానికి నోచుకుంటున్నది. కానీ, అమలు తీరే అందుకు పూర్తి భిన్నంగా ఉంటున్నది. 2014లో కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. ఎన్డీయే రెండో టర్మ్ పూర్తి కావస్తున్న ఈ సమయానికీ.. మోడీ ప్రభుత్వం పలు పథకాలను, కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. కానీ, ప్రచారంలో ఉన్న శ్రద్ధను ఆచరణలో చూపెట్టలేకపోతున్నది. ఫలితంగా అనేక పథకాలు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవటం లేదు. అందులో ఒకటే 'ది స్కిల్ ఇండియా' కార్యక్రమం.

న్యూఢిల్లీ : దేశంలోని శ్రామిక శక్తిలో నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'మేకిన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా' విస్తృత ప్రచారాల్లో భాగంగా 2015, జులై నెలలో కేంద్రం దీనిని తీసుకొచ్చింది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామనీ, దేశంలో నిరుద్యోగాన్ని పారదోలుతామని హామీ ఇచ్చి మోడీ సర్కారు 2014లో అధికారంలోకి వచ్చింది. అయితే, అధికారంలోకి వచ్చాక ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోయింది. ఉపాధి కల్పనలు చేయలేకపోయింది. 'స్కిల్ ఇండియా'తో నైపుణ్యాలు మెరుగుపర్చి, ఉపాధి కల్పనకు తోడ్పాటునందిస్తామన్న మోడీ సర్కారు మాటలు వాస్తవానికి కార్యరూపం దాల్చలేదు. నిపుణులు సంతోష్ మెహ్రోత్రా భారత ఉపాధి సంక్షోభాన్ని విశ్లేషిస్తూ.. "2012 నుంచి ప్రభుత్వం, ప్రభుత్వ రంగంలో కూడా ఒక సంవత్సరం కంటే తక్కువ కాంట్రాక్ట్‌తో అనధికారిక ఉద్యోగాల వాటా పెరిగింది. ఇది శ్రామికశక్తిని, నిరుద్యోగ యువతను నిరుత్సాహపర్చే అంశం" అని అన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం.. నిరుద్యోగులపై భారం

ఐటీఐలు, పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన కార్మికులను అందించే, విద్యావంతులైన యువతకు నిరుద్యోగం తగ్గేలా చూడాలనే లక్ష్యంతో వారి క్రాఫ్ట్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్ (సీటీఎస్) కింద యువతకు ఒకటి నుంచి రెండు సంవత్సరాల వరకు వృత్తి నైపుణ్య శిక్షణను అందిస్తారు. ప్రస్తుతం దేశంలో 14,789 (ప్రభుత్వ, ప్రయివేటు) వద్ద ఉన్న ఐటీఐలు 1950లలో తయారీలో నైపుణ్యం కలిగిన కార్మికులను పెద్ద ఎత్తున అందించటానికి స్థాపించబడ్డాయి. అయితే, కేంద్రంలోని మోడీ సర్కారు మాత్రం వీటిని నిర్లక్ష్యం చేస్తున్నది. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద 1.1 కోట్ల మంది ప్రజలు నైపుణ్యం పొందారని నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొన్నది. స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నిరుద్యోగ భారాన్ని యువతపై మోపారు. యువతకు నైపుణ్యం లేకపోయినా దేశంలో చాలా ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు.

యువతలో నైపుణ్యాభివృద్ధి జరగలేదు : నిపుణులు

దేశంలోని యువతకు, నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధి జరగలేదనీ, ఇప్పటికీ వారు నిరుద్యోగ సమస్యను, ఉద్యోగాల్లో ఉన్నవారు తక్కువ వేతన సమస్యను ఎదుర్కొంటున్నారని కొందరు నిపుణులు చెప్తున్నారు. జీన్ డ్రేజ్ గణాంక అంచనాల ప్రకారం.. 2014-15 నుంచి 2021-22 మధ్య వాస్తవ వేతనాల వృద్ధి రేటు సంవత్సరానికి 1 శాతం కంటే తక్కువగా ఉన్నది. స్కిల్లింగ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో చేరిన తర్వాత కూడా, ఉద్యోగం సాధించడం కష్టమని విద్యార్థులు చెప్తున్నారని కొందరు పరిశోధకులు వివరిస్తున్నారు. గుజరాత్‌లోని దేడియాపాడులో గల ఐటీఐలోని ఆదివాసీ విద్యార్థులు మాట్లాడుతూ.. "ఈ అభివృద్ధి మా కోసం కాదు. ఇతరుల కోసం, ఇతర పెత్తందారీల కోసం. మేము ఆదివాసీలు ఎప్పుడూ అట్టడుగున ఉంటాం. మా భూములు, అడవులను ప్రభుత్వం లాక్కుంటుంది. మేము మాత్రం చిన్నపాటి పని కోసం వెతుక్కోవాల్సి ఉంటుంది" అని అన్నారు.

'ఐటీఐలకు ప్లేస్‌మెంట్ పెద్ద సవాలే'

ఐటీఐలకు ప్లేస్‌మెంట్ పెద్ద సవాలుగా ఉన్నదని పలువురు ప్రిన్సిపాల్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో చాలా మంది గ్రాడ్యుయేట్లు ఉన్నప్పటికీ ఉద్యోగం కోసం ఎక్కువ దూరం వారు వెళ్లలేరనీ, స్థానికంగా తక్కువ వేతనాలతో నిలదొక్కుకోలేక ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. నైపుణ్యాల సముపార్జనకు విద్యాసంస్థల్లో శిక్షణ సరిపోదని, అందువల్ల విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్ పొందడానికి పరిశ్రమల్లో అప్రెంటీస్‌గా ఉండాలని గ్రహించి 1961లో అప్రెంటిస్‌షిప్ చట్టం తీసుకొచ్చింది అప్పటి ప్రభుత్వం. ఈ చట్టం ప్రకారం.. పరిశ్రమలు ఉన్న రాష్ట్రంలోని కనీస వేతనంలో కనీసం 70 శాతం అప్రెంటిస్‌లకు చెల్లించాలి. అయితే, ఆ చెల్లింపులు సైతం ఇప్పుడు సక్రమంగా జరగటం లేదనీ, చట్టం అమలు పేలవంగా ఉన్నదనీ, ప్రభుత్వాధికారుల పర్యవేక్షణ లోపించి.. అప్రెంటీస్‌లు ఇబ్బందులు పడుతున్నారని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు.

మోడీ పాలనలోని అస్తవ్యస్త ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాల కొరత, అప్రెంటిస్‌షిప్ కాంట్రాక్టులలో లోపాలు, పరిశ్రమలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవటం కారణంగా దేశంలోని విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. నైపుణ్యాభివృద్ధిలో భాగంగా స్కిల్ ఇండియా వంటి ప్రోగ్రామ్‌ల అమలులో భాగంగా ప్రభుత్వ ఐటీల కోసం వేల కోట్లు వెచ్చిస్తున్నా.. అందుకు తగిన ఫలితాలు మాత్రం రావటంలేదని పరిశోధకులు అంటున్నారు. ఐటీల ప్లేస్‌మెంట్ రేటు 0.1 శాతం కంటే తక్కువగా ఉన్నదన్న నిటి ఆయోగ్ గణాంకాలను వారు ఉదహరిస్తున్నారు.

ప్రధాని అవాస్తవాలు

2022లో తన పుట్టినరోజున ప్రధాని మోడీ 40 లక్షల మంది ఐటీఐ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. నైపుణ్యాలపై వారికి సందేశమిచ్చారు. గత ఎనిమిదేండ్లలో ఐటీఐల్లో నాలుగు లక్షలకు పైగా సీట్లు వచ్చాయనీ, విద్యార్థులకు కొత్త అవకాశాలు, ఉద్యోగాలు కల్పిస్తున్నామంటూ విద్యార్థులు పడుతున్న నిరుద్యోగ వాస్తవికతను పూర్తిగా కప్పిపుచ్చుతూ మోడీ ప్రసంగించారు. దేశంలో నిరుద్యోగ రేటు గతేడాది అక్టోబరులో 10.05 శాతానికి పెరిగిందని పలు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది రెండేండ్లలో అత్యధికం కావటం దేశంలోని నిరుద్యోగ తీవ్రతకు అద్దం పడుతున్నదని విశ్లేషకులు అంటున్నారు. మోడీ స్వంత రాష్ట్రం గుజరాత్‌లోని దేడియాపాడ గ్రామంలోని యువకులు ఏడాదిలో కొన్ని నెలలు కాంట్రాక్టు కార్మికులుగా తీసుకునే మధ్యవర్తులపై ఆధారపడుతున్నారు. అక్కడి ఆదివాసీలకు సాగు తప్ప వేరే జీవనోపాధి లేదు. గుజరాత్‌లోని ఒక ఐటీఐలో ఫిట్టర్ కోర్సు చేసి, స్థిరమైన ఆదాయ వనరు లేకుండా ఇప్పుడు గ్రామానికి తిరిగి వచ్చిన యువకులు అక్కడ చాలా మంది ఉన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ తర్వాతే డీఎస్సీ నిర్వహించాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 ప్రిలిమ్స్ తర్వాతే డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే చివరి వారంలో సివిల్స్ ప్రిలిమ్స్, జూన్ తొమ్మిదిన గ్రూప్-1 ప్రిలిమ్స్ ఉన్నాయని తెలిపారు. జూన్ చివరి వారం లేదా జులై మొదటి వారంలో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించాలని సూచించారు. అందుకు తగ్గట్టు షెడ్యూల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త నోటిఫికేషన్ ప్రకారం పూర్తి స్థాయిలో సిలబస్ ఇవ్వాలని కోరారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు ఇంతవరకు పూర్తి స్థాయిలో సిలబస్ ఇవ్వలేదనీ, వెంటనే విడుదల చేయాలని తెలిపారు. 95 శాతం స్థానికులకు పోస్టులు ఉండగా మిగిలిన ఐదు శాతం స్టేట్ ఓపెన్‌లో అన్ని జిల్లాలకూ అవకాశమివ్వాలని సూచించారు.

13 మందిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు


- ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథమెటిక్స్-2బి, జువాలజీ, హిస్టరీ పేపర్-2 పరీక్షను నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 3,75,157 మంది దరఖాస్తు చేయగా, 3,66,389 (97.7 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 8,768 (2.3 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కరీంనగర్‌లో ఇద్దరు, వికారాబాద్‌లో తొమ్మిది, ములుగులో ఇద్దరు చొప్పున కలిపి మొత్తం 13 మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్-2బి, జువాలజీ, హిస్టరీ పేపర్-2 పరీక్షకు సెట్ సీ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. ఆసిఫాబాద్, వరంగల్, హన్మకొండ, సిరిసిల్ల, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు వెళ్లి పరీక్షను పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్ష ప్రశాంతంగా, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జరిగిందని తెలిపారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.




























































Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.